

ఆంధ్రపత్రిక
సంక్రాంతి
సచిత్ర
వార
పత్రిక
4 అణాల
18-1-56



భోగిమంట

చిత్రకారుడు: కేతినీడి భాస్కరరావు.



పౌష్యశ్రీ

చిత్రకారుడు: వడ్డాది పాపయ్య.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:

"పండుగనాటి ఉదయం" - చిత్రకారుడు: [illegible] భాస్కరరావు

కథలు:

ఊరు నిద్రపోయింది—డా. రఘునాథరావు 4
సుమిత్ర—అవసరాల రామకృష్ణారావు 14
[illegible]—[illegible] చంద్రమౌళిశాస్త్రి 22
[illegible]—"బాలకృష్ణ" 25
సూర్యుని రథం—(పాశ్చాత్య పౌరాణికగాథ) 55
మాతృదేవత—శాంతి కృష్ణమూర్తి 60
ఇద్దరన్నదమ్ములు—గుత్తా [illegible] 62

కవిత:

చిత్రసంక్రాంతి—[illegible]. [illegible]శాస్త్రి 8
సంక్రాంతిగీతం—[illegible] ప్రసాద్ 24
[illegible]—రాయప్రోలు సుబ్బారావు 29
[illegible] సంక్రాంతి—[illegible] 54

సీరియల్:

[illegible]—[illegible] 81

సినిమా:

గతసంవత్సరం తెలుగుచిత్రాల [illegible] 36
[illegible] శ్రీ బి. ఎన్. రెడ్డి అభిప్రాయాలు 42
[illegible] 44

వ్యాసాలు:

[illegible] 18
[illegible] 47
[illegible] (వనితాలోకం) 49
[illegible] (బాలలోకం) 50

త్రివర్ణచిత్రం:

[illegible] 84, 85

[illegible]

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 40
సంచిక 20
18-1-56

మన్మథ పుష్య శుద్ధ పంచమి బుధవారం

పాఠక మహాశయులకు సంక్రాంతి అభినందనలు!

సర్వజనులకూ సంతోషప్రద మైనది సంక్రాంతి పండుగ! మీ సంతోషం ఇనుమడింపజేస్తూ వెలువడింది మా ప్రత్యేక సంచిక! ఈ శుభసమయంలో పాఠక మహాశయులకు ఆంధ్ర వారపత్రిక అభినందనలు అందజేస్తోంది.

మేము నడిపిన కథానికలపోటీ విజయవంతమైనది. 330 మంది రచయితలు పోటీలో పాల్గొన్నారు. వచ్చినకథలలో ప్రథమ, ద్వితీయ బహుమతులకు అర్హములని నిర్ణయించిన రెండు కథలను ఈ సంచికలో ప్రచురిస్తున్నాము.

ప్రథమబహుమతి "ఊరు నిద్రపోయింది" అనే కథ రచించిన వై, రఘునాథ రావుగారికి, ద్వితీయ బహుమతి "సుమిత్ర" అనే కథ రచించిన అవసరరాల రామకృష్ణ రావుగారికి ఇస్తున్నాము. బహుమతి విజేతలకు మా అభినందనలు తెలుపుకుంటున్నాము.

ఆంధ్రుల చిరకాల వాంఛితమైన విశాలాంధ్ర త్వరలో సిద్ధించనున్నది. తెలుగువారందరూ ఏకఛత్రచ్ఛాయలో దేశాభ్యుదయ పథంలో పురోగమించ గల శుభ దినం ఆసన్నమవుతోంది. విశాలాంధ్రసిద్ధితో మనకళలు, సారస్వతం, సంస్కృతి ఇతోధికంగా వికసించి విస్తరించగలవు. ఈ విశాలానికి ఆంధ్ర వారపత్రిక పఠితల, రచయితల సహకారంతో యథాశక్తి సేవ చేయగలదు.

ఊపిరి పోయింది

వై. రఘునాధరావు



మొదటి బహుమతి
పొందిన కథ

ఆ ఉత్సవం నాటి సాయంత్రం బజారంతా క్రిక్కిరిసి ఉంది. ఎక్కడా నడవడానికి కూడా జాగా లేదు. స్త్రీ, పురుషభేదం లేకుండా జనం ఒకరి నొకరు రాసుకు తిరుగుతున్నారు. ఆకాశంలో ఉండాల్సిన ఇంద్ర ధనస్సు నేలమీద జారిపడి తునాతునకలై తన రంగులన్నిటినీ రోడ్డుమీద జల్లింది.

ప్రసాదరావు తొడుక్కున్న చాకింటి చొక్కా, పంట్లాము, ఆ తొక్కిడికి పూర్తిగా నలిగిపోయాయి. అతనింకా వాటిని కాపాడు కోవా



లనే ఉద్దేశంతో ఎదురుగా వస్తున్న ఒక పులివేషం బృందాన్ని తప్పుకుందామని రోడ్డు పక్కకి గెంతబోయి ఒక పల్లెపడుచుమీద పడ్డాడు. ఆమె కోపంగా వెనక్కి తిరిగి ప్రసాదరావు వైపు కొరకొర చూసి "గం పాడు బుద్ధులమ్మా!" అని ఫక్కున నవ్వి వయ్యారంగా ముందుకు సాగిపోయింది. ఆమె తలకు రాసుకున్న నచ్చినూనె అతని చెంపనంతా జిడ్డు చేసింది. జేబు రుమాలుతో ఆ జిడ్డు తుడుచుకుంటూ కాసేపు ఊపిరి తీసుకోడానికి ఎక్కడైనా జాగా దొరుకుతుందేమో అన్నట్లు అతడు నాలుగు వైపులా చూసేడు.

"రండి బాబూ రండి లక్కీఛాన్స్ — లక్కీఛాన్స్. బేడకి అయిదు బేడలు — పావలాకి అయిదుపావలాలు — ఐదు రూపాయలకి పాతికా - తంత్రం లేదూ మంత్రం లేదూ - మీ చేతుల్తోనే కవర్లు తీయండి - లక్కీ ఛాన్స్. లక్కీఛాన్స్" అని దగ్గర్లోని ఒకస్టాలులోంచి కేకలు వినిపిస్తున్నాయి. అక్కడా 'జనం గుంపులుగానే ఉన్నారు. గాని తోపుడు లేదు. అంతా తనవైపు వీపులుతిప్పి ముందుకు వంగి నిల్చున్నారు. డబ్బుల శబ్దం గలగలా వినిపిస్తోంది. ప్రసాదరావు అక్కడికి నడిచి నిల్చున్నవారిలో ఇద్దరి తలల మధ్యలోన తల దూర్చేడు.

ఒక నలుచదరం బల్లమీద ఒకటి నుంచి పదిదాకా అంకెలు పదిగళ్ళలో రాసి" ఉన్నాయి. ఆ బల్లకి ఒకవైపు ఒక గళ్ళ లుంగీ, బనియనూ తొడుక్కున్న ఆసామీ ఒకడు సొమ్ము లెక్కపెడుతూ కూర్చున్నాడు. మధ్యపాపిడి, నొక్కు నొక్కుల జుట్టు. నోట్లో బారెడు చుట్ట ఉంది. వయసు కాస్త మీరినా శరీరంమీది కండలు ఇంకా సడలలేదు. మధ్యమధ్య చుట్ట బయటకితీసి ఒత్తుగా ఉన్న మీసాలని పక్కకి తోసి తుపుక్కున ఉమ్మి, చుట్టని మళ్ళీ యథాస్థానంలో ఉంచుతున్నాడు. బల్లకి మిగిలిన మూడువైపులా ముగ్గురు మనుష్యులు చుట్టూకూడిన జనందగ్గర సొమ్ము వసూలు చేస్తూ వాళ్ళ అంకెచెబితే ఆ అంకెలో సొమ్ముంచుతున్నారు. కూర్చున్న ఆసామీ పక్కనే ఒక తెరచిన ట్రంకుపెట్టె ఉంది. అందులో వరసాగ్గా కొన్ని కవర్లు ఉన్నాయి. సొమ్ముకడుతున్న వాళ్ళలో ఒకడు అందులోంచి ఒకకవరు బయటకుతీసి అతడికిచ్చేడు. గళ్ళలుంగీ ఆ కవరుని విలాసంగా మూడుసార్లు దులిపి దానిలోంచి ఓ అయిదు అట్టముక్కలు బయటికితీసేడు —

"మూడైదులూ, ఒక రెండూ, ఒక తొమ్మిదీ" అని ఆ అట్టముక్కల్ని ఆయా గళ్ళలోకి విసిరేడు. "ఈ బేడ ఎవరిదీ? యీ అరణాలు తీసుకోండి — పంతులుగారూ, ఇదిగో మీ రూపాయికి మరోరూపాయి — ఇదిగో మరోడా, నీ పావలా! అర్ధరూపాయి..." అలా సాగుతోంది వ్యవహారం అంతా ఒక పద్ధతిలో. "సాబ్ సఫా అన్నాడు ఆఖరికి సొమ్ము పంచుతున్న వాళ్ళలో ఒకడు. మళ్ళీ ప్రారంభమైంది. "కట్టండి బాబూ కట్టండి — లక్కీఛాన్స్, లక్కీఛాన్స్ — బేడకి అయిదు బేడలూ.."

ప్రసాదరావు ఒక చిన్న నవ్వు నవ్వేడు. అతడెప్పుడూ ఇటువంటి సాలెగూళ్ళలో ఒక పురుగవలేదు. తనికి జ్ఞానంవచ్చిన దగ్గర్నుంచి నేటివరకూ ఒక్క సిగరెట్టయినా తాగలేదు. ఒక పరస్త్రీనైనా అనవసరంగా తాకలేదు. కాఫీతప్ప మరే నిషా చేసే పానీయమూ పుచ్చుకోలేదు — గుర్రపు పందాలు కాని — చివరకి టి. బి. స్వీప్‌లుకూడా అతనెప్పుడూ కట్టడం ఎవరూ ఎరగరు. ఇంత కట్టుదిట్టమైన పెద్దమనిషిని ఆ ఊళ్ళో అంతా ప్రసాదరావుగురించి చెప్పుకుంటున్నందుకు ఆయనలో కాస్త అహం ఉందంటే మనం ఆయన్ని తప్పక క్షమించవచ్చు. ఇంతకీ ప్రసాదరావులోని ప్రత్యేకత ఏమిటంటే నైతికపతనంలో ఉన్న వ్యక్తుల్ని అతడు అసహ్యించుకోడు. వాళ్ళని చూసి జాలిపడతాడు సానుభూతి చూపిస్తాడు. వాళ్ళని మళ్ళీ సరైనమార్గంలోకి

★ ఊరు నిద్రపోయింది ★

తేవటానికి ప్రయత్నిస్తాడు. అతడి హృదయం బయటికి ఇరుకుగా కనుపించినా లోపల చాలా విశాలమైందని సమాజమంతా ఒప్పుకుంది. చాలాసార్లు ఆ విశాలత, హృదయంలో జాగా చాలక అతడి పెదిమలదాకా వచ్చేసి అక్కడినించి ఒక మందహాస రూపంలో వెలువడుతుంటుంది.

గుంపులోంచి ఒకాయన పెదిమలు కొరుక్కుంటూ వెనుతిరిగేడు. ప్రసాదరావు జాలిగా నవ్వేడు. పోతున్న వాడల్లా ప్రసాదరావు నవ్వును చూసి ఆగేడు.

"మీ దెంతపోయింది?" అన్నాడాయన.

"అబ్బే! నే నిప్పుడే వచ్చేను"

"అయితే నేనోమాట చెప్తాను వింటారా?"

"ఏమిటది?"

ఆయన ప్రసాదరావు రెక్క పుచ్చుకొని గుంపులోంచి జరజర బయటికి తీసుకొని వచ్చేడు.

"చూడండి. మీరెవరో నాలాంటి అమాయకులు లాగున్నారు. ఈ ముండాకొడుకులు అరగంటలో నావి పదిరూపాయలు అర్పేశారు. మీరుకూడా ఈ రొంపిలోకి ఎందుకు దిగుతారు?" అన్నాడు.

"అబ్బే. మీకా అనుమానం ఎందుకు ఉండాలి? నే నిలాంటి జూదాల్లో ఎప్పుడూ ఇరుక్కోను. అంతమంది జనంకూడుతే, లోపల ఏముందో అని చూడడానికి నిల్చున్నానంతే!"

ఆయనొకసారి నిట్టూర్చి "మీరెంత అదృష్టవంతులు!" అన్నాడు.

"మరి వెళ్తా"

"వెళ్లండిగాని మళ్లీ రాకండి" అని మున్నెంగా ఓ చీవాటు పెట్టేడు ప్రసాదరావు. ఆయన ముఖం కొంత ఎరుపెక్కింది. వెళ్లిపోతున్న వాడల్లా కాసేపు తటపటాయించి మళ్ళీ వెనక్కి వచ్చేడు.

"చూడండి... మరేం లేదూ.... మీ కభ్యంతరం లేకపోతే... మరి... ఓ కప్పు కాఫీ ఇప్పిస్తారూ?" అన్నాడు పక్కనున్న దుకాణంవైపు చూస్తూ.

"అయ్యో! ఎంతమాట. ఇదండి. ఈ పావలా తీసుకవెళ్లండి."

ఆయన చెయ్యిచాచి పావలా కాసు అందుకుని చటుక్కున జేబులో దాచేసుకున్నాడు దొంగతనం చేసినవాడిలాగు. ప్రసాదరావు ముఖం చూడకుండానే "మరి వస్తానుసార్" అన్నాడు.

"మీ పేరు చెప్పేరుకాదు."

"నన్ను జగన్నాథం అంటారండి" అని ప్రసాదరావుగురించి మరేమీ అడక్కుండా గుంపులోకి కలిసిపోయేడాయన.

"ఆ పావలా కాసు నాది..." అన్నాడెవడో గుంపులో గట్టిగా.

"పోవయ్యా అది నే కడితేను. ఏం నరసయ్యా! నేను కట్టడం నువ్వు చూడలేదూ?" అన్నాడు మరొకడెవడో.

"ఈ తప్పులు నాదగ్గర నడవవురోయ్ సామీ! అపావలా ఇటివ్వండి"

"ఏటయ్యా నీ దబాయింపు! అది నాదంటుంటే!"

గొంతుకలు హెచ్చేయి. కొట్లాట ప్రారంభం అయింది. స్టాలుచుట్టూ ఉన్న గుంపు లావయింది.

"ఒరేయ్ వీరాస్వామీ! ఆ గలభా ఏమిటో కాస్త కనుక్కో" ఆ సింహగర్జనకి ప్రసాదరావు ఉలికిపడి వెనక్కి చూసేడు. తన వెనకనే సబిన్స్పెక్టరు రామమూర్తినాయుడు సిబ్బందితో నిలబడివున్నాడు.

"గుడ్ ఈవెనింగ్ సార్" అన్నాడు నాయుడు.

"గుడ్ ఈవెనింగ్. ఏమిటి విశేషాలు?"

"ఆ! మా డైనులో విశేషాలకేమి కొదవ లెండి? ఇప్పుడు మీ ఎదురుగా జరగబోయే ఈ విశేషం చూడండి. ఏమోయ్ వీరాస్వామీ! ఎవరాకొట్లాట?"

"మన అప్పలనరసయ్య ఇక్కడ లాటరీ పెట్టేడండీ" అన్నాడా గుంపులోంచి కానిస్టేబు వీరాస్వామి.

"సరిసరి. మరేం చెప్పక్కర్లేదులే. ఇంకా చూస్తావేమ్రా! ఇక్కడున్న పోరంబోకు అందర్నీ లాఠీఛార్జి చెయ్యండి" అన్నాడు గట్టిగా నాయుడు. లబో లబోమని ప్రేక్షక మహాశయులూ, నటకులూ ఎక్కడ వాళ్ళక్కడ చెల్లాచెదరై పోలీసుల లాఠీలు ఎత్తకముందే రంగస్థలం అంతా ఖాళీ చేసేశారు. బల్లదగ్గర అప్పలనరసయ్య, అతడి ముగ్గురు అనుచరులూ మిగిలేరు. సబ్బిన్స్పెక్టరు తాపీగా అక్కడికి నడిచేడు.

"ఏరా నరిసిగా! లైసెన్సుందా?" అన్నాడు.

"బాబ్బాబు. ఈ ఒక్కరోజుకి మాత్రం నన్నొదిలిపెట్టండి. పిల్లలుగలోణ్ణి. తమరు కటాక్షించకపోతే మలమల మాడిపోతాను" అన్నాడు నరసయ్య.

"వీరాస్వామీ!"

"సార్!"

"ఈ వెధవని ఠాణాకి తీసుకవెళ్లి నే వచ్చేదాకా లాకప్‌లో ఉంచు."

ప్రసాదరావువైపు తిరిగి "వస్తానుసార్" అంటూ ముందుకు సాగేడు పరివార సమేతంగా.

"పదవోయ్ పద. నీలాంటి కొంపలార్పే వాళ్లు ఉన్నన్నాళ్లు ఈ ఊరు బాగు పడదు" అన్నాడు వీరాస్వామి.

"సాల్లేవోయ్. మా సెప్పొచ్చేవ్. ఒకరంగా - నేనలా ఓ చక్కరు కొట్టు కొత్తాను - అందాకా దుకాణం కొంచెం చూత్తుండు." అంటూ నరసయ్య తుండుగుడ్డ పైమీద వేసుకుని లేచేడు. తాపీగా ప్రసాదరావు దగ్గరకివచ్చి "చూత్తున్నారా బాబూ! దుకాణంతీసి రెండు గంటలేనా అయిందో లేదో రెండొందలు లోటొచ్చింది. ఇంతలో ఈ పోలీసోళ్ల పోరు! ఇలాగయితే మాలాంటి బీదోళ్లు బతకడం ఎలా?" అన్నాడు.

"సుద్దబద్ధం. పిడిమాటలునమ్మకండి పంతులుగారూ! దొంగ వెధవ. ఇప్పటికే ఎంతమంది దీపాలార్పేశాడో వీడు!" అన్నారెవరో గుంపులోంచి.

"నాకాడ రూపాయి పావలా కొట్టేసినాడు బాబూ" అన్నాడొకడు.

"పోవోయ్. రూపాయిపావలా అంటావు. నావి పదిహేనురూపాయలు పోయేయండీ" అన్నాడు మరొకడు. నా సొమ్ముపోయిందంటే నాసొమ్ముపోయిందంటూ అంతా ప్రసాదరావు చుట్టూచేరేరు అతడు వాళ్లందరికీ సొమ్ము పంచబోయినట్టు.

"పోయ్ నరసయ్యా. నీపేరు నరసయ్యే కదూ! ఇటుచూడు. నీ మీద ఎంతమంది ఫిర్యాదు చేస్తున్నారో!" అన్నాడు ప్రసాదరావు.

"అంతా దొంగ దావలు బాబూ! రూపాయిపోతే పదిరూపాయలు పోయేయంటారు" అన్నాడు నరసయ్య.

"అదిగో అక్కడే మళ్ళీ! పదిరూపాయలూ సొమ్మే. రూపాయీ సొమ్మే. ఇలా అన్యాయంగా నలుగురినోళ్లూ కొట్టేకంటే కొంత గౌరవంగా బతకరాదోయ్?"

"అదేటి బాబూ అలా శెలవిత్తారు? నా వృత్తి అరిది. మా కేటి మీలా సదువులున్నాయా, ఆస్తులున్నాయా, సెప్పడిం?"

"అదే అదే. ఆ వృత్తేదో పోలీసుస్టేషనులో తేల్చుకుందువుపద" అన్నాడు వీరాస్వామి.

"బావ్బాబు. నీ కాదాలుపుకుంటాను. ఇనస్పెక్టరు బాబుతో కొత్త చెప్పి నన్నా దిలించరూ. మీ పేరు చెప్పుకో యీ రత్రిరి ఇంట్లో దీపమెట్టుకుంటాను. ఈ రత్రిరి తర్వాత మళ్ళీ దు కాణం మెడితే ఒట్టు." అన్నాడు వరసయ్య.

"అదిగో మళ్ళీ! నువ్వు మరి దుకాణం తెరవనూ అంటేనే ఆయనతో ఏదో కొత్త చెప్పిచూస్తాను. లేకపోతే నీదారి నీది. నా దారినాది"

"నిత్తం. నిత్తం. తమరెలా అంటే అలానే కానివ్వండి"

"అయితే పరే నువ్వు ఠాణాలో ఉండు. నేనో గంటలో అలా తిరిగొచ్చి నాయుడు గారితో చెప్పిచూస్తాను."

వీరాస్వామీ, అప్పల న ర స య్యా ఠాణానికి పోయేరు.

"మీరు మరీ అమాయకులండీ. జూదగుండి వెధవకి కనికారం చూపించడం ఏమిటండీ?" అన్నాడొకడు.

"అక్కడే మీకూ నాకూ తేడావొస్తుంది. చూడండి. వాడూ మనలాంటి వాడే. మనిషై పుట్టేక తప్పులు చెయ్య కుండా ఉంటామా? జూదగుండి వాడని వాణ్ణి అంటున్నారు. మరి ఇక్కడ ఇంత సేపూ జూదమాడిన ఈ మాకో! వీళ్ళ నేమంటారు? కొత్త ఆలోచించండి." ప్రసాదరావు సాలోచనగా నలుగురివైపూ చూస్తూ కళ్ళజోడు తీసి అద్దాలు తుడిచి, దాన్ని మళ్ళీ యధాస్థానంలో ఉంచి మంద హాసం చేస్తూ ముందుకు సాగేడు. అప్పుడే చీకటి పడుతోంది. బజారులో బారులు తీర్చిన ఉత్సవంనాటి రథాలన్నీ విద్యుద్దీపాల కాంతుల్లో గంభీరంగా మెరుస్తున్నాయి. జనసమ్మర్దం లావవుతోంది. ప్రసాదరావు రథాలమీద బొమ్మలన్నిటినీ ఒక దాని తర్వాత ఒకటి చూసుకుంటూ ఇంటి దారి పట్టేడు.

* * *

వీధిసావడిలో కొందరు విద్యార్థులూ, రోటరీ క్లబ్బు అధ్యక్షుడూ అచ్యుతం అతడి కోసం నిరీక్షిస్తున్నారు.

"అరెరె. మీరంతా ఎంత సేపాయి వచ్చేరు? క్షమించాలి" అన్నాడు ప్రసాద రావు గుమ్మం దాటుతూ.

"మరేం గాభరా పడకూ. మేమంతా ఇప్పుడే అయిదూ పదీ నిముషాల క్రితం వచ్చేం." అన్నారు అచ్యుతం గారు.

"ఊరక రారు మహాత్ములు..."

"అబ్బే. అంత అవసరమైన పనేమీ కాదు. రేపు మన క్లబ్బు ఆహ్వానం మీద ఎస్. ఆర్. ఎ. ఇండియా బ్రాంచి సెక్రటరీ టెండుల్కర్ గారు మన ఊరు వస్తున్నారు. ఆ మీటింగ్‌కి నువ్వు స్వాగత పత్రం చదు వుతే బాగుంటుందని..."

"ఎంతమాట! మన్నాన్యించడం, నేను కాదనడమూనా? అలాగే కానీయ్."

"మరి నే వెళ్తొస్తానూ?"

"అదేమిటోయ్! కాసేపుండి కాఫీతాగు గాని తొందరేమిటి?"

"లేదోయ్! బ జా రు లో కొంచెం పనుంది." అచ్యుతంగారు వెళిపోయేరు.

"మీరెందు కొచ్చేరోయ్? నాటకం టిక్కెట్లా, చందాలా?" ఈ హాస్యానికి విద్యార్థులంతా ఫక్కున నవ్వేరు.

"చందాలేనండి. మొన్నటి పంజాబు వర దలకి మనకి తోచిన సహాయం మనమూ చేదామని..." అని నాస్చేడు అందులో ఒకడు.

"దానికభ్యంతరమూ? అలాగే కాని వ్వండి. ఎంత? నాపేర ఓ అయిదు రాసు కుంటారా?"

విద్యార్థులు కూడా వెళిపోయేరు.

బావమరది సావిట్లోకి వస్తూ "ఏం రోయ్ బావా! నువ్వీ ఊళ్లో ఇంత ఘరానాగా

విచిత్రసంక్రాంతి

పి. గణపతిశాస్త్రి

గణగణ గంగిరెద్ల మెడ గంటలు మెల్లగ మ్రోఁగ! విశ్వలాం
గన లవరంజి బొమ్మల నిగారము లొల్కుచు నిల్చు మాగ్వహాం
గణముల దీయతీయని సనాయి మనమ్ముల హాయినించె! తో
రణగణ శోభలో పసిమిరంజిలు పందిళులయ్యె వాకిళుల్!

రంగుల రంగవల్లిక హొరంగుల గుమ్మడిపూల నవ్వ రే
కం గిలిగింత పెట్టె జిరుకన్నుల హోలిక గొబ్బిళుల్! మనో
రంగములో మెరుంగు లెగురన్ వరికుచ్చుల బిచ్చుకల్ చెలం
గం గనుదోయి దోచెను! జగ మ్మొక మోహన వర్ణచిత్రమై!

చిక్కని మంచు నిల్చిన విచిత్ర సరోవరమైన విశ్వమం
దొక్కొకచో సువర్ణకమలోజ్జ్వలమై చలిమంట దోప, గం
పెక్కిన వేగుబోక విహరించె వినీల విహంగపాళి! న
ల్దిక్కుల బాలఖేల నినదించె నవోదయ రాగవీధులన్!

ఎందరు దక్షిణాపథ మహేంద్రులవోలె వెలింగిరో! పురా
సుందర సంస్కృతి స్థిర యశోమయులై జ్వలియింతు రాంధ్రనం
క్రందన సాతవాహన ధరాపరమేశులు! వారి వైభవా
నందము తథ్యమై తెలుఁగునాట మహోదయమై వెలుంగుతన్!

★ ఊరు నిద్రపోయింది ★

బతుకుతున్నారని ముందే తెలిసిఉంటే నా చెల్లెల్ని ఇవ్వకపోయి ఉందును సుమా!" అన్నాడు.

"ఏం?" అన్నాడు ప్రసాదరావు నవ్వుతూ.

"ఏమేమిటి? నాతో పోట్లాడడానికే నీకు తీరుబడి ఉండటం లేదూ?" అన్నాడాయన.

"ఇప్పటికేనా మించిపోయిందేమీ లేదోయ్. మీ చెల్లెలిచేత ఓ విడాకుల అర్జీ కోర్టులో దాఖలు చేయించు."

"నాకు విడాకులు తర్వాత ఇద్దరు గాని, వేణ్ణీళ్లు చల్లారి పోతాయ్. ముందు స్నానానికి లేవండి" అంది ప్రసాదరావు భార్య.

అంతా భోజనాలు చేసి తమలపాకులు వేసుకుంటుంటే అప్పన్న వచ్చేడు.

"అదుగో అప్పన్న వచ్చేడు. అప్పన్నా! ఆ బెడ్డింగూ, ట్రంకుపెట్టే జట్కాలో పర్దు. చూడూ, ఈరాత్రికి ఆ ఊళ్లోనే వీళ్ళింట్లో పడుక్కుని పొద్దున్నే వాళ్లు పెట్టిన అన్నం తిని తిరిగిరా."

"అలాగే బాబూ." అన్నాడు అప్పన్న.

అన్నయ్య జట్కా ఎక్కుతుంటే "ఏడి చేతి ఆయన మర్చిపోయిన పట్టుపంచ పంపించేయి అన్నయ్యా" అన్నది ప్రసాదరావు భార్య.

"అలాగే. వస్తానండీ బావగారూ" అన్నాడు బావమరది. జట్కా వెళ్ళిపోయిన కొద్దిసేపటికి.

"అరెరె. అప్పన్నని అడుగుదామనుకుంటూ మర్చిపోయేను చిన్నిగాడి కివాళ మధ్యాహ్నం ఓ అయిదురూపాయల నోటిచ్చి అయిదు నోట్లు ఎక్కడేనా మార్చి తీసుకరమ్మన్నాను. వా డింతవరకూ ఏం చేస్తున్నట్టు?" అన్నాడు ప్రసాదరావు భార్యతో.

"ఏమో. నాకేం తెలుస్తుంది? అయినా పుత్రరత్నం చేతులో పండుగపూటా ఐదు రూపాయలు పెడితే వాడూరుకుంటాడా?" అందామె.

"వాడలాంటి రకం కాదే! ఏమిటో గోల! ఏదీ! నా చొక్కా ఇలా తీసుకురా. వాడింటికివెళ్ళి కనుక్కొవస్తాను." అన్నాడు ప్రసాదరావు

ఆమె చొక్కా అందిస్తూ "ఆ పక్క జేబులో ఏభైరూపాయ లున్నాయి. అంత సొమ్ము జేబులో ఉంచుకొని ఏందుకు తిరుగుతారు?" అంది.

"కొంచెం పనుంది" అన్నాడతను చిరునవ్వుతో.

"ఏమిటో ఆపని ?"

"చెప్పుకో చూదాం ?" అంటూ ఆమె బుగ్గని సున్నితంగా చేతి వేళ్లతో లాలించి వీధి అరుగుమీదికి వచ్చేడు.

"ఆ, ఆ! తెలిసింది తెలిసింది." అన్నదామె.

గుమ్మం దిగుతున్న వాడల్లా చప్పున ఆగి వెనక్కి తిరిగి "ఏమిటో ?" అన్నాడు ఇంకా నవ్వుతూనే.

"ఫోండి. ఇవాళ నాకో మాంఛి చీర కొని తీసుకొస్తారు. అవునా ?" అంది.

"మొత్తానికి అసాధ్యురాలివే! అన్నట్టు చెప్పడం మర్చిపోయేను. ఇవాళ నేనూ, సుబ్బారావుగారూ, రెండో ఆట సినిమా ప్రోగ్రాం పెట్టుకున్నాం. తిరిగొచ్చేసరికి కొంచెం ఆలస్యం అవుతుందేమో!"

ఆమె ఒక నిట్టూర్పు విడిచి తలుపు వేసుకుంది. వీధి మలుపు తిరిగి ప్రసాదరావు పోలీసు ఠాణావైపు బయలుదేరేడు.

* * *

పౌర్ణమిరాత్రి - శరత్కాలపు టాకాశం కన్నెపడుచు యవ్వనంలాగుంది. ఊరి పొలిమేరల్లో పల్లపుజాగాలో ఉన్న పూరిళ్లన్నీ దూరంనించి ఓ వింత అందాన్ని, ప్రత్యేకతనీ కనపరుస్తున్నాయి. రోడ్డుమీద తొందరగా, ఒంటరిగా, నడుస్తూపోతున్న ప్రసాదరావుని చూసి సమీపంలోని శ్మశానంలో ఎముకలు వెదుక్కుంటున్న గుంటనక్క పొదల్లోకి పారిపోయింది.

సుబ్బక్క అప్పన్న ఇల్లు ఆ వీధి మొదట్లోనే ఉంది. ప్రసాదరావు "గంగీ" అని తలుపు తట్టేడు. లోనించి ఒక స్త్రీ గడియ తీసి తలుపు తెరిచింది.

"మీరా బాబూ! రండి. నేనే మీ ఇంటికాడికి వొద్దామనుకుంటున్నా" అన్నదామె. ఆమె చాయ కారునలుపైనా, శరీరంలో వంపులు జాస్తే! పక్కవాటుగా ముడివేసిన కొప్పులో ఒకే ఒక చామంతి పువ్వు తురిమింది. అతడు కూర్చోడానికి ఒక ముక్కాలు పీట వేసి గదిమధ్య కునికిపాట్లు పడుతున్న హరికేన్ లాంతరువత్తి హెచ్చించింది. గదిలో మూలఉన్న కుక్కి మంచం మీద ఒదిగి పడుకున్నాడు చిన్నిగాడు.

"ఏరా చిన్నీ! అదేం, పండగపూటే వాడలా పడుకున్నాడు ?" అన్నాడు ప్రసాదరావు.

"అదే సెబుదామని మీ ఇంటికాడకిప్పుడే బయల్దేరదామనుకుంటున్నా. ఇయాళ మద్దినాళ మీరాడికి ఐగురూపాయలనోటిచ్చినారంటగా" అందామె.

"ఆ ఇచ్చేనులే"

"ఆ సొమ్ము బజారుకు తీసుకెళ్ళి అదేందో దిక్కుమాలిన లాటరీలో తగలేసినాడంట దొంగ సచ్చినోడు" అంది.

ఒక్క నిముషం దాకా ప్రసాదరావు నోటంట మాటరాలేదు. ఆఖరికో దీర్ఘశ్వాస విడిచి "మాఆవిడన్నట్టు తప్పంతా నాదేలే. ఇలాటిదేదో అయి ఉంటుందని నేననుకుంటూనే ఉన్నా. పోతే పోయిందిలే వెధవ సొమ్ము లేరాచిన్నీ. అలా బజారుకు వెళదాంలే" అని మంచంవద్దరికి వెళ్లి చిన్నిగాడిని తట్టేడు ప్రసాదరావు.

"ఆ దొంగయదవని మళ్ళీబజారుకెందుకు తీసుకెళతారు ? ఆడిలాగే ముక్కుతూ పడి ఉండనీయండి" అందామె


చిన్నిగాడీమాటలకి మరింత ముడుచుకున్నాడు.

"అబ్బబ్బ నువ్వొకర్తెవు పానకంలో పుడకలాగ ఏదో కుర్రవెధవ. తెలియక చేసేడు. దాని కింత రాద్ధాంతం ఎందుకు? లేరాలే. మీ అమ్మ జట్టుండొద్దు. దాన్నొకర్తెనూ ఇక్కడ వదిలేసి మనిద్దరం పోదాం పద" అన్నాడతడు.

చిన్నిగాడికింతకంటే మంచి అవకాశం మరి దొరకదు. వాడు చప్పున లేచి వాళ్ళమ్మవైపు కొరకొరచూస్తూ కొయ్యకి తగిలించిన కొత్తచొక్కా తొందరగా తొడుక్కున్నాడు

"ఆడికి తిరిపాలెంకి జట్కా కడుతున్నాడంటగా?" అని అడిగింది గంగి మొగుణ్ణి ఉద్దేశిస్తూ.

"అవును మాబావమరది చెప్పేడివాళ"



రంగవల్లి

చిత్రకారుడు: పి. ఎల్. నరసింహమూర్తి.

ఊపిరి ప్రపోయింది ★

"మరికే క్షిరి కొస్తాడా?" అంది.

"ఏం? వాడు రాకుంటే నీవు నిద్ర పట్టదా?"

"అదేటి బాబూ, పుల్రోడిదగ్గర ఆ పరాచి కాలా?" అంది గంగి చిరుకోపం ప్రదర్శిస్తూ.

ప్రసాదరావు మందహాసం చేస్తూ రోడ్డు మీదకొచ్చేడు. చిన్నిగాడు పాకలో ఉన్న గుర్రానికి వాలుగుగడ్డి పరకలు వేసి, దాని మెడ మీకసారి ప్రాదరంగా నిమిరి చేతులు లాగుకు తుడుస్తూ బయటకొచ్చేడు.

"అప్పన్న ఇవాళ రాత్రి అక్కడే ఉండి రేపు పొద్దున్న వస్తాడు. పాపం ఎంత కష్టం!" అన్నాడు ప్రసాదరావు. గంగి ఛడీ మని తలుపు వేసేసుకుంది.

లబజఘాని, సౌకరూ, శ్మశానవాటిక దగ్గర కొచ్చేరు.

"బీడీ ముట్టించుకొస్తాను బాబూ" అని చిన్నిగాడు శ్మశానంలో దూరేడు. కొద్ది దూరంలో ఆరుతూ ఆరుతూ ఉన్న చితి లోంచి రెండు నిప్పుకణికలు వేళ్ళతో బయటికి దొర్లించి వాటితో బీడీ ముట్టించేడు. దూడుదుమ్ములు గుండెలోకి లాగి గబగబావచ్చి ప్రసాదరావుని కలుసు కున్నాడు. వీళ్లు కొద్దిదూరంలోగానే చాలా ళ్లోంచి నక్క అన్న అర్పులుంఘంపుల్ని పోగొట్టుకున్నట్టు దుర్యాణ్ణ దుర్యాణ్ణమని ఆలాపించసాగేయి.

బజారుమలుపు తిరుగుతూనే ఒకాయన్ని ఆపి "జంగమయ్యా! అమ్మవారు రెన్ని గంటలకి ఊరేగుతుంది?" అని అడిగేడు ప్రసాదరావు.

"ఇంకేద బాబూ! దుప్పెయాదుపేటలకి అదుపేటలే ఆ తల్లికి ఉపారం పెట్టినారు. మిగతాపేటల మొక్కులన్నీ తెల్లించాల, అమ్మవారి అలకరీరాల-అప్పటి మాటగదా!" అంటూ వెళ్లిపోయేడా ఆసామి.

బజారులోని జనప్రవాహంలో కలిసి పోయేక ప్రసాదరావు, వెన్నెల తమతమ విలువల్ని పూర్తిగా పోగొట్టుకున్నట్లయింది. రథాలమీది పురాణ పురుషుల బొమ్మల్ని చూస్తూ నడుస్తున్న చిన్నిగాడితో ప్రసాదరావు అన్నాడు. "ఏరా చిన్నీ, నేరుగా బంగారయ్య బట్టల దుకాణానికి వెళదాం. అక్కడో చీర కొని నీకిస్తాను అది మా ఇంటికి తీసుకెళ్ళి అమ్మగారి కిచ్చేయ్. అక్కడే భోంచేసి అమ్మగారికి సాయంగా అరుగుమీద పడుకో. నేనివాళ రెండో ఆట సినీమాకి వెళుతున్నాను."

"అలాగే బాబూ" అన్నాడు చిన్ని గాడు.

రథాలన్నీ దాటేక బజారులోని దొమ్మి కాస్త పల్చబడింది. కొద్దిదూరంలో బంగారయ్య బట్టలదుకాణం కనిపిస్తోంది.

"అదిగో—అదేబాబూ" అన్నాడు చిన్నిగాడు ప్రసాదరావు చెయ్యి పట్టుకుని.

ఎవడురా? అని ప్రసాదరావు వాడు వేలు చూపిస్తున్న వైపు తలతిప్పేడు.

"రండి బాబూ రండి. లక్కీ ఛాన్స్, లక్కీ ఛాన్స్, వేడకి అయిదు వేడలు - పావలాకి అయిదు పావలాలు - అయిదు రూపాయలకి పాతికా - తంత్రం లేదూ మంత్రం లేదూ. మీ చేతుల్తోనే కవర్లు తీయండి. లక్కీ ఛాన్స్. లక్కీ ఛాన్స్."

అదేస్థలం - అదే జనం. ప్రసాదరావు కొన్ని ఘడియలు తటపటాయించి ఆ దుకాణం వైపు మెల్లిదిగా అడుగులు వేసు కుంటూ నడిచేడు.

"గుడ్ నైట్ సార్." అన్నాడు కాని సైబు వీరాస్వామి కాలుస్తున్న బీడీ ఆఖరు దమ్ము లాగి బయటకి పారేసి.

"ఏమోయ్ వీరాస్వామీ! దూపాలుసా రులో ఉన్నట్టున్నావే?" అన్నాడు ప్రసాదరావు.

"పండగ కదు బాబూ! అందుకని వబిన స్పెట్టరు గోరు మన నరిసిగాడికి ఈ ఒక్క రాత్రికి పెర్మిషన్ ఇచ్చేరు. అయినా లాటరీ లేని పండుగ ఏం పండగా అంట! చూడండి,

జనమంతా ఎలా సరదాగా ఆడుకుంటు న్నారో!" అన్నాడు వీరాస్వామి.

"ఆ! ఆ! అదే చూస్తున్నా. ఏమండోయ్ జగన్నాథంగారూ!"

జగన్నాథం గారికి వినిపించినట్టు లేదు. ఆయన "ఆ రెండో నంబరు మీది నాలుగు రూపాయలూ ఇలా ఇయ్యవోయ్" అంటు న్నాడు. ప్రసాదరావు ఆయన దగ్గరకి వెళ్లి భుజం మీద తట్టేడు. జగన్నాథం ఉలిక్కిపడి వెనక్కి తిరిగి ప్రసాదరావుని గుర్తుపట్టగానే ముఖం ఎర్రగా చేసేసుకున్నాడు.

"చూసేరా జగన్నాథంగారూ! ఇంత రష్‌లో కూడా మనం మళ్ళీ కలిసేం!" అన్నాడాయన వ్యంగ్యంగా.

జగన్నాథంగారు ఏదో సమాధానం ఇవ్వ బోయి ఏమీ తోచక ఆఖరి ప్రయత్నంగా పళ్లికిలించి ఓ నవ్వు పారేసేరు. ప్రసాద రావుకూడా అలాగే పళ్లికిలించి "ఇప్పటి దాకా ఎంత గెలిచారేమిటి?" అన్నాడు.

"గెలవడమేమిటి బాబూ! ఈ దొంగ సామాదిగోళ్ళు నాకాడవున్న మీా అయిదు రూపాయలూ అయిదు నిముషాల్లో గోరిగేసి నారు." అన్నాడు చిన్నిగాడు కోపంగా.

"పోవోయ్. సరిగా కట్టడం చేతకాక పోతే సరి. నేనూ సాయంత్రం సొమ్ము పోగానే అలాగే అనుకున్నాను. అసలు కీలకం ఇప్పుడు తెలిసింది. ఏదీ, ఇదా నా దగ్గర సొమ్మువడు తీసుకెళ్తాడో చూస్తాను." అన్నాడు జగన్నాథం.

"ఆ, అలాగం? అయితే ఇప్పుడే నంబ రేస్తుందో చెప్పండి చూదాం" అన్నాడు ప్రసాదరావు

"ఏదీ ఓ రూపాయి మూడో నంబరులో పెయ్యండి" అన్నాడు జగన్నాథం. ప్రసాద రావు పర్సులోంచి ఒక రూపాయితీసి మూడో నంబరులో ఉంచేడు.

"మూడు ఆర్లూ, రెండు మూళ్ళూ" అన్నాడు నరసయ్య కవరు విప్పిన తర్వాత. ప్రసాదరావు ఆశ్చర్యపడ్డాడు. తన రూపా యికి మరో రెండు రూపాయలు వచ్చేయి.

"ఏం, ఇప్పుడేమంటారు?" అన్నాడు జగన్నాథం.

"ఆ! అదో చేతిలోని రాయి మళ్లీ చెప్పండి చూదాం?" అన్నాడు ప్రసాద రావు.

"అలాగా! ఏదీ, ఈసారి పదోనంబరులో కట్టండి" అన్నాడు జగన్నాథం. పదో నంబరులో ఆ మూడు రూపాయలూ ఉంచేడు ప్రసాదరావు.

"రెండు ఒకట్లూ, రెండు ఎనిమిదులూ, ఒక పదీ" అన్నాడు నరసయ్య.

ప్రసాదరావు రూపాయి ఇప్పుడు ఆరు రూపాయలయింది. "భేష్. ఒప్పుకున్నా నండీ జగన్నాథంగారూ. మరి వెళ్తాను. గుడ్ నైట్" అని అక్కడినించి ఆలోచిస్తూ కదిలేడు ప్రసాదరావు.

"అరెరె. ఇలా వచ్చేరో లేదో అప్పుడే వెళ్ళిపోతున్నారా?" అన్నాడు జగన్నాథం.

"అవునండీ కొంచెం పనుంది" అన్నాడు ప్రసాదరావు ఈమాటలు జగన్నాథం విని పించుకోనే లేదు. ఆయన అప్పుడే "అదేమి టోయ్. ఆ రెండు రూపాయలూ అయి దులో పెట్టమంటే ఆరులో పెట్టేవ్? మార్చు మార్చు" అంటున్నాడు నరసయ్య తెప్పిసెంటు రంగడితో. ప్రసాదరావు అలా ఆలోచిస్తూనే రోడ్డుమీదికి వచ్చేడు. "ఒరే చిన్నీ"

"బాబూ."

"ఇదిగో. ఈ ఆరు రూపాయలూ తీసుకు పోయి ఖర్చు పెట్టుకో. ఇంటికిమాత్రం వేగంగా వెళ్ళు. ఏం?"

"మరి మీరో?"

"నువ్వు పో. నేను తీసుకొస్తాను"

చిన్నిగాడికి మరి రెండోసారి చెప్పా ల్సిన పని లేదు. వాడు ఎదురొస్తున్న జనాన్ని తోసుకుంటూ ఆ మూకలో కలిసి పోయేడు. చిన్నిగాడు వెళ్ళినవైపే దృష్టి ఉంచి కళ్లజోడుతీసి తాపీగా అద్దాల్ని తుడుస్తూ నిల్చున్నాడు ప్రసాదరావు

"నాలుగు ఆర్లూ, ఒక ఏడూ....కట్టండి బాబూ కట్టండి రూపాయికి అయిదు రూపాయలూ - పదిరూపాయలకి ఏభై - లక్కీ ఛాన్సు - లక్కీ ఛాన్సు" అని విని పిస్తోందతనికి సమీపంనుంచి......

* * *

నింగివీధి చందమామ అప్పుడే దిగజారు తున్నాడు. ఊరంతా వెన్నెల కప్పుకొని నిద్రపోతోంది "ఇంటిముందరా నిక్కడు పెట్టూ, ఎట్టగో తప్ప సాగకు కాద—కొమ్మ కొమ్మ సోకకుండా ..." అని గొంతెత్తి పాడుతూ వస్తున్నాడు రంగడు.

"ఒరే రంగా! పల్లకుండేవ్. మకాం లోని ఆడదయ్యాలుగాని నీపాట యిన్నా యంటే నీ వెంట వడతాయి సుమా" అన్నాడు నరసయ్య. మూడోవాడు విరగ బడి నవ్వేడు.

"మరి నరసయ్యా! ఇంకొక దమ్ము కానియ్. బాగా వస్తోంది. గూడేనికి పోదా!" అన్నాడు నాలుగోవాడు.

"అలాగే నేన్. ఇదిగో. ఈ సంచీ పట్టు కెళ్ళి ఆ జువ్విచెట్టుకింద సమాధి మీాద కూకోండి. నాను దేవరమందుకు సెల్లించు కొస్తాను" అని నరసయ్య చేతిలోని రెండు సంచుల్లో ఒకటి వాళ్ళకిచ్చి రెండో సంచీతో ముందుకు సాగేడు. రోడ్డుమీద పడుకున్న వీధికుక్కొకటి ఆ చేతిలోనిదేదైనా తిను బడి పదార్థమేమోనని వొక్కసారి లేచి, వళ్లు ఝాడించి, తోక ఆడిస్తూ అతడివెంట పడ్డది. సరాసరి జట్కా అప్పన్న యింటి కెళ్లి "గంగీ, గంగీ" అన్నాడు మెల్లిగా, తలుపుసందులోనొరుంచి లోనుంచి కొంత సేపటికి వరకూ ఏ అలజడీ లేదు. "ఎవరది? నరిసిగా?" అంది ఆఖరికి గంగి.

"ఆ ఆ! నేనే" అన్నాడు నరసయ్య. మళ్లీ కొంతసేపు నిశ్శబ్దం. కుక్కి మంచం కిర్రుమంది. గంగి మెల్లగా సంకెలుపు తీసి "ఏటిరా" అంది.

"పంతులున్నాడా?" అన్నాడు నర సయ్య గంగి ఊరుకుంది.

"వాణ్ణలా లోపలికి రమ్మను" అన్నా డతను చీకట్లో. వెన్నెలలో నించి వచ్చిన నరసయ్యకి లోపల బొత్తిగా ఏదీ కనుపిం చడం లేదు. రెండడుగులు లోనికివేసి కాళ్లలో పడ్డ మూక్కాలి పీటని ఓ తాపు తన్నేడు.

"ఏరా! కళ్లు కనిపించడం లేదేమిటి? నీ ఇక్కడికి రావద్దని ఎన్నిసార్లు చెప్పేను?"

"తమ రింటికెళ్ళే చిన్నిగాడు మీారు రెండో ఆట సినిమాకి రారని సెప్పేడు. అంగుకని రొంటంటే ఇక్కడికి వచ్చేనండి. మరి రేత్తిరి సొమ్ము నాకాడవుంటే ఖర్చయి పోద్దని..."

"ఏదీ కొత్తవే. ఆ సంచీ ఆ మూక్కాలి పీటమీాద ఉంచు. నాయుడు వంతు పంపిం చేసేవా?"

"చిత్తం చిత్తం. ఆ పెత్తయ్యగారి వీరాసామి అప్పుడే పట్టుకెళ్లినాడండి ఆ కాబులంతు."

"సరే నువ్వెళ్లు. అప్పుడప్పుడూ కని పిస్తుంటేం?"

"ఎంతమాట! తమరి కొలువు నే నెప్పుడు కాదన్నాను? దండాలు సామీ."

"మంచిది."

తలుపు వేసుకోడానికి వచ్చిన గంగికి కన్నుగీటి కృతజ్ఞత తెలిపి దారితీసేడు నర సయ్య. అతని ఈ చేష్టలు చూసి ఊర కుక్క ఒకసారి అతలించి మళ్లీ రోడ్డు కడ్డంగా పడుకుంది. "ఇంటిముందరా నిక్కడు పెట్టూ, ఎట్టగో తప్ప సాగదు కాదా .." అని హుషారుగా పాడు తున్నాడు సమీాపంలోనే రంగడు. ఊరు మాత్రం నిద్రపోతోంది. ★



డిస్ట్రిబ్యూటర్స్.

ఆంధ్రా స్టేట్ : నవయుగా ఫిలింస్, విజయవాడ

నైజాం [illegible] ఫిలిం కార్పొరేషన్, సికిందరాబాద్.

మైసూరు-బొంబాయి [illegible]

మకర సంక్రమణం

"వచ్చింది వచ్చింది వచ్చు సంక్రాంతి
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి"

దేశం నలుమూలలా పైరు పచ్చలతో పాడి పంటలతో, ఫల పుష్పాలతో ఎందుకూ తడుముకోవలసిన అవసరం లేని సమయంలో సంక్రాంతి పండుగ లక్ష్మిలా వస్తుంది. ప్రతిగృహం గ్రామ ప్రాంతాల్లో సరి క్రొత్త ధాన్యరాసులతో, ప్రాంగణాల్లో పూచిన బంగారు పూలతో, పెరట్లో కాచే, పూచే కూరపాదుల్లో కళకళ లాడుతూ, ఈ పండుగకు లక్ష్మీ నివాసంగా ఉంటుంది.

సంక్రాంతి-భోగి, సంక్రాంతి, కనుమ-అనే మూడునాళ్ల పండుగ. ఈ సంక్రాంతి పండుగతో ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభమౌతుంది. పండుగ నాలవదినం నుంచీ సావిత్రీగౌరీ నోములు ఆరంభిస్తవి. మిగిలిన పండుగ లన్నిటికంటే అధిక ప్రభావం కలదిగా ఈ పండుగను ఆంధ్రులు తమిళులూ భావిస్తారు.

వావిలాల సోమయాజులు

సంక్రాంతి పండుగ ప్రధానంగా సూర్యునికీ, సూర్యోపాసనకూ సంబంధించిన పండుగ. ఇది సూర్యగమనంలో ఒకమార్పును సూచిస్తుంది. సంక్రాంతి నాటికి సూర్యుడు ఉత్తర దిక్కుగా ప్రయాణం సాగించి రెండు వారాలు దాటి ఉంటుంది. కానీ ఆయన మకరంలో పుష్యశుద్ధ పూర్ణిమనాడు ప్రవేశించి నప్పటినుంచి గాని ఉత్తరాయణము ప్రారంభించటం జరగదని భారతీయుల భావన.

బలిరాజ్యం

ఆంధ్రదేశంలో సంక్రాంతి పండుగ మొదటిరోజును భోగిఅంటారు. భోగినాటి వరకు బలిరాజ్యంలో ఉన్నట్లు భావిస్తారు. సూర్యుడు దక్షిణంగా పయనిస్తున్నన్నాళ్లూ బలి రాజ్యం చేస్తున్నట్లు లోకం అజ్ఞానంతో నిండి ఉంటేటట్లు మనవారు తలచటంచేత సంక్రాంతి నుండి సూర్యుడు దేవమార్గమైన ఉత్తరాయణం ఆరంభించటంవల్ల ఆ శుభ సమయాన్నీ, ఆనందాన్నీ వెలిబుచ్చుతూ భోగిపండుగ చేస్తారు. భోగి ఇంద్ర సంబంధమైన పండుగనీ, మేఘనాథుడు అయిన అతనిని వర్షాలనూ, బలినీ అంతంచేసినందుకు ఇంద్రుణ్ణి పూజించటమనీ కొందరు తెలుస్తున్నారు. భోగినాటిసాయంత్రం మనదేశంలో ప్రతిఇంటా పిల్లలచేత బొమ్మలు పెట్టిస్తారు. ఇది అనాదికాలంనుంచీ వస్తున్న ఆచారం. 'బొమ్మ' బ్రహ్మ శబ్దానికి వికృతి. పూర్వం మనవారు దేవయానమైన ఉత్తరాయణ పుణ్యకాలం రావటంతోనే ఈ బొమ్మలపండుగద్వారా బ్రహ్మాది దేవతల పరిచయం బాలబాలికలకు కలిగే ఏర్పాటుచేశారన్నమాట! ఈ ఆచారంతో మనపూర్వులు జీవితాన్ని శిల్పచిత్రకళలతో

(65-వ పేజీ చూడండి)



"శ్రీ మద్రమారమణ గోవిందో హరి!"
చిత్రకారుడు: పి. నరేంద్ర

రెండవ బహుమతి పొందిన కథ

సుమిత్ర

అవసరాల రామకృష్ణరావు

చందమామ ఉన్నచోట జగమంతా వెన్నెల.

మాతృమూర్తి ఉన్నచోట మనసంతా వెన్నెల.

అలాంటి వెన్నెల్లో ఓ పల్లెని తల్లి ఒక చక్కని బాబును తొడ మీద పడుకోబెట్టుకుని జోకొడుతూ కథ చెబుతూంది.

'...అప్పుడు పిల్లి ఏమందిటా, 'అదేమిటి కొంగమ్మపిన్నీ, నేనేమిటి, నీ గుడ్లేమిటి తినడమేమిటి? ఇదెక్కడయినా ఉందా? ఉత్తిరోజుల్లోనే పచ్చి ఆచారం నాకు. అలాంటిది ఇవాళ భీష్మ ఏకాదశికదా...'

బాబు ఊ కొట్టడం మానేశాడు. సుమిత్ర కథ చెప్పడమూ మానేసింది.

'వెర్రి వెధవ! కథ చెప్పమని అడిగినంతసేపు పట్టలేదూ! ఎంత అమాయకంగా నిద్రపోతున్నాడో' అనుకుంది ఆమె. వెలిగిపోతున్న వెన్నెలలో వింతశోభలు వెదజల్లుతున్న ఆ అమాయకపు మూర్తివైపు అలాచూస్తూ ఉండిపోయింది. ఆ తల్లి హృదయంలో ఏం గిలిగింతలు కలిగాయో చెప్పలేము. పిల్లాడ్ని గుండెల కదుముకుని అదేపనిగా ముద్దుల వర్షం కురిపించింది.

బుల్లి పెదవులు నలిగిపోయాయి. బూరి బుగ్గలు కందిపోయాయి. బాబు యిటూ అటూ కదిలేడు. వాడ్ని భుజంమీద వేసుకుని, డాబా దిగివచ్చి ఉయ్యాలలో వేసి ఊపే సరికి నిద్రపోయాడు.

మొహం మీద పడుతున్న జుత్తు వెనక్కి సద్దుకొని సుమిత్ర వంటింట్లోకి వెళ్ళి పాల గ్లాసునిండా పాలు నింపుకుని మావగారి గదిలోకి వచ్చింది.

ముసిలాయన మంచం మీద పడుకొని తల క్రింద చేతులు పెట్టుకొని ఏదో ఆలోచిస్తున్నాడు. కోడలు పాలగ్లాసు బల్లమీద పెట్టింది. ఆయన యిటు తిరిగేడు.

'దీపం ఆర్పేశావేం మావగారూ, వెలిగించనా?'

'అక్కర్లేదమ్మా, వెన్నెల బాగుంది. బాబు ఏడీ, యిలా తీసుకురా'

ఆ మనవడు, ఈ తాత ... ఆ యింటికి ఆద్యంతాలు...రెండు తరాల ప్రతినిధులు..

ఒకర్ని విడిచి ఒకరు అయిదు నిముషాలు ఉండలేరు.

బాబును తీసుకొచ్చి సుమిత్ర మావగారి పక్కలో పడుకోబెట్టింది.

'భాస్కరం రాలేదా?'

'లేదు. డిస్పెన్సరీనుంచి అలా సినిమాకి వెళ్ళేరుట. ఎన్నోసార్లు చెప్పేను, మిమ్మల్ని కూడా తనతో తీసుకెళ్ళమని. ఆయన నా మాట వినరు. నేనేం చేసేది చెప్పండి'.

ముసిలాయన ఈ మాటలు వినిపించుకున్నట్టే లేదు.

'ఇలా రా అమ్మాయ్' అన్నాడు.

సుమిత్ర రెండడుగులు ముందుకు వేసి తల వంచుకుని నిలబడింది.

'దగ్గరగా రా అమ్మా' సుమిత్ర దగ్గరకు వచ్చింది.

'కూర్చో' ముసిలాయన కోడలు తల ఆప్యాయంగా నిమురుతూ మొదలెట్టేడు

"చెడ్డను దుయ్యపట్టడమేగాని మంచిని పొగడ్డం మనుషులికి అలవాటు లేదు తల్లీ! నిన్ను ఎదురుగుండా పొగుడుతున్నానని ఆశ్చర్యపడుతున్నావేమో!...నాకేఇంతలా చేస్తున్నావుగదా, యిక మా యింట్లో వాళ్ళకి ఎలా చేసేదానివో ఏమిటో నా ఊహకేమీ అందడం లేదమ్మాయ్."

"మీ అభిమానంకొద్దీ అలాఅంటారుగాని ఇందులో నే పెద్దచేస్తున్నదేముంది మావగారూ! అయినా ఎవరివాళ్ళకు వారు చేసుకోడంలో వింతేముంది? నేను మీ కేం కయిదాన్ని, పరాయిదాన్నా?"

"కాదమ్మా కాదు. నేను నీకు పరాయివాడినెలా ఔతాను, నీ ఒడిలో పసివాడిని" సుమిత్ర మనస్సు పులకరించింది. అతను తన తనయుడు ఎంతో పెరిగిపోయినట్టూ తను చేరుకోవలసిన చోటు చేరువలోనే ఉన్నట్టూ అనిపించింది.

ముసిలాయన తనలో అనుకుంటున్నట్టు అన్నాడు.

"లేకపోతే ఏమిటమ్మా? నాకు సీతాఫలాలు ఇష్టమని, యింటికి మంచివి రావనీ యీ కుర్రాణ్ని ఎత్తుకొని పేరంటం కంపెట్టి నువ్వు పెద్దబజారుకు స్వయంగావెళ్ళి పళ్ళుఏరి కొని తెస్తే— ఈ వృద్ధుడికి తినిపిస్తే— అంతకన్న ఏమనుకోను? ఇలాంటి అభిమానం తల్లులకు పిల్లల మీద కాక మరెవరికుంటుంది?"

సుమిత్ర జవాబు చెప్పలేదు. ఏదో మరచి పోయినట్టు లేచి నిలబడింది.

"మీకు పాలు తెచ్చి యిద్దామని వచ్చాను. వచ్చి మాటలలో పడి ఆ మాటే మరచిపోయాను...ఏదో మనసులో పెట్టుకొని మీ రివాళ సరిగా భోజనమయినా చెయ్యలేదు. పాలు కాచి తెచ్చేను, తాగండి"

పాలగ్లాసు క్షణంలో చుక్క లేకుండా తాగేశాడు ముసలాయన.

"పాలతో ఒక్క మీగడతరక ఉన్నా నాకు డోకువస్తుంది. తక్కువ కాగితే తాగను. ఎక్కువ కాగి మీగడకడితే అసలే



“మరొక్కమారు స్తిమితంగా ఆలోచించు సుమిత్రా!”
“అన్నీ ఆలోచించే నేనీ నిశ్చయానికొచ్చాను.”

తాగలేను. మూడు పాతికలు దగ్గిర పడినా యిన్ని వయస్సు నాకు...మా అమ్మాయియినా ఉందిగాని అది పాలు కాచి తెస్తే ఏదో ఒక లోటు ఉంటూనే ఉండేది. కాని, తల్లీ ఎంత శ్రద్ధ నామీద నీకు! నువ్వు తెచ్చిన పాలు నిత్యమూ అమృతమే.”

సుమిత్ర గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది. ముసిలాయన మూతి కడుక్కున్నాడు. తువ్వాలు యిచ్చింది. తుడుచుకున్నాడు.

‘ఎప్పుడూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాను, ముందు జన్మలో అయినా నువ్వు నా కూతురివై పుట్టాలనీ—నా గుండెలోని వాత్సల్యమంతా నీకే పంచాలనీ...ముసిలాయన కంఠంతో కళ్ళొత్తుకోడం సుమిత్ర ఆశ్చర్యంగా చూసింది.

నిద్రపోతున్న బాబు కెవ్వుమని లేచేడు. ఎంత జోకొట్టినా వాడు పడుకోలేదు.

‘వాడి తాయెతగాలి [illegible] పోయిందేమో [illegible]’ అంది సుమిత్ర.

‘పాడమ్మా—పాడూ...నాకూ నిద్ర రాడం లేదూ...నేను మాత్రం వాడికన్నా తక్కువేం చేయించు కుంటున్నాననీ!’

“తిరిమూర్ఛని యివాళ నన్నిలా ఉబ్బించి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారేంటి మావగారూ! మీ కివాళ యింక నిద్దర రాదా ఏమిటి? పడుకోండి ఏదయినా పాడతాను.

సుమిత్ర అలా కొబ్బరాకుల మీద తేలుతున్న చంద్రకిరణాలను చూస్తూ మావగారి పక్కలో పడుకొన్న కొడుకును జోకొడుతూ ఎంతసేపు ఏం పాడిందో! ఇటు తిరిగిచూస్తే మంచంమీద భాస్కరం కూచునిఉన్నాడు.

పదినిమిషాల క్రితమే భాస్కరం సినిమా నుంచి వచ్చాడు. వస్తూనే గుమ్మంలోనే సుమిత్ర పాట విని - అల్లంత దూరంలో ఆమెను చూస్తూ అలాగే ఉండిపోయాడు. ఆవాళ శనివారం. పైగా కార్తీక పున్నమి. సుమిత్ర శుచిగా తల స్నానం చేసి మడిగా మావగారికి వండి పెట్టింది. ఆసాయంత్రం తలవెంట్రుకలు విప్పి విరబోసుకొని ఉంది. పెద్ద బొట్టు పెట్టుకొని ఉంది. ఆస్థితిలో మూర్తిని మావగారికీ, కన్న కొడుక్కీ ఒకే మారు ఏదో పూర్వకాలం పాట పాడుతూ నిద్రబుచ్చుతున్న భార్యనిచూస్తే భాస్కరానికి అపూర్వమైన ప్రేమా, అనిర్వచనీయమైన భక్తీ ఒకేమారు కలిగేయి.

“ఎంత సేపయిందీ వచ్చి! పిల్చావు కాదేం!”

“పిల్లలతల్లీ! భర్తతో పంతమా!” భాస్కరం నవ్వుతూ అన్నాడు. సుమిత్ర కూడా నవ్వింది. భర్త దగ్గరగా వెళ్ళబోయింది.

“అహాహాఁ దూరంగా ఉండు. నేను సినిమాకు వెళ్ళొచ్చినవాణ్ణి. టికెట్టు కొన్న వాణ్ణి. నన్ను ముట్టుకుంటే నీమడి అంతా ఏంగాను!’

సుమిత్ర మంచం మీద అతని పక్కనే గబుక్కున కూర్చుంది. భాస్కరం నవ్వుతూ ఆమె ఒళ్ళో తలపెట్టుకొని పడుకున్నాడు.

సుమిత్ర

"అనసూయ త్రిమూర్తుల్ని పసిపిల్లల్ని చేసి ఉయ్యాల్లో వేసి ఊపిందని చెబుతారు మొన్న మొన్నటిదాకా ఆ కథ వింటే నేను తేలికగా నవ్వేవాడిని. కాని యిందాక సినిమానుంచి వస్తూ నిన్ను చూసినపుడూ, యిప్పుడు నీ ఒడిలో పడుకొని ఆలోచిస్తున్నపుడూ ఆ మాట నిజమే అనిపిస్తోంది సుమిత్రా! మేం మొగాళ్ళం ఎన్నో పనులు చెయ్యొచ్చు ఎంత గొప్పవాళ్ళమైనా కావచ్చు కాని బుజ్జగింపులో, లాలింపులో, ఆదరణలో ఆ మాధుర్యం వెయ్యి జన్మలెత్తినా మాకు రాదు

సుమిత్ర ముఖమంతా తృప్తితో పొంగి పోయింది. భాస్కరం చెప్తూనే పోతున్నాడు

'నిజమే మీరన్నది నిర్భాగ్యురాలు కాని ప్రతి స్త్రీకీ భర్త సాన్నిధ్యం సుళువుగానే లభిస్తుంది కాని అత్త వారింటిని జ్యోతిర్మయం చేసే అదృష్టం ఏ సౌభాగ్యవతికో గాని దక్కదు అది నిలుపుకోడానికైనా పూర్వ పుణ్యం ఉండాలి నా మటుకు నేను యింతటి భాగ్యాన్ని ఒకసారి చేజేతులా వదులుకోబోయాను కాని కాని నా బాబు నా కళ్లు విప్పేడు ....' అంది సుమిత్ర.

*　　*　　*

ఇంతకుముందు ఏడాది కిందట జరిగిన సంగతి

'నా మాట కూడా కొంత వినండి నేనూ ఒక మనిషినే అన్న సంగతి గుర్తుంచుకోండి'

సుమిత్ర చకచకా నడుస్తూ గబగబా మాటాడేస్తోంది భాస్కరం ఆమెను అనుసరిస్తూ ఆమెకేసి ఆశ్చర్యంగా చూస్తున్నాడు

'మరొక్కమారు స్థిమితంగా ఆలోచించు సుమిత్రా'

'అన్నీ ఆలోచించే నేనీ నిశ్చయానికి వచ్చాను'

'దీనికి తిరుగులేదా?'

'లేనట్టే లెక్క'

'అంతేనా?'

'ఎందుకన్ని సార్లు అడుగుతారు? నేనీ పల్లెటూళ్ళో ఒక్క నాటికి ఉండను మీకు నా మీద ఏ మాత్రం అభిమానమున్నా ఇక్కడ మాత్రం ప్రాక్టీసు పెట్టొద్దు'

భాస్కరం చిత్రంగా ఆమె వైపు చూశాడు

"అలా కాదని యిక్కడే పెడితే?"

సుమిత్ర కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగి భాస్కరం పాదాలమీద పడ్డాయి

"నిజంగా యిక్కడే నన్ను కాదని ప్రాక్టీసు పెడతారా? సరే కానివ్వండి మీ సుమిత్ర పట్టుదల ఎటువంటిదో మీకు బాగా తెలుసు. జరిగేదేమిటో మీరూ ఊహించగలరు"

"అంటే?"

సుమిత్ర దుఃఖం ఆగలేదు కోపం, దుఃఖం కలిసి ఆమె మాటే పైకి రాలేదు

"అంటే ఏమిటో మీకు తెలీదా? మీకు నా కంటే మీ వాళ్లే ఎక్కువయినప్పుడు యిక నేనెందుకిక్కడ?" అనేసింది ఆ క్షణంలోనే ఆ సుశిక్షితురాలికి ఆమె మాట ఆమెకే తప్పుగా తోచింది అక్కడే కూలబడింది

"తొందర్లో ఏదో అనేశాను అసలు నా ధోరణి అదికాదు అయినా మీ రింత వరకూ ఎందుకు తీసుకురావాలి? నే చెప్పినట్టు ఎందుకు వినకపోవాలి?"

భాస్కరం ఆమె గడ్డం పట్టుకుని బలవంతాన తనవైపు తిప్పుకున్నాడు

సంతోషితస్వాంతులు

రాత్రిళ్లు నిద్రపోయి పగలు కలలు కనగలిగేవారు.



"పంటసిరి"

చిత్రకారుడు. జె. శశిభూషణ్.

"నేను వినకపోవటం కాదు. నేను చెప్పిన దాన్ని నువ్వు పూర్తిగా ఆలోచించకపోడమే యీ పరిస్థితికి కారణం. ఇంత చిన్న విషయానికి నువ్వు కాదంటావని నేను కలలో కూడా అనుకోలేదు. అత్తగారు ఉన్నారనా, ఆడపడుచుకి మరోపని లేక యిక్కడే ఉండిపోయి నిన్ను రాసి రంపాన పెడుతుందనా, దేనికి నువ్వింతగా వెనుదియ్యడం?"

"అలానే అన్నానా? అలాంటి మాట లెందుకూ?"

"లేకపోతే మరేమిటిది? కాగా పోగా యిక నీ కంట్లో రాయిలా ఆ ముసిలాయన మావాన్న ఒక్కడున్నాడు. అంతేగా?"

"మీ సుమిత్రని మీరు అంతవరకే అర్థం చేసుకున్నారన్నమాట. మీకే కాదు నాకూ ఉన్నాడు తండ్రి. పెద్దవాళ్లను కనురెప్పలా చూసుకోవాలో కంట్లో రాయిలా చూసుకోవాలో నాకూ తెలుసు. ఇంత కొంపలో పాపం ఆయనొక్కర్నీ వదిలి ఎవరు రమ్మన్నారు? మనం ఎక్కడికి వెడితే అక్కడికి ఆయన్ని తీసుకెడదాం. ఆయన కేమైనా లోటువస్తే నన్నడగండి. అమ్మయ్య! ఇన్నాళ్ళనుంచీ అర్థంగాక వెర్రెత్తిపోతున్నాను. ఇదిటండీ మీ బాధ? భర్త ఒక్కడే తన వాడనీ భర్త తాలూకు వారెవరూ తన కేమీ కారనీ అనుకునేంత అజ్ఞానురాల్ని కాను."

సుమిత్ర మనస్సు అంతటితో ఎంతో తేలికయిపోయింది. చెంపలమీద కన్నీటి చారికల్ని తుడుచుకొంది. భర్త వైపు తలెత్తిచూసింది. ఆమెకు కావలసిన సమాధానం ఆ ముఖంలో కనపడలేదు.

"అదేం యింకా అలాగే ఉన్నారు?"

"పోనీ అలా జరిగినా బాగుణ్ణు. ఆయన అలా చెయ్యమగద! మొన్న నే నలిగి చస్తున్నాను. నేనీ సంగతి నాన్నని అడక్కపోలేదు. అడుగుతే ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నారు?"

"ఆయన అదోవిధంగా నవ్వి" ముసలాడి మాటలని చాదస్తం కింద కట్టేస్తావేమో బాబూ! తాతలనాటినుంచీ ఉన్న యిల్లు యిది. మన యింట్లో ఉన్న ముసిలిగేదిని రెండు నెలలదూడగా మాచినతాతకొన్నాట్ట. ఇప్పుడు దాని పిల్ల మనకు పాలిస్తోంది. డాబా పక్కనిదాని ఎత్తున ఎదిగిన సంపెంగ చెట్టు మీ అమ్మ ఈ యింటికి కాపురానికి వచ్చిన కొత్తలో నాటినది. ఇలాంటి బంధాలన్నీ తెంపుకొని నే ఎక్కడికో ఎలా రాను? ఇక్కడే యీ మట్టిలోనే పుట్టేను. ఇందులోనే కలిసిపోడం నాకోరిక"... అన్నాడు, బాగుందా?" సుమిత్ర ముఖపద్మం మిరింత ముకుళించుకుపోయింది.

"అలా అయితే నే నేం చేసేది?" అనేసి ఊరుకుంది. అయిదు నిమిషాలు అతి భారంగా గడిచేయి.

"మీరే ఆలోచించండి. నేనుపట్నంలో చదువుకున్న దాన్ని మీరు కోరి కోరి కనీసం యింటరు ప్యాసయిన నాలాంటి దాన్ని చేసుకున్నపుడు నాలాంటి ఆడదాని హృదయంలో ఎలాంటి ఆశలు ఉంటాయో కొంచెం ఊహించండి. క్లబ్బులనీ, మీటింగులనీ, సినిమాలనీ, షికార్లనీ...ఎన్ని ఆశా సౌధాలు కట్టేనో - మీ రీపెద్దాపురం పొలిమేర దాటనంటే నే నేమనుకోవాలి?"

భాస్కరం ఆమె మాటలు విన్నాడో లేదో తెలీదు, మరోధోరణిలో మొదలెట్టేడు.

"ఆడవాళ్ళకి అవకాశాలు ఎప్పుడోగాని రావు. వచ్చిన అవకాశం జార విడుచుకుంటే జీవితమంతా దుఃఖించినా విముక్తి ఉండదు. ఈ యింటి కంతటికీ నువ్వు లక్ష్మివి - రాణివి"

"ఎవరింటికి? నా యింటికి నేను లక్ష్మిని- నా రాజ్యానికి నేను రాణిని"

"ఈ యిల్లు నీదికాదా?"

సుమిత్ర జవాబు చెప్పలేదు. ఇంతలో సుందరమ్మ అక్కడికొచ్చింది.

"ఇక్కడన్నారా ఉన్నారూ? ఈ డాబా మీద ఏం చేస్తున్నారూ? నాన్న నిన్ను పిలుస్తున్నాడు రా తమ్ముడూ" భాస్కరం

సప్తవిధ కారణాలు

ఆయన ఏదైనా కొన్నాడూ అంటే దానికి ఏదో ఓ కారణం ఉంటుంది.


ఆవిడగారుకొంటే ఈ క్రింది సప్తవిధకారణాలలోఏదోఒకటి అయితీరుతుంది. (1) ఆయన గారు ఇది మన కొందుకే అన్నారు. (2) అది లాకాయి లూకాయి కాదు, చెన్నాపట్నం నించి వచ్చింది. (3)పొరుగింటి వాళ్లు తన్నుకు చచ్చినా దీన్ని కొనే తాహతు రాదు (4) ఊళ్లో ఇంకెవ్వరింటా లేదు. (5) ఊళ్లో అందరూ కొనేసుకున్నారు. (6) దీని తరహాయే వేరు. (7) ఎందుకంటే......

ముక్కుని లేచి మొహం తుడుచుకుని కిందకి గబగబా దిగివెళ్ళిపోయాడు. డాబామీద సుమిత్ర, సుందరమ్మ మిగిలేరు.

"ఆడది మొగాణ్ని ఆనందడోలికల ఊగించనూగలదు, విషాద వీచికల తూగించనూ గలదు అంటారు, ఇదే కాబోలు" అనిపించింది సుందరమ్మకి సుమిత్ర మొహం చూడగానే. కాని ఆమాట అప్రయత్నంగా పైకి అనేసి నాలిక కరుచుకుంది. అసలే బాధపడుతున్న సుమిత్రకు యీమాట కారం రాసినట్లయింది. సుందరమ్మ మాటలు మొదట చురుక్కుమన్నా, సుమిత్ర తర్వాత లేని నవ్వు తెచ్చుకొని అంది:

"నువ్వు నాకంటె పెద్దదానివి కదా

అవకాశవాదికి నిర్వచనం: మానం చేద్దాం, చేద్దాం అనుకుంటున్న పనులు మానకంటె ముందు ఝామ్మని చేసేసే వాడు.



గణ గణ గంటల గంగిరెద్దులకు
జనగణమనముల నివాళులు !

—చిత్రకారుడు : శీలం యతిరాజు.

వదినా, నువ్వు మా అన్నగార్ని జేబులో పెట్టి ఊగిస్తున్నావో కాస్త చెబుదూ, విని నేర్చుకుంటానూ!'' ఈమాటకి సుందరమ్మ ముఖం మలినమైపోయింది. ఆమెకి ఈ మాట అవమానకరంగా తోచింది.

"ఎవరి గొడవ వాళ్ళది, నాకెందుకు? బుద్ధిలేక ఏదో ఒకటి అంటూవుంటాను." అనేసి మెట్లవైపు నడుస్తూ పైకి వినపడే లాగ...

"మా అమ్మ ఎప్పుడు చచ్చిందో అప్పుడే యీ యిల్లు ఎడారి అయిపోయింది. ఇంక ఆ ముసిలాయన ఒక్కడూ వీళ్ళకు కంటకంగా కనిపిస్తున్నాడు. అయినా మా అమ్మ స్థానాన్ని పూర్తి చెయ్యడానికి అందరికీ అర్హత ఉండి ఏడవొద్దూ మా తమ్ముడు వెర్రిగాని!" అని అసందర్భంగా ఏవో కొన్ని మాటలాడేసి గబగబా మేడమెట్లు దిగి వెళ్ళిపోయింది. సుమిత్ర కొయ్యబారి నిలబడిపోయింది.

వదిన యింత ఘాటుగా మాట్లాడ్డానికి తగిన తప్పు తను చేసిందా? నిజంగా తను అనుకున్నది ఆశించింది దోషమేనా?

ఎంబీ బియస్సు ఫైనలియరు చదువుతున్న పురుషుడు తన భర్త ఐనప్పుడు తను ఎంతో గర్వించింది! ఎన్ని ఆశాసౌధాలు నిర్మించుకొంది! విలాసానికిగాని విజ్ఞానానికిగాని పట్నవాసంలోనేగాని యీ పల్లెటూళ్ళో— ఎలక్ట్రిక్ దీపాలూ కొళాయిలూ అయినా లేని యీ కొంపలో స్థానముందా? ఆడది బజారుకి కూరలకి వస్తే ఆబ్బురంగా విమానాన్ని చూసినట్టు చూసే యీ పల్లెటూళ్ళ గబ్బిలాయిల మధ్యనేనా తను యావజ్జీవం గడపడం!

★ సుమిత్ర ★

ఎన్ని కోణాలనుంచి ఆలోచించి చూసినా సుమిత్రకు తను చేసినదాంట్లో రవంత దోషమయినా గోచరించలేదు. బాబు వదిన పిల్లలతో ఆడుకోడానికి అలా వెళ్ళేడు. సుమిత్ర కేమీ తోచక డాబా చివరకి వచ్చి పెరట్లోకి చూసింది.

"దాని కిష్టంలేనప్పుడు నువ్వెంత తాపత్రయపడి ఏం లాభం తమ్ముడూ? మీదారి మీరు చూసుకోండి. ఇంతలోకే వాన్నేమీ అయిపోదులే" ఈ మాటలు సుందరమ్మవి. సులకమంచం మీద మావగారు విచారంగా కూర్చుని ఉన్నాడు. సమీపంలో భాస్కరం పచార్లు చేస్తున్నాడు. సుందరమ్మ కళ్ళొత్తుకుంది.

'అమ్మ రెండేళ్ళయి పోయింది. నువ్వప్పుడు నాలుగో ఏడు చదువుతున్నావు. ఈ రెండేళ్ళూ నాన్నొక్కడే గడిపేడా, ఏ కోడలయినా వచ్చి ఉద్ధరించిందా? నేను ఆడదాన్ని, ఎంత అభిమానపడి ఏం లాభం? పరాయి యింటికి అమ్ముడుపోయిన దాన్ని—నేను ఉన్నా ఒకటే ఊడినా ఒకటే...'

ఈసారి ముసిలాయన కోప్పడ్డాడు.

'ఏమిటి తల్లీ, యీ అర్థంలేని ధోరణి? నువ్వు లోపలికిపో, మేం మాటాడుకోవాలి'

'అవున్నాన్నా అవును. సబుబు చెబితే అర్థంలేని ధోరణే. పాకేం, అనుభవించేది నువ్వు—పదవే పాపాయీ' అని ఒడిలో ఉన్న ఆరేళ్ల పిల్లని మూందుకుతోసి గదిలోకి పోయి తలుపు వేసుకుంది.

'బాబూ, మందుల పార్శిళ్లు మళ్ళీ యిక్కడి కెందుకూ, మీ రెక్కడి కెడదామనుకుంటున్నారో అక్కడికి తిప్పెయ్యి. రైలు ఛార్జీలు దండుగ'

భాస్కరం తండ్రి మాటలు విన్నాడో లేదో...కాలి బొటకన వ్రేలితో నేలను రాస్తూ మెల్లిగా అన్నాడు.

'అది కాదు నాన్నా...' ఆ తర్వాత ఏం మాట్లాడాలో అతనికి తోచలేదు. సిగ్గుపడి తండ్రి పక్కనే కూర్చుండి పోయాడు. ముసలాయన తేలికగా నవ్వేడు. 'నా కోసం విచారిస్తావెందుకు వెర్రిబాబూ! రాలిపోయే పండుటాకు యిది. చిగిరించబోయే కొత్త కొమ్మలు మీవి. దానికోసం యిది ఎక్కడేనా త్యాగం చేస్తారా? మీరు కులాసాగా కాపరం చేస్తూంటే తప్పకుండా మీ దగ్గరకి వచ్చి నాలుగు రోజులపాటు ఉంటాను'

'అది కాదునాన్నా......'

'మనం దేవాలయానికి వెడుతూ ఉంటాం. దార్లో వందలకొద్దీ బీదవాళ్లు కనిపిస్తారు. కాని మనం వాళ్ళని చూడకుండా తొందరగా దైవ దర్శనానికని తహతహలాడతాం. అందులో అసహజమేముంది?'

ఈ మాటలు డాబామీంచి వింటున్న సుమిత్ర గుండెల్లో గాలంలా గుచ్చుకున్నాయి. అది సహజమేనా? అందులో అసహజ మేమీ లేదా?

'అది కాదు నాన్నా...అన్నాడు మళ్లీ భాస్కరం. ఈసారి ముసిలాయన పకపక నవ్వేశాడు.

'ఏదికాదు? లేకే—యింక కబుర్లు చెప్పకు. అసలు నువ్వూ నీ పెళ్ళామూ బలవంతాన యిక్కడ బైతాయించినా, నే ఒప్పుకోను తెలిసిందా?'

ముసిలాయన మంచితనానికి సిగ్గుపడి భాస్కరం అక్కడ ఉండలేకపోయాడు. తిన్నగా డాబామీదకు వచ్చేశాడు.

సుమిత్రమీద చెప్పలేని కోపంతో అతడు డాబామీదకు వచ్చాడు. కాని సుమిత్ర కూర్చున్న తీరూ, సానుభూతి కోరుతున్న ఆమె మొహమూ, కన్నీళ్ళతో నిండి దైన్యభావం వెడల గ్రక్కుతున్న ఆమె కళ్ళూ - వీటన్నింటి వెనకా తన్ని బలంగా ఆకర్షించి మత్తెక్కిస్తున్న అమోఘమైన ఆమె సౌందర్యం, చూసి భాస్కరం తగ్గాడు.

"చూడూ, కంట తడిపెట్టిన ఆడదాన్ని కాదని ఏ పురుషుడూ ముందుకు రాలేడు. నీ మీద నాకు పూర్తిగా నమ్మకముంది. నీ సంస్కారం మీద నాకు విశ్వాసం ఉంది. ఆలోచించుకుని చెప్పు. నువ్వు ఎలా అంటే అలాగే, నే నేమీ అనుకోను"

సుమిత్ర అయిదు నిమిషాలు ఆలోచించింది.

"సామాన్లు సర్దేను. వాట్టేరు వెళిపోదాం" అంది. అంటూనే భాస్కరం మొహంలోకి చూసింది. అతని మొహంలోని వెలుగు ఒక నిమిషంపాటు మాయ

మార్క్ ట్వేన్‌కు అపరిచితులు చాలమంది తమ ఫొటోలు పంపేవారు, తమకూ ఆయనకూ చాలా దగ్గిర పోలికలు ఉన్నాయంటూ. వారికి సమాధానాలు వ్రాయడం మార్క్ ట్వేన్‌కు పెద్ద ఇబ్బంది అయిపోయింది. చివరికి కొన్ని వందల కాగితాలు ఈవిధంగా అచ్చుకొట్టించి ఫొటోలు పంపినవారికి పంపించేవాడు:

"అయ్యా, మీ ఉత్తరం, మీ ఫొటో అందాయి. మరెవ్వరికీ లేనన్ని నా పోలికలు మీలో ఉన్నాయని నా దృఢ నిశ్చయం. అసలు నా పోలికలు నాలోకంటే మీలోనే ఎక్కువగా ఉన్నాయి. ఇంతెందుకు, ఇకనుంచీ మీ ఫొటోలో చూసుకుంటూ గడ్డం గీసుకోవాలనుకుంటున్నా నంటే నమ్మండి. ఇట్లు, విధేయుడు, ఎస్. క్లెమెన్స్."

మయింది. అతను లేని చిరునవ్వు తెచ్చుకుని బలహీనంగా "అలాగే" అన్నాడు.

*　　*　　*

సుమిత్ర నెలరోజులై వదిలి వచ్చిన తండ్రికి ఉత్తరం రాస్తోంది తాతయ్య తను లేని వారం విశాఖపట్నం ప్రయాణం పెట్టుకున్నట్టూ, ఆనాడు జనతాకి అనకాపల్లి స్టేషనుకువచ్చి తన్ని కలుసుకోమన్నట్టూ... ఇంతట్లో కేకలు వినిపించాయి. సుమిత్ర ఆ ఉత్తరాన్ని అలా వదిలి గుమ్మంలోకి వచ్చే సరికి కనపడిన దృశ్యమిది.

బాబు తాతమీద గుఱ్ఱమెక్కి ఊగుతున్నాడు పాపాయీ, ఆనందూ పక్కని నిలబడి గెంతుతున్నాడు. సుందరమ్మ తండ్రిని కేకలేస్తోంది:

"అదేమిటి నాన్నా, నీకేమయినా మతుందా పోయిందా? మొన్న మొన్న జబ్బు పడిలేచావ్, ఆ కుంట వెధవని అలా గంటల తరబడి ఎంత కని గుఱ్ఱమెక్కి ఆడిస్తావ్" వాళ్లెవరూ వీళ్ల మాట విన్నట్టులేదు. అటు వేపు తిరిగి ఏదో వాళ్లల్లోవాళ్లుమాటాడుకుంటున్నారు. సుమిత్ర కదేదో మాడాలనిపించింది. చుట్టూతిరిగి రెండో వైపు చివరిగది కిటికీలోంచి మాసింది.

"తాతా, తాతా, మలి.. ఈ గుఱ్ఱానికి తోకేదీ?" అన్నాడు బాబు

"కాకెత్తుకు పోయిందిరా!" అన్నాడు తాత

బాబు పక్కున నవ్వేడు.

పాపాయి, ఆనందు కూడా నవ్వేరు. అందులో అంత విరగబడి నవ్వడాని కేముందో తెలీదు. ఆ ముసిలాయన కూడా పక పక నవ్వేడు. పిల్లలతో పిల్లాడిలా కలసిపోయి—ఆరునెల్ల అందాలపాప 'ఛీ, ఛీ' అంటే చిరునవ్వు నవ్వినట్టు—ఇన్నేళ్ల యీ ముసలాయన నిర్మలంగా నిండుగా ఎలా నవ్వగలుగుతున్నాడో సుమిత్రకి అర్థం కాలేదు.

సుందరమ్మ గబగబా వచ్చి బాబును బరబరా లాగి చంక వేసుకుంది. బాబు ఇల్లెగిరిపోయేట్టు ఏడుపు మొదలెట్టేడు. వాడ్ని లోపలికి తీసుకెళ్లి ఇన్ని బిస్కట్లు ముందు పోసి 'మింగరా మింగు.. అంతేగాని తాత మీదెక్కి గెంతుతావేమిటే? తప్పుకాదూ? తాతకి 'ఆయి' వస్తుందమ్మా అంది. బాబు తకేమని ఊరుకున్నాడు. బిస్కట్లకోసం పాపా, ఆనందూ 'అమ్మా, నాకో' అంటూ చేతులు జాపేరు. సుందరమ్మ రెండు వాళ్లకీ పడేసింది.

"పోనిద్దూ సుందరం— వాడు రేపెల్లుండో జిల్లో వెళ్ళిపోతాడుగా" అన్నాడు ముసలాయన.

సుందరమ్మ తండ్రికి ఒంట్లో బాగులేదని పదిహేను రోజులయివచ్చింది. ఈమధ్య వారంరోజులై ఆయనకి బాగా ఖులాసాగా ఉంటోంది. అవిడ అవాళే ప్రయాణం పెట్టుకుంది.

"వాడెప్పుడు వెడతాడో నాకు తెలీదు గాని... నేనివాళ సాయంకాలం బండికి వెళిపోతున్నాను నీకు తెలుసుగదా, వెళ్లేలోగా మాత్రం మళ్లీ యిలాంటి అఘాయిత్యం పనులు చెయ్యకు. నే ఉండగా మాత్రం యిలాంటి పనులు చెయ్యనివ్వను. గంటయి మాస్తున్నాను అదే ఆట, అదే ఆటా? ఎముకలు పిండైపోవూ? నీకు మళ్లీ వస్తే ఎవరు చేస్తాడూ?" సుందరమ్మ దృష్టి హఠాత్తుగా మీసంలేని తండ్రి మూతిమీద పడింది. ఫక్కున నవ్వింది.

"లోకంలో యిందరు తాతా మనవల్ని చూశాంగాని ... ఎక్కడలేని చిత్రాలూ యీ కొంపలోకే వచ్చిపడ్డాయి. అయ్యో రాత! అయ్యో నాన్నా! నువ్వు నీ మీసం... నీ మనవడూ.. ఓహోహో!" సుందరమ్మ విరగబడి నవ్వింది. ముసిలాయన కెందుకనో మరి సిగ్గనిపించింది. మనవడ్ని తీసుకు లోపలికి వెళ్లిపోయాడు. సుమిత్ర యివతలకి వచ్చింది. తను మావగార్ని మొహామెత్తి ఎప్పుడూ అంతలా చూడలేదు. ఆయనకి పెద్ద పెద్ద వంకీలు తిరిగిన మీసాలుండేవని అందరూ చెప్పుకొనేవారు. ఈమధ్య తను వచ్చాక కూడా ఒకసారి మీసాలు చూసినట్టు జ్ఞాపకం. అంతలో హఠాత్తుగా ఓనాడు ఆయన మీసాలు పూర్తిగా మాయమయ్యాయి! మొదట ఆశ్చర్యపడినా తరువాత ఎవరినో చూసి తనలా అనుకుందేమో, ఈయన కసలు మీసాలులేవేమో అని సరిపెట్టుకుంది. అయినా అనుమానం బాధిస్తూనే ఉంది! సుందరమ్మ 'అయ్యో నాన్నా! నువ్వూ, నీ మీసం, నీ మనవడూ!' అంటూంటే మాత్రం ఆత్రుత చంపుకోలేకపోయింది.

"ఏమిటది వదినా, ఎందుకంత నవ్వూ, నాకూ కొంచెం చెప్పకూడదా!" అంది.

(67 -వ పేజీ చూడండి)

కొత్త పండగ

బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

భోం–భోం–భోం–శంఖారావం చేశాడు సంక్రాంతి భిక్షకోటీశ్వర జంగం శివలింగం!—

వాకిలినిండా లతలూ పూవులూ తీర్చి సుందరమయ్య రథాలు పరుగెత్తిస్తున్న సుందరమ్మ చెంగుపట్టుకుని జీరాడుతోన్న పాపాయి కవ్వున ఏడ్చి పడిపోయాడు! ఆమె చేతిలోని ముగ్గుబుట్ట ఆమెకు తెలియకుండానే జారి కింద ఒలికిపోయింది! పాపాయిని అమాంతం ఎత్తుకుని గుండెల కదుముకొని 'పండగపూట ఇదేం ట్రాబాబూ!' అంటూ కళ్ళ నీళ్లు కారుతోంటే ఎంతో ఓదార్చింది! నిద్రపోతోన్న కళ లోపల్నుంచి ఈపూజావిడికి లేచి జగదోమంటూ, కళ్ళునులుముకుంటూ తల్లి దగ్గరికివచ్చి 'అమ్మా ఏంటే! పాపాయి ఏడుస్తున్నాడేమే!' అంటూ కొక్కురుముని వీపులంకించుకుంది.! శివలింగం అడుగు కదపలేదు మొద్దుపోరి. 'అమ్మగారూ. అమ్మగారూ' అంటూ అక్కడే నిలబడిపోయ్యాడు!! వీరంటపోయ్యే అమ్మ— అక్క 'ఏమండోయ్ సుందరమ్మగారూ. ఇవ్వాళ పండగంతా పొగమంచులోనే ఒరిగిపోతుంది లాగుందే!!' అనుకుంటూ వస్తున్నారు—

పాపాయి ఏడుపు మానుకున్నాడుగాని కళ మాత్రం వెక్కి వెక్కి ఏడుస్తోనేవుంది. తల్లీ పిల్లలు లోపలికి వచ్చారు—సుందరమ్మ బియ్యంపట్టుకు వాకిట్లోకి వచ్చేప్పటికి జంగం కూడ అదృశ్యమయ్యాడు! పండగతోటి ఉల్లాసమంతా పోయి సుందరమ్మ ఎల్లాగో అయింది!!

తూరుపుకొండ చివర్లనుండి కెంపు అకాశాలు వదుల్తూ వెనుకనుంచి ఎవరో వడివడిగా వస్తున్నట్టుగా వుంది! బంగారు కొంగ చాలకొంత సెలుకువస్తోంది. ఆ వెలుగులో ఎవరున్నదీ తెలియటంలేదు. రంగురంగుల పిట్టలు రాగాలుతీస్తూ ఉదయాలు పెడుతున్నై. చలిలో పెదచెరువుల్లో స్నానాలు జపాలు చేసే వాళ్ళ గుండెల్లోని గుబులు తాకింత అణుచుకున్నా ఆగక కొకొలా, పాటలా, అనుకోని స్వరాలతో బిగ్గరగా పైటికి వచ్చేస్తున్నయ్. ఊళ్లో గంటలమువ్వల గణగణలతో, 'గింయ్ గింయ్—ఢంకుఢం తాళాలతో జూ అని ఎడతెరిపిలేని మెండీ నుతీ, అపస్వరాల సన్నాయి మేళాలో, డూడూ బసవన్నలు వెళ్తారు—అతడు పాత్రస్వామువైతే మేము పిలాయింటికి పుట్టి కోచ్చామా అన్నట్టుగానే వీధి గుమ్మంలో అచారిపచారిచేస్తూ, 'కస్తూరి రంగయ్య' కీర్తనలు దంచేస్తున్నారు.! ధితేలు మోకు వాడికదు; పిల్లచూస్తే పిల్లలే గాదు పెద్దలే పొడలిపోతారు! ఇంకా రకరకాల బిచ్చగాళ్ళు!! ఆహా! ఏమిటి భోగం! కానీ కర

లేకుండా ఇంత సంబరం ఎవరు చేస్తున్నారు? వీళ్ళంతా బిచ్చగాళ్ళు గారు వృత్తులవాళ్ళు. వీళ్ళే లేకపోతే ఈ దేశంలో పండగే లేదు

ఎక్కడెక్కడనుంచో రాని పాలముంతలు నెత్తిన పెట్టుకొని గొల్లభామలూ, రేగుపండ్ల తట్టలతో లంబాడీ పడుచులూ, వసే, వాళ్ళ వెంట తగిలి కోడెకారు వాళ్ళ చేరాలూ...

ఓహో! ఇదా పండగంటే! ఎంత సంరంభం తరగల నురుగులుగా మెరుస్తోందో!

శశిరేఖను అత్తారింటినుంచి తీసుకురావటానికి వెళ్లిన విశ్వనాథం నిన్న రాత్రికే రావాల్సింది. అభురుపు రాత్రికైనా వస్తారని చాలా పొద్దుపోయేదాకా చూసింది. ఇవ్వాళ పదిగంటలైనా రాలేదు. పాపాయి తో పైలోకైతే ఏడవటం నా వదలటం లేదుగాని, ఉలికులికి పడుతున్నాడు. 'లా త్తే బత్తలే అమ్మా' అని గీమాలి పరికిణీ చాకెట్టూ తొడిగించుకు తిరిగింది కళ. సుందరమ్మకు ఎటూ ఏమీ పాలుపోవటంలేదు అసలు ఇవ్వాళ పండగలా లేదు. దండగలా వుంది.

సరిగ్గా రెండు ఝాములకల్లా కాళ్ళకు తీసుకురాకుండానే రకరకాలా వస్తూ విశ్వనాథం ఒక్కడే వచ్చాడు. సుందరమ్మ దిగాలు పోయింది అన్నిటికంటే విచిత్రం పాయిలో పిల్లి లేవలేదు ఇప్పటిదాకా. ఎంతో ఆశ్రద్ధగా గుచ్చిగుచ్చి అడిగింది అమ్మాయిని తీసుకురాలేకపోయావని. 'అల్లుడికి జబ్బుగావుంది ...ఇవ్వాళ పండగారయి. ఇంటిదగ్గర వివాహం బంగారుపడతారని అని వచ్చాగాని అతని క్షేమం బాగావుండలేదు' అన్నాడు కళ్ళద్దాల్లో నీళ్లు మెరుస్తోండగా.. సుందరమ్మ గుండె గుండె బాదుకుని ఏడుపు మొదలెట్టింది. విశ్వనాథం ఎంతో సముదాయించాడు...పిల్లలు ఆకలని ఏడుస్తున్నారు - ఇరుగమ్మ పొరుగమ్మ గుసగుసలూ, 'ఏమిటే వారింట్లో ఇవ్వాళ తీరి తీరి కజ్జావేసుకున్నట్టున్నారేం?!' - 'కాదోయ్ వాళ్ళ పెద్దపిల్లకు చాలా జబ్బుగా వుందట. తండ్రి ఇప్పుడే వచ్చినట్టున్నాడు చెప్పుకుంటున్నారు. అవిడ ఏడుస్తోంది.' - 'అల్లాగా! పాపం. వాళ్ళింట్లో నిన్న భోగికి పండ్లూ పిల్లలికి పొయ్యలేదు. ఇవ్వాళా పొయ్యరు గామాలు' ఇల్లా ఎందరో ఎన్నో చెప్పుకుంటున్నారు!

పిల్లు భోంచేశారా లేదా అని ఎవరెందుకు అడుగుతుంటారు. అందులో పండగనాడు.

విశ్వనాథమే వంటింట్లోకి వెళ్ళి, పొయ్యి రాజేసేసరికి బ్రహ్మప్రళయమైంది.

పక్కయింటి సరస్వతమ్మగారు, తీరుబాటుగా పైలుకేరివచ్చి 'ఏం సుందరమ్మా. శశిరేఖకు జబ్బుగావుందా. విన్నా అయన వచ్చారటగా' అన్నది.

సుందరమ్మకు ఆపాటి మరీ తిక్కగా,

పాలముంతలు నెత్తిన పెట్టుకొని గొల్లభామలూ, రేగుపండ్ల తట్టలతో లంబాడీ పడుచులూ వస్తే, వాళ్లవెంట తగిలి కోడెకారువాళ్ల చేరాలూ .... ఓహో ఇదా పండగంటే? ఎంత సంరంభం తరగలనురుగులుగా మెరుస్తోందో?—

బాధగా తోచింది! 'కాదు బామ్మగారూ. మా అల్లుడికి వంట్లో బాగులేదుట' - 'అట్లాగటోయ్. వాళ్ల లక్ష్మి చెప్పిందమ్మా - నాకేం తెల్సు! సరేగాని ఇంకా భోజనాలు కానట్టున్నవేం?'

ఈమాట వినేప్పటికే సుందరమ్మకు ఏడుపు ఉబికి వచ్చింది. 'లేదు. ఈ పండగ లెందుకొస్తాయో అమ్మా, ప్రజల్ని ఏడిపించుకు తినటానికి - నిన్న భోగిమంటలో ఆ వీధిన ఓ అమ్మాయి వళ్ళంతా కాల్చుకుందిట. మన పక్కింటి రామస్వామి పండగ పండగ అని ఎన్నాళ్లనించో పెంచిన రెండేసి వందల కోడిపుంజులటమ్మా, ముక్కలు చెక్కలైనాయట. ఒకటే ఏడుపు వాళ్లింటిల్లిపాదీ - ఈయేడు మనూళ్ళో పండగ...'

'అకేమిటి సుంధరమ్మా. పండగలేంజేస్తై! ఎవళ్ల ప్రారబ్ధకర్మం వాళ్లనుభవిస్తారుగాని.'

వంటింట్లోంచి విశ్వనాథం 'వెధవతుక్కు వేదాంతాలు' అని బిగ్గరగానే పళ్ళు కొరుకుతూ అంటూ, 'ఏఁయ్ వస్తావా?' అన్నాడు—

ఇది గ్రహించి సరస్వతమ్మగారు పీటం లేపి, 'పో అమ్మా పో. పండగనాడు ఉపోషం ఉండరాదు' అంటూ వెళ్లిపోయింది.

'నా కాకలిలేదు' అన్నది సుందరమ్మ.

'నాకూ ఆకలిలేదు' అనుకుంటూ బైటికి వచ్చి, 'పిల్లలు మాడిపోతున్నారు. వాళ్ళ మొహాన్నన్నా ఇంతపడెయ్!' అన్నాడు విశ్వనాథం.

'వాళ్ళూ సొమ్మసిల్లి పడుకొన్నారు'

'ఇవ్వాళ్టితోనే ప్రళయమా! నాకేమీ అర్థంకావటంలేదు. నీకుపిచ్చి రోజారోజుకూ ముదిరిపోతోంది'

జొన్నచేలో పడ్డదని లేగటావు కాలు విరగ్గొట్టారు అని రోజుకుంటూ వచ్చి చెప్పాడు పాలేరు పిల్లాడు అప్పుడే.—

"ప్రళయమంటే ఇంకెట్లా వుంటుంది.' అని గోడకు జేరగిలబడ్డది సుందరమ్మ.

'సరేలే. ఈ పండగ లేకపోతే ఇంతబాధ వుండకపోను. ఇది ఎంతమందిని సంతోష పెడ్తుందో, ఎంతమంది ఈ వేళ బాధ అనుభవిస్తారో మనదాకా వచ్చింది గనక మన కివ్వాళ తెల్సింది. ఈరోజున ఎంత ఆకలో! ఈరోజుకే నోరుంటే ఈ పాడీ ఈ పంటలూ గుటకాయస్వాహా చాలనే చాలవ్.

'దేముడికి దయవుండి అల్లుడికి కాస్త నిమ్మళించినట్టు ఉత్తరంవస్తే, మనం ప్రజల్లో కలిస్తే...పాపాయిదే ముంది లెండి, జడుసుకున్నాడు వెధవ. రేపు రథంరేకు కట్టిస్తే ఒక్కదులుపు దులిపి ఆడుకుంటాడు'

'రేపు అన్నీ బాగానే ఉంటయ్! ఇవ్వాళ్నే!...ఆ కుర్రకుంకలకింత కూడు పడేద్దూ చచ్చిపోతారు-'

'ఏం పర్వాలేదు. మనలాంటి వాళ్ళు కోటాన కోట్లుంటారు దేశంలో'

'ఏం దేశమే పాడుదేశం. పిల్లాళ్లు శోష వచ్చి పడిపోతే'-బలవంతాన పిలల్ని వంటింట్లోకి ఎత్తుకెళ్ళి అన్నం తినిపించింది సుందరమ్మ-కాలువిరిగిన ఆవును పొద్దు పొద్దు గుంకుతుండగా మోసుకొచ్చి ఇంటి ముందు పడేశారు పాలేళ్ళు. దాని ఉపచారం కట్టుకట్టటం అయ్యేసరికి చాలా రాత్రయింది - పండగ పప్పులకు లొట్టలు కొట్టుకుంటూ వచ్చిన జీతగాళ్ళు ఈ వాలకమంతా చూసి చప్పగా జారిపొయ్యారు. ఆరాత్రంతా నీరసం వల్లనేమి, కష్టాలు గుప్తికి తెచ్చుగుంటూనేమి నిద్రలే పట్టలేదు మర్నాడు తెలితెలి పోయేకాళ్ళు చేతుల్తో తడబడుతూ పెందరాళే కూడూ కూరా చేసింది సుందరమ్మ.

ఆరోజు కనుము! ఆరోజల్లా నిన్నని నిందించటమేపని 'ఎన్ని పండగలో చూశాం, చేశాం గాని.....'

తెల్లారగట్టే అల్లుడిగారూరు గాంధీపేట ప్రయాణమై వెళ్లారు. తలీ తండ్రిని చూసీ చూడ్డంతోనే శశిరేఖమీదబడి ఆవురుమని ఏడ్చింది ఇంట్లో ఎక్కడ చూసినా నిస్తబ్ధత.

ఆఘట్టమంతా ఒక శోకసాగరం.

కాని కమలనాథం జీవించటం అంటే పునర్జన్మ ఎత్తినట్టేఐంది. అల్లుడు బాగా కోలుకొన్న దాకా అక్కడేవున్నారు-నెల రోజుల తర్వాత అల్లుణ్ణీ బిడ్డనూ తీసుకు వచ్చారు. అసలే రివటలాగుండే శశిరేఖ మరీ పగడాకైపోయింది- ఆనాటి సంక్రాంతి కటికి ఉపవాసం, అల్లుడి ఖాయిలాబెంగా, చాకిరీతో అసురుసురంటూ సుందరమ్మ ఇంటికొచ్చి మంచం పట్టింది. చాలా కాలా

ఒక హాలీవుడ్ చిత్రంలో హీరోయిన్‌తో హీరో అంటాడు "ప్రియా! తాగినప్పుడు నువ్వెంత అందంగా ఉంటావో తెలుసా!"

"ఛా. నేను తాగందే,"అని హీరోయిన్ కోపంగా అంటుంది.

"నువ్వు కాదు ప్రియా! నేను.

నికిగాని తెరిపి ఇయ్యలేదు. విశ్వనాథం గూడా ఏదో తిరుగుతోన్నా లంఖణాల వాడిమాదిరే లాగుతున్నాడు సంసారపు బండి.

అల్లుడూ బిడ్డా రెండుమూడు నెల్లున్నారు. గాని ఎన్నాళ్లకూ వీళ్ల కుజ్జిడ్డు వదలందే...వెళ్లారు.


జిడ్డువ జీదని ఇంటికి ఏదో చుట్టుకుంది. ఇదో మనోవ్యాధి!-మళ్ళా సంక్రాంతి వస్తున్నది-ఇంకో నెలకు కళకు వాలుగేళ్ళూ నిండుతై-పాపాయికి రెండేళ్ళూ దాటుతే కాస్త వళ్లుచేసి బాగున్నారు! వరిపంట పితప ధాన్యం ఇంటికి చేరుకుంది. ఈయేడు శెగడిచేలకు మంచి వరువం ఏమిదోసపళ్లో. ఆ కవు పడకండా కాసినై!

'ఈసారన్నా పిల్లలను పదిరోజులు ముందుగా తీసుకురండి' అన్నది సుందరమ్మ.

పదిహేను రోజులు ముందుగానే శశిరేఖను తీసుకువచ్చాడు-శశిరేఖ సంక్రాంతి ముగ్గులూ, శశచేత గొబ్బిని తట్టించటం చేసేది-మగపిల్లాడైనా పాపాయి గూడా గొబ్బిళ్లునేసి, బాగా వచ్చీరాని మాటలతో, అక్కతో పాటలు పాడేవాడు ఆడేవాడు విసుపూ పారాణీ పెట్టించుకుని-భోగినాటికి వచ్చాడు కమలనాథం.

నిరిటి నించీ అంటుకున్న బాధలన్నీ పరగడైనై ఈసంక్రాంతికి! ఒక్కొక్కసారి పండగ మహాదుర్మార్గంగా వస్తుంది. ఒక్కొక్కసారి వచ్చినట్టే అనిపించనంత సంతోషప్రదంగా వస్తుంది.

వాళ్లదృష్టిలో కష్టాలకు నిరుటి సంకురాత్రే సంకురాత్రి! కొత్తకు సరికొత్త పండగ సుఖస్పర్శ ఈ సంకురాత్రి!! ★



"గొబ్బి గొబ్బెమ్మా!
మొగిలీ పువ్వంటీ మొగుణ్ణియ్యావే!"

ఫొటో ఎ వి వి నరసింగరావు—రాజమండ్రి

సంక్రాంతి గీతం

బంగారు ముగ్గులు ప్రాంగణాలందు
బాలికామణులెల్ల బాగుగా దీర్చి,

బంతిపూవులు ద్వారబంధాల గ్రుచ్చి
బొమ్మకొల్వులు పెట్టి పూజ కావించి,

పేరంటములు చెప్పి ప్రియమొప్పగాను
వచ్చినవారికి ఫలము అందించి,

బంధువర్గముతోడ విందులం దేలి
సంక్రాంతిపండుగ సాగించినారు.

పౌష్య లక్ష్మిదేవి' బంగారుదేవి'
మా యమ్మ' దీవించి, మ మ్మేలుకోవె!

—లక్ష్మి, ప్రసాద్

మూగపోయిన వీణ

తనను మభ్యపెట్టి ఈ పెళ్లిచేశారు అనే భావం కరేలు మంటూనే ఉంది. అది మర్చిపోదామని మధు వృథాప్రయత్నం. అందుకేనేమో 'రాసిపెట్టిఉంటే అవకేం చేస్తుంది' అంటూ ఉంటారు అంతే అయిపోయింది. మొదటే తెలుసుంటే చేసుకునే వాడా?

అమ్మ దగ్గర చేరింది ఒకనాడు. చేరి అడిగింది నెమ్మదిగా నెమ్మదిగానే అడిగింది అప్పటి మధును మాట్లాడించేందుకు తండ్రి కూడ సమయంకోసం వేచిఉండవలసిందే. ఎవరితోను మాట్లాడేవాడు కాదు ఎప్పుడూ పుస్తకం చేతులో లేకుండా మధు దర్శనం అయ్యేదికాదు మామూలుమాటలు అతనికి ఊకదంపుగా కనపడేవి. వేదాంత గ్రంథాల్లోని భావాల్లో విహరించే మధుకు ఇవి రుచించేవి కావు

మధు తండ్రి మంచివాడు అంతే మాట ఏదో ఒకటి మంచిది అనగలడే కాని సమర్థించుకోలేడు.

"అబ్బాయి ఇలా చెయ్యడం మంచిదిరా! అనేవాడు తన అనుభవంతో ఆచి తూచి.

"అహా, అల్లాగా అండి' అని ఊరుకుని తను పుస్తకంలో అక్షరం అయిపోయేవాడు. ఉలకడు పలకడు

తండ్రి అతని సమాధానం కోసం ఎగురుచూచేవాడు. కొడుకుని కూర్చునేవాడు సమాధానం లేదు రెండుమూడు మార్లు అడగలేక పోయేవాడు. అడిగితే మధు ఆలోచనకు అంతరాయం కలుగుతుందేమో.

విశ్వతత్వాలను అన్వేషిస్తున్న వ్యక్తి తన కొడుకు అతని విజ్ఞానం అంతులేనిది తెలివి అనన్యము మాటాడక ఊరుకునేవారు మధు ఆలోచనలముందు ఈ పెళ్ళిని గురించిన ఆలోచన క్షుద్రమయినదేమో!

అతన్ని మళ్ళీ పలకరించేందుకు మనసు ఒప్పేదికాదు.

తల్లి జేరవి మెల్లగా...

"నాయనా..."

"ఊఁ .." అంతే సమాధానం.

మరోక మాటకోసం వేచిఉండేది.

"నాయనా పెద్దవాళ్ళం అవుతున్నాం. నువ్వు ఒక ఇంటివాడవుతే కొంచెం ముద్దూ ముచ్చటా..."

పూర్తవకముందే అందుకుని...

"అహాఁ .." అనేవాడు.

అమ్మ నోటికి తాళం

ఆమె ఇంకా ఏదో చెప్పదాం అనుకునేది.

ధైర్యం చాలేదికాదు ఆ తల్లికి...

ఆవిడ అక్కడే ఉండగానే మధు పుస్తకం మూసేవాడు.

తల్లి తొందరగా మాట అందుకోబోయేది.

మధు కుర్చీలో వాలి కళ్లు మూసేవాడు.

అరమూసిన మధు కళ్లు ఎక్కడో. విహరించే మధు

అతన్ని ఈ లోకంలోకి దింపలేక పోయేది తల్లి.

చదువయి ఇంటికివచ్చాడు. మధు ఏమాలోచిస్తున్నాడో ఎవరికీ తెలియదు.

అతనిలో ఏమి మార్పులు వస్తున్నాయో.

శరీరానికి కావలసిన అవసరాలు అతనికి పట్టవా?

తండ్రికి భయం, ఆ అవసరాలు లోకం తెలియని మధును ఎక్కడికేన్నా లాగేస్తాయని.

మధు తండ్రి చెప్పాడు అతని తల్లితో.

"నువ్వు వెళ్లి చెప్పిచూడు" అని.

ఎడదలోపల ఏదో బాధ రేగింది. అది ఆమెకు తెలియదు. అది కోడలు కావాలన్న తహ తహ కాదు. అది మాత్రం ఆమెకు తెలుసు

ఇల్లా తయారయే మధు బ్రహ్మచారిగా ఉండిపోతాడా?

ఈ లోకం, ఈ ధ్యాసే లేదే—

ఏమిటి కొడుకు ఆలోచన?

తనను ముసలితనంలో చూసే వాడే ఉండడా?

బాధంతా గూడు కట్టుకుని ఉంది

నాయనా, పెళ్ళి చేసుకోవాలిరా' అంది.

'ఆఁ' అని ఉలికి పడ్డట్టు చూశాడు.

తల్లి కంటనీరు పెట్టుకుంది

చూశాడు మధు ఓ క్షణం ఆలోచించాడు. ప్రాణం చిక్కుకున్నంత తల్లి ఎందుకూ కంట నీరు పెట్టింది?

ఆమె బాధకు తనే కారణభూతుడా?

"ఏమమ్మా" అని మాత్రం అనగలిగాడు.

ఆమె చెప్పలేదు అతనికి అర్థం కాదు. అతని మీమాంస అతనికి అమ్మ హృదయాన్ని అర్థం చేసుకోవడం చేతకాలేదు.

ఆ మూగ పోయిన హృదయాలు ఏదో చెప్పుతున్నాయి ఓదార్చుకున్నాయి ..

ఎన్నో ఏళ్ళ తర్వాత అమ్మ ఒళ్ళో తల దాచుకున్నాడు.

"నీయిష్టమమ్మా" అన్నాడు

*　　　*　　　*

మధు పెళ్ళయింది

పిల్లను చూపించే చేశారు.

కట్నం కానుకలు యిత్యాదుల అవసరం తండ్రీ కొడుకల కిద్దరికీ లేదు.

అయిపోయింది పెళ్లి.

అవకముందే విడిదిలో విడిసినప్పుడు తెలిసింది పెళ్ళికూతురు మూగదని. మగ పెళ్ళి

తను మాటలు రాక మూగ. ఆయన వచ్చీ మూగ. మౌనంగా ఉండే ఆయన ఏమి ఆలోచిస్తూ ఉంటారు? తన హృదయాన్ని ఆయన చదవ ప్రయత్నించే రోజు ఎప్పటికి వస్తుందో?

★ శ్రుతి చేసిన వీణ ★

వారి తరఫు లోకవ్యవహారం తెలిసిన పెద్దలు 'ఇంత అన్యాయమా'—అన్నారు. 'తిరిగి వెళ్దాం పదండి' అన్నారు.

మధు తల్లిదండ్రులు మాట్లాడే పరిస్థితుల్లో లేరు.

ఆడవాళ్లు ఆయత్త మవుతున్నారు తిరుగు ప్రయాణానికి.

"మూగి అయినా చేసుకుంటాను" అన్నాడు మధు.

ఆశ్చర్యపోయారు అంతా.

అయింది పెళ్ళి.

*   *   *   *

మధు భార్య మూగది. అతను ఆలోచించుకుంటున్నా, చదువుకుంటున్నా ప్రక్కన అల్లా నుంచునేది.

'కూర్చో' అనే వాడు. కూర్చునేది. మళ్లీ ఏవో చదువుకుంటూ ఉండేవాడు.

"అమ్మా, శారదా! ఇల్లా చూడమ్మా, అబ్బాయికి యిది ఇయ్యి" అని పానీయం పంపించేది అత్తగారు.

అల్లాపట్టుకుని నుంచునేది.

తీసుకుని మళ్లీ తన పనిలో మునిగిపోయేవాడు.

తనను మధ్యపెట్టి ఈ పెళ్లిచేశారు.

కరేలు మంది.

తనకు ఏమి లోటు ఉంది. శారదనురాసి పడేశాడు విధి. అనుభవించి తీరాలి.

నిత్యమోహనంగా ఉండే మధు ముఖం మీద మబ్బురేఖల్లా అలము కుంటున్నాయి కనపడీ కనపడని అసంతృప్తి ఛాయలు.

ఆమెవంక చూసేవాడు కాదు.

ఆమెను ఏమీ అనేవాడు కాదు.

ఏమైనా అనడం మధు స్వభావం కాదు.

"లోపలకు వెళ్లి పడుకో శారదా" అన్నాడు ఒకరాత్రి తల ఎత్తకుండా తను వ్రాసుకుంటూ.

మాటలు రావుగా. ఊ అనడం రాదు. ఆ అనడం రాదు. తను ఏం బాధ పడ్తున్నా అనుభవించాలి. అనేందుకు నోరులేదు. చెప్పుకుందుకు నోరులేదు.

వెళ్లి పడుకునే ఉంటుంది.

శారద నుంచుని ఉంది. ఆయన అన్న మాటలు తనకు తెలుస్తాయి. తెలిశాయని చెప్పలేదు. తనకు ఈ పెళ్ళి అయిందని తను సంతోషంతో ఎగిరి గంతెయ్యలేదు. తన భాషలో ఏదో అనుకుంది. తల్లిదండ్రులకు అర్థం అయేలా వ్రాసి చెప్పింది: 'పెళ్లి చెయ్యొద్దు - ఇక్కడే ఉణ్నివ్వండి' అని. శారదకు తెలుసు తనను చేసుకోబోయే మగడు తను మూగ అని తెలిసి చేసుకోడం లేదని. తెలియక చేసుకున్న వ్యక్తి ఎంత బాధపడ్తాడు! ఎంత బాధపెడ్తాడు! అసలు శారదకు నమ్మకంలేదు తన మెడలో తాళి కట్టబడేవరకూ. తన పెళ్ళి చెడిపోవాలని వేయి దేముళ్ళకు మొక్కుకుంది. ఏ దేముడూ మొర ఆలకించలేదు.

అయిపోయింది పెళ్ళి.

శారద పెళ్ళి వద్దంది. తనకూ వయసు వచ్చింది. వయసులో వచ్చే కోర్కెలు తనలోను తారాడకపోలేదు. తనకు సాంసారిక సుఖం అందరాని ఫలం అనుకుంది. పెడదారి పట్టకుండా గ్రంథపఠనం ఆలంబనం చేసుకుంది. అదే తనని దరిజేరుస్తుందని ఆశ పడింది.

అనుకోకుండా సాంసారిక జీవితం ఎదురయింది. ఒక వ్యక్తి భర్త అయ్యాడు. అతని పట్టువల్లనే ఈ పెళ్ళి జరిగిందని, మూగ అని తెలిసుండీ చేసుకున్నాడని తెలిసి బ్రహ్మానందపడింది.

అదంతా ఆవిరయిపోయేందుకు అట్టే కాలం పట్టలేదు.

ఏదో తాళికట్టడంతో తన పని అయిపోయిందని ఎంచేవాడు తన భర్త అయ్యాడు.

కాదు ఈయన ఎవరో మహానుభావుడు. కారణ జన్ముడు. ఈ విషయాలు ఈయనకు ఎక్కువ అనుకుంది.

తనలో కోర్కెలు రేగినప్పుడు చివుక్కుమనిపిస్తుంది.

ఒకోప్పుడు ఒక మహానుభావునికి సేవ చేసేందుకు పుట్టాననుకు నేది.

ఎందుకో ప్రక్కకు చూశాడు మధు. శారద అల్లాగే నుంచుని ఉంది తనవంక చూస్తూ, తను పడుకోమని చెప్పాడుగా, వెళ్ళదేం?

మళ్ళీ తన ధోరణిలో పడ్డాడు.

తను మాటలురాక మూగ. ఆయన వచ్చీ మూగ. మౌనంగా ఉండే ఆయన ఏమి ఆలోచిస్తూ ఉంటారు? తన ఊహకు అందడ ల్లేదు. తనను పడుకోమని చెప్పారు. తను వెళ్ళలేదు. తలెత్తి చూశారు. అయినా ఇంకేమీ మాట్లాడరేం? మళ్లీ ఆ మాటయినా రెట్టించరేం?

ఆయన బల్లమీద అవీ యివీ వస్తువులు ఉన్నాయి. బీరువాలో పుస్తకాలు ఉన్నాయి. ఆ పుస్తకాలు అతనితో మాట్లాడవు. తనూ ఒక అచేతనమయిన పుస్తకంలాంటిదేనా అతని భావంలో. ఆయన పుస్తకాల్ని విప్పిచూస్తారు-అర్థం చేసుకుంటారు.

తన హృదయాన్ని ఆయన చదవ ప్రయత్నించే రోజు ఎప్పటికి వస్తుందో?

తమాషాగా వాలి ఉన్నాయి ఆయన కన్నులు. ఏవేవో మార్పులు వస్తున్నాయి ఆయన ముఖంలో.

ఎంత అందంగా ఉంటారు ఆయన.

"తనను దగ్గరకు తీసుకుని"

సిగ్గుపడింది.

తనతో ఆయన తీయగా కబుర్లు చెప్పాలి.

చెప్తే - తను మారు మాటాడలేదు. ఆయనేం మాట్లాడి ఆనందిస్తారు పలక నేరని తనతో.

అది ములుకులా తగిలింది.

ఆయన నిశ్చలంగా చదువుకుంటున్నారు.

మధు మళ్లీ తలెత్తి చూశాడు. శారద నుంచుని ఉంది. ఆమె కన్నుల వంక చూశాడు. అటు తిప్పుకుంది చూచి. అందులో తళుకు ఉంది. తీపి ఉంది.

సిగ్గుపడింది, తను ఆయన వంక తదేక

ప్రధానిగా ఉండే రోజుల్లో చర్చిల్, కార్యాలయం వరండాలో నడచిపోతూ ఉంటే, ఆంథోని ఈడెన్ అంతరంగిక కార్యదర్శి ఎదురుపడ్డాడు. అతని చేతిలో ట్రే, దాన్నిండా కాగితాలూ ఉన్నాయి.

"వీటిలో నేను చూడవలసిన వేమైనా ఉన్నాయా" అన్నాడు ప్రధాని.

"లేవండి...లేవనుకుంటా"

"అయితే చూడకూడనివి ఏమన్నా ఉన్నాయా?" అన్నారు చర్చిల్ కొంటెగా, కదలకుండా.



“[illegible] రంగరంగా !!”

[illegible]

★ శ్రుతి చేసిన వీణ ★

దీక్షతో చూస్తూంటే ఆయన చూసేశారని.

"పోనీ యిల్లా కూర్చో శారదా"

కూర్చోలేదు శారద.

మధుకు అర్థం కాలేదు శారదభావం. ఆమె కూర్చోమన్నా ఎందుకు కూర్చోదు. చెప్పడం చాత కాదు.

తనకు వ్రాసి ఉంది ఇటువంటి సహధర్మచారిణి.

మధ్య పెట్టి కట్టారు శారదని తనకు.

తను వద్దంటే పెళ్ళి ఆగిపోయేదిగా.

కాని తను వద్దనలేదు.

పాపం మూగట! ఎవరు చేసుకుంటారు?

అందర్నీ ఆనందింప చేయటం,

తను ఆనందంగా ఉండడం,

మధు ఆదర్శం.

పాపం మూగ శారద అంతవరకూ వచ్చిన పెళ్ళి ఆగిపోతే ఎంత బాధపడుతుంది.

ఊహా ప్రపంచంలో విహరించే మధు శారదను సుఖపెట్టగలననుకున్నాడు. కాని తను ఏం చేస్తున్నాడు?

ఆమె ఏమాలోచిస్తోంది? గంటల తరబడి నుంచున్నది శారద.

పాపం—

చెయ్యి పట్టుకుని ప్రక్క కుర్చీలో కూర్చోపెట్టాడు.

కూర్చుంది పుస్తకంలా...

'శారదా'—అన్నాడు మధు. ఉబికి వచ్చే జాలికి స్వరాన్ని కల్పించలేక.

కొంచెం దగ్గరకు తీసుకున్నాడు.

చూసింది శారద మధు వంకకు.

అందులో ఎన్నో స్ఫురణలు ఉన్నాయి మధుకు ఏదో అర్థం అయింది.

మధు అల్లా రెప్ప వేయకుండా చూస్తూ కూర్చున్నాడు.

ఎన్నో మారులు శారదకళ్లు అతని దృష్టితో కలవబోయి చెదరి ప్రక్కకు తిరిగాయి.

శారద నెమ్మదిగా కలం తీసుకుని వ్రాసింది:

"మీరు చదువుకోండి—యిల్లా చూస్తూ కూర్చుంటా"నని.

ఆమె చూపుల్లో భావం అది కాదు. ఆ మాత్రం తెలుసు మధుకు.

మళ్ళీ చదువుకుంటున్నాడు.

శారద మూగది. స్వయం కృతాపరాధం. తనకు ఆమె అంటే జాలి. అంతే యింకేమీ లేదు.

ఆమెను చూస్తే తనలో కోర్కెలు రేగవు. ఆమె ఒక అందమయిన శిల్పము. శిల్పము తన దగ్గరకు రావడంలో తను మోసగింప బడ్డాడనే భావం అప్రశుతిలా ఆనందానుభవాన్ని చెడగొట్టింది.

* * *

తలమీద ఒక మొట్టికాయ పడింది.

ఎవరది!

ఇంట్లో ఎవరూ లేరు, అంత చనువు తీసుకో గలవాళ్లు.

మల్లిక!

ఎన్నాళ్లకు చూశాడు.

"ఏమిటి మధూ! తెగ రాసేస్తున్నావు. రాయడం మంచిదేననుకో ఒంటికి."

"మొన్నేగా ఉత్తరం వ్రాశావు—అందులో మాటమాత్రం వ్రాస్తేనేం వస్తున్నట్టు..."

"ఏం పెద్దసన్మానం చేసేవాడవా?"

"కాదు కొంచెం ఉత్సాహాలకీ, ఉల్కలకీ సిద్ధం అయేవాణ్ని"...

"ఇప్పుడుమాత్రం పోయిందేం—సిద్ధం అవుతూ ఉండు......ఈలోపులో స్నానం ఇత్యాదులు ముగిస్తాను" వెనకకు తిరిగింది మల్లిక.

"ఏయ్ మల్లికా.. ఇల్లా తిరుగు. పెద్ద యిల్లంతా తెలిసున్నట్టు వెళ్తావేం?"

"అదే తెలుస్తుంది...ఇదేం మహారాజ మందిరమా..."

"మహారాజ మందిరం అనికాదు. ఇది బ్రాహ్మల యిల్లు."

"ఓస్ పెద్ద బ్రాహ్మడు బయల్దేరాడండీ..."

"ఆ జోళ్లు వదిలేసి.. ఇంట్లో యిష్టంవచ్చినట్లు తిరుగు. కాని ఆ దక్షిణంవంక గదులలోకి మాత్రం వెళ్ళకు..."

"అక్కడ కాశీమజిలీ కథల్లోలా యే రాక్షసుడయినా రాకొమార్తెను దాచిఉంచాడా...దాన్ని నే విడిపించవలసి వస్తుందని దిగులా?..."

నవ్వొచ్చింది మధుకు ఆ అనేతీరు చూస్తే.

"రాకొమార్తె ఉంటే ఏంలాభం?...ఏ రాక్షసో రాకుమారుణ్ని దాచిందేమోనని."

"ఓస్ మామూలుగా మాట్లాడేస్తున్నారే? ఏమిటీ 'విషయం చెప్పకుండా పదిపేజీల గ్రంథం ఉత్తరం అనే పేరుతో నాకెత్తిన రుద్దుతే, ఏదో వచ్చి పడింది ప్రమాదం అని పరుగెట్టుకు వచ్చాను..." అన్నది మల్లిక.

> బుద్ధుణ్ణి గూర్చి సంగ్రహంగా నీకు తెలిసినది వ్రాయమనగా ఒక విద్యార్థి వ్రాశాడు: "గౌతమ బుద్ధుడు ముప్పది యేండ్లు వచ్చువరకు భార్యా పుత్రులతో మామూలుగనే సంసారము చేసెను. ఆపిమ్మట మనశ్శాంతికొరకు ఇల్లు విడిచి వెడలిపోయెను."

"నిజంగా అందుకోసం వచ్చావా మల్లికా?"

"ఉస్...అందుకే...అందుకే...మీ కుమల్లే అబద్ధాలు ఆడడం నాకలవాటు కాలా"

శారదవచ్చి చూచి క్రొత్తవ్యక్తిని చూచి వెళ్లబోతోంది.

"శారదా...యిదుగో యిల్లారా...ఈమె నాకు చెల్లెలు.. నీకు వదిన అన్నమాట..."

మల్లిక శారదను దగ్గరకు తీసుకుంది.

"మొత్తానికి నే రాకుండా చేసేసుకున్నారు, సర్లెండి...ఇంక నేను మీతో మాట్లాడను మా వదినా నేనూ జత..."

"అట్నే ఆపేద్దాం అనుకున్నాం..."

"వాగుడుకాయకి మూగరాణి జతపడింది. నేను యిన్నిఅన్నా—ఒక్కమాట ఆడితే ముత్యాలు రాలిపోతాయా తల్లీ..." అని శారదతో అంది.

విడిపించుకుని...శారద లోపలకు వెళ్లింది.

"వదినా..." మల్లిక పిలుపు

"శారద మూగది మల్లికా..."

ఆశ్చర్యపోయింది ఒక్కక్షణం తనని తను సంబాళించుకో లేకపోయింది.

"నిజంగానా మధూ..."

తనకు తెలిస్తే తను బాధపడ్తుందని తెలియజెయ్యలేదు ఈ విషయం. ఇదన్నమాట మధు బాధకు మూలం.

"నీకే తెలుస్తుంది...అమ్మా ..."

అమ్మ వచ్చింది.

"అమ్మా...మల్లిక వదినగార్ని చూద్దాం అని పనికట్టుకుని వచ్చింది. ఓ వారంరోజులు ఇక్కడ కట్టిపెటిఉంచే బాధ్యత నీది..."

అమ్మకు అది పర్వదినం. కొడుకు తనతో రెండుమాటలకంటె ఎక్కువ మాట్లాడాడు.

"రాకరాక వచ్చింది. వెళ్ళనిస్తానేమిటీ" అంటూ మల్లికవంక చూసింది

"కట్టిపెట్టే మాటవుతే రానేరాను. నా

ఇష్టంవచ్చినప్పుడు నన్ను రానివ్వాలి. నా యిష్టంవచ్చినప్పుడు పోనివ్వాలి...!

"చిత్రం" అన్నాడు మధు.

పక్కుమంది మల్లిక.

వెన్నెల నిండింది అందరి హృదయాల్లో.

ఆ నవ్వడంలో అర్థం తెలియలేదు అమ్మకి. కాని అందులో ఏదో ఉంది

మధును పలికించగల వ్యక్తి మల్లిక అనుకుంది తనలో తను.

*　　*　　*

'రాని మాటలకోసం బాధపడి ప్రయోజనం లేదు వదినా...'

జాలిగా చూసింది శారద.

ఇద్దరూ పడుకుని ఉన్నారు. అది రాత్రి సమయం.

మల్లిక శారదను బాగాదగ్గిరకు తీసుకుంది.

శారద మూగ హృదయంలో బాధలు మల్లికకు అర్థం అయాయి. ఆమె భావనలు అర్థం అయాయి

*　　*　　*　　●

"మధూ!"

తలెత్తి చూశాడు.

'పెద్ద రాత రాశారు లెండి...'

మల్లిక వచ్చింది శారదను తీసుకుని.

'ఇలా చూడండి; వదిన అంటోంది మా ఆయనకు చదువు తప్పితే మరో ప్రపంచం తెలియదని...చెప్పెయ్యనా?...'

శారదా, మల్లిక కూర్చున్నారు.

"ఇటు తిప్పుకోవయ్యా కుర్చీ - అతిథిని మర్యాద చెయ్యాలని కూడా తెలియదు—'

మధు కుర్చీ తిప్పుకున్నాడు.

"ఏమిటి రాస్తూంట?"

'నవల'

'అందులో నాయిక ఎవరు?'

'శారద'

శారదవంక చూచి నవ్వుతూ

'చూశావా వదినా నిన్ను సాహిత్యంలో ప్రతిష్ఠించి నీకు శాశ్వత కీర్తి సంపాదించి పెడుతున్నాడు. ఆ కీర్తి తిని తృప్తిపడు. నిన్ను ఇల్లా దూరంగానే ఉంచుతూ ఉంటాడు!

మధుకు బాధ అనిపించింది.

'అదేమిటి మల్లికా? అల్లా మాట్లాడతావు. అల్లా మాట్లాడితే అంతా అర్థం చేసుకోలేరు—'

'అందరికోసం అన్నమాటకాదు. ఎవరిని ఉద్దేశించి అన్నానో వారికి అర్థం అయింది.

'మల్లికా...'

"ఇదుగో మధూ! వదిన ఏమంటోందో తెలుసా...' నన్ను నాయిక చెయ్యడం ఏమిటి? నవ్వుల పాలు చెయ్యదల్చుకున్నారా అని.'

మధు ఆలోచనలో పడ్డాడు. ప్రఫుల్లమయిన ముఖం మల్లిక సన్నిధిలో కూడా ముణుచుకు పోయింది.

"బాధ పెట్టాలని అనలేదు. ధర్మం గుర్తు చేశాను."

శారద లేచి వెళ్ళిపోయింది. మల్లిక అడ్డు పెట్టలేదు.

"క్షమించు మధూ, బాధ పెడితే..."

"కాదు మల్లికా. నేను అదే ఆలో

కొండమల్లె

ఓ కుందసుందరీ! ఓ గంధసోదరీ!
నీహారధవళ దళీహార కంధరీ!
ఏ దేవభామినీ నృత్యమున సిగ జాఱి
వ్రేలితివా మా కొండవీటి పూదోటలో
　　　　ఓ కుందసుందరీ.

ఏ తెలుగు ముత్తైదు వుద్యాపనల తనియ
దయచేసినావో మా తావులకు తావుగా
　　　　ఓ కుందసుందరీ.

ఏ పాటకత్తె గళమెత్తి పాడిన పాట
వలపులై తీపులై ప్రసవించెనో జగతి
　　　　ఓ కుందసుందరీ.

ఏ రెడ్డి పెండ్లి ఊరేగింపు కనవచ్చి
మెచ్చి సుర లిచ్చారొ విచ్చివిచ్చని నిన్ను
　　　　ఓ కుందసుందరీ.

మాడిపో పొదరిండ్లు మసలిపో సెలయేళ్లు
కిటికి యెండల నడుమ కమ్మగా నవ్వేవు
　　　　ఓ కుందసుందరీ.

తొల్లి చలిపందిళ్ళ—చల్లమజ్జిగ లిచ్చి
వడపప్పు పంచితివో వడగొన్న పాంథులకు
　　　　ఓ కుందసుందరీ.

చేలలో గంధంబు పాలలో పరిమళము
నీదు సౌభాగ్యమై నిండారె నీ నోము
　　　　ఓ కుందసుందరీ.

రాణి వెన్నెలచాయ ఆణిముత్తెపు మిసిమి
నీ రూపురేకలై తేరినవి యే తపమొ!
　　　　ఓ కుందసుందరీ! ఓ గంధసోదరీ!

రాయప్రోలు సుబ్బారావు

★ శ్రుతి చేసిన వీణ ★

చిస్తున్నా. ఎల్లా ఆమెను సంతోష పెట్టడమూ అని ..!

"ఎల్లాగేమిటి?..."

నర్మ గర్భంగా నవ్వింది. అటువంటి నవ్వు మల్లిక ముఖంమీద చూడటం ఇదే మొదటిసారి

"కాని మల్లికా! ఆ మూగ అనే భావం నన్ను వదలిపెట్టేదు. ఆమె దగ్గిర నేను ఆనందంగా ఉండలేక పోతున్నాను. మరెల్లాగ చెప్పు ఆమెతో సర్దాగా ఉండడం..."

మల్లిక మాటాడలేదు. వాలుగా చూచింది, అర్థం కానట్టు. తల ఆడించింది అర్థం కాలేదని, ఆ కళ్లే అడిగాయి మళ్ళీ చెప్పమని.

"సంతోష పెట్టాలనే అనుకుంటాను! ప్రయత్నిస్తాను—కాని నాలో ఉత్సాహం అణగిపోతుంది—'

ఒహో అలాగా అన్నట్టు చూసింది.

"ఆమెమీద నాకు జాలి తప్పితే—యింకేమీ లేదు—'

అరే—అని. అని ఆశ్చర్య పోయినట్టు, జాలి పడ్డట్టు చూసింది.

"అంతే మల్లికా. అంతకంటె ఇంకేమీ లేదు. నువ్వు ఉంటే యిల్లా కబుర్లు చెప్తూ ఉంటానా—నాకు ఆమెతో మాట్లాడ బుద్ధి వెయ్యదు."

'నేను కూర్చుంటాను కబుర్లు చెప్తూ నాకదే పని' అన్నట్టు చూసింది.

"హాయిగా ఎప్పుడూ నవ్వదు. నవ్వడం రాదేమో!

ఎందుకు రాదూ అన్నట్టు చూసింది.

"వీమో వచ్చినా—నన్ను చూస్తే నవ్వ బుద్ధి వెయ్యదేమో!'

నవ్వింది మల్లిక.

'ఏం?'

ఏం లేదు ఊరికేనే అన్నట్టు చూసింది.

'మాట్లాడితే అర్థం అయిందో లేదో తెలియదు, సమాధానం చెప్పలేను...'

ఇప్పుడూ మరోకలా చూచింది.

మల్లిక మాట్లాడటంలేదు, శారద లోనికి వెళ్ళిన దగ్గరనుంచీ. అయినా అర్థం అవుతూనే ఉంది.

"మధూ! నేమాట్లాడడం మానేసి చాలా సేపయింది. అయినా మాట్లాడుతూనే ఉన్నావు. నేను యిచ్చే సమాధానం గ్రహిస్తూనే ఉన్నావు. నేమాట్లాడడం మానినట్టే తెలియదు నీకు. కళ్లల్లో ఒక భాష ఉంది మధూ! అవి మనం మాటలలో చెప్పలేనివి ఎన్నో చెప్పగలవు. అటువంటప్పుడు మామూలు మాటలు శారద మాట్లాడలేక పోడం పెద్ద లోటా—"

అల్లాగా. అవును ఆకళ్లు మాట్లాడుతాయి.

"వదినా వదినా" అని పెద్ద పెట్టున పిలుచుకుంటూ లోపలకు వెళ్ళింది, ఏదో మునిగి పోయినట్టు ఆవిడ వచ్చి తేల్చవలసినట్టు.

చెంపకు చారెడేసి కళ్లు ఉన్న శారదను వెంటపెట్టుకుని వచ్చింది మల్లిక...

శారదని సరాసరి తీసుకుని వచ్చి మధుకు ఎదురుగా కూర్చోపెట్టింది. తను ప్రక్కగా యిద్దరూ కనపడేట్టు కూర్చుంది.

"వదినా! అన్నయ్య పెద్ద నటుడు తెలుసా?"

"ఆహా—అల్లాగా" అన్నట్టు చూసింది.

"అదొక్కటే కొనని బాధపడ్తోంది మీ వదిన!"

భార్య వంక ఓరగా చూశాడు.

వదిన సిగ్గుగా తలవంచుకుంది.

"ఏం వేషం వేశాడో కూడా చెప్పెయ్యనా?"

వదిన చెప్పు అన్నట్టు చూసింది.

'చెప్పొద్దు అంటే మాత్రం మానావు కనకనా... కానియ్యి...'

వి వేషం వేసి ఉంటారు అనే ఆలోచనని స్ఫురింప జేశాయి శారద కళ్లు.

"అమ్మ దొంగా-వినో పెద్దఇష్టంలేనట్టు నటించి నాచేత చెప్పిద్దామని—నీ గొప్పని గానం చేసేందుకు వచ్చానా—నాకిదే పనా?..."

ఆ మాటల్లోని చమత్కారం చిరునవ్వు మొలిపించింది, ఇరువురి ముఖాల మీద.

మల్లిక ఇంకొంచెం నవ్వింది.

శారద ముఖం రాగరంజితం అయింది.

మధుర హాసపూరితమయిన శారద అందం మధు హృదయంలో వెన్నెల నించింది.

'ఇదుగో చెప్పేస్తున్నా మధూ...'

మధువంకకు దొంగచాటుగా చూస్తున్న శారద దృక్కులు సిగ్గుపడి చటుక్కున మల్లిక వంకకు తిరిగాయి.

ఒక తత్త్వవేత్త చాలా కాలం ఆలోచించి ఆలోచించి ఒక సిద్ధాంతం కనిపెట్టాడు: "ప్రపంచంలో ఆనందం అనేది లేదు. అందుచేత అది లేకుండానే ఆనందంగా ఉండడం మంచిది."

'అమ్మవు కదూ చెప్పకు. చెప్పకే కదూ...' అని బతిమాలుకున్నాడు.

మల్లిక "చెప్పితీరతానని" పట్టుపట్టింది.

మధు "చెప్తే...నీతో కావుకావు మాటల్లేవు" అని బుంగ మూతి పెట్టి కృత్రిమ కోపాన్ని అభినయించాడు.

శారద మోము విరిసిన పద్మంలా నవ్వుతుంది.

ఆ హాసంలో అందం సుగంధంలా ఆగదని అలుసుకుంది.

శారద వదిన కొంగు పట్టుకుని-'చెప్పకు' అన్నట్టు చూసింది.

"చూశావా వదిన కూడా చెప్పమంటోంది"

శారద 'చూశావా—నేనల్లా అడిగానటమ్మా' అన్నట్టు చూసింది. ఆ చూపు అడుగుతే మాత్రం ఆయనతో చెప్పేస్తావా అని కూడా అంది.

"మర్చిపోయాను..'' అంటూ లేచింది మల్లిక. శారద కూడ లేచింది కూడ వెళ్లేందుకు.

"మంచి పిల్లవే...నాకూడా ఎందుకమ్మ...మా అన్నయమ్మాయ్ నీకు తాళి కత్తె నేను కాదు...''

అంటూ దాటింది.

మధుకు తెలుసు మల్లిక ఏం కుర్చిపోయిందో.

శారద గుమ్మం దాటే లోపులో కొంగు పట్టుకున్నాడు మధు.

శారద సిగ్గుపడింది. ★



ఏడవ అధ్యాయం

ల వెళ్ళడమంటే వెళ్ళిందికాని వచ్చేటప్పుడు భయంతో కలతజెందకుండా ఉండలేకపోయింది ముందు ఏ పరిస్థితి ఎదుర్కోవాలో అని దేనికైనా సిద్ధపడవలసిందేననుకొని ఇంటికి చేరింది కాని ఆ వేళ భర్త రానేలేదు మర్నాడు ప్రొద్దున్న వచ్చాడు కమలతో ఏమీ మాట్లాడలేదు తన గదిలో కూర్చుని దస్తావేజులూ అవీ చూసుకోసాగాడు భోజనంవేళవచ్చి మౌనంగా భోజనంచేసి వెళ్ళిపోయాడు కమలకీపరిస్థితి దుర్భరంగా ఉంది భర్త వెంటనే అడిగివేసిఉంటే బాగుండును ఏదో తేలిపోవును ఇలా జాగుచేయడం ముళ్ళమీద కూర్చున్నట్లుంది బహుశా భర్త ఆ విషయం మరచిపోయాడేమోనని అనుకొని తన గదిలోకిపోయి పుస్తకపఠనంలో మునిగింది ఒంటిగంటవేళ బయటనుంచి 'ఏయ్' అన్న కేక వినిపించింది కమల ఉలిక్కిపడింది ఎవరిని అలా పిలుస్తున్నాడని మళ్ళీ "ఏయ్ నిన్నే" అని కేక కోపంగా వినిపించింది కమల కాశ్చర్యం వేసింది ఎవరినీ అని అయినా చూదామని బయటికి నడిచింది భర్త హాలులో అటూ ఇటూ తిరుగుతున్నాడు" "ఎవరిని పిలుస్తున్నారు" అని అడిగింది

"నిన్నే ఇంకెవరినీ లేకపోతే ఏం, కమలాదేవిగారూ అంటేకాని పలకరేమిటి రాణిగారు?" అన్నాడు రాజారావు మూతి వెటకారంగా ముడుచుకొని

"పిలుపు కొత్తగా ఉంది అందువల్ల ఎవరినో అనుకున్నాను" అంది కమల

"ఆఁహాఁ, కొత్తగా ఉందా? ఇ ముందుండదులే—ఇఁనుంచి అలాగే పిలుస్తాను కాబట్టి"

కమల మాట్లాడలేదు రాజారావు మళ్ళీ అటూ ఇటూ తిరుగసాగాడు కొద్దిసేపుండి అటు చివరకు నడచి ఆగి గోడవైపుకు తిరిగే "నిన్న వెళ్ళావా అక్కడికి" అన్నాడు

కమల "ఊఁ" అంది

"నేనేమని చెప్పాను" కమల జవాబీయలేదు

"ఏం మాట్లాడవేం, నేనేమని చెప్పాను?"

"వెళ్ళవద్దన్నారు"

"మరి ఎందుకు వెళ్ళినట్లు"

"ఆవిడ మరీ మరీ చెప్పింది తప్పకుండా వస్తానని నాచేత ఒట్టుకూడా వేయించింది ఆవిడ చాలా మంచిదికూడాను అందువల్ల వెళ్ళకపోతే ఆవిడ చాలా బాధపడుతుందని వెళ్ళాను"

"అయితే భర్తమాటకు విలువలేదన్న మాట!"

"ఎందుకు విలువలేదు? కాని—"

"కానీ ఏమిటె మళ్ళీ" అని గిర్రున తిరిగాడు రాజారావు "భర్తను కాదని అక్కడికి పోవడం భర్తమాటకి విలువ ఇచ్చినట్లేనా?"

"నేనేమీ అంత తెలియనిదానను కాను కదా! నాకు కారణం చెపితే ఏంపోయింది?"

"భర్త భార్యకు సంజాయిషీ చెప్పుకోవాలన్నమాట!"

కమల మాట్లాడలేదు ఆమెకూ కోపం పెరిగిపోతోంది చిన్నపిల్లల్ని ఆజ్ఞాపించినట్లు ఆజ్ఞాపించడం ఆమెకు చాలా అవమానకరంగా ఉంది అయినా కోపం అదుపులో పెట్టుకుంటూ మౌనంగానే ఉంది

"నీవిలా వ్యవహరిస్తావని ముందే నాకు తెలుసు అయినా కొన్నాళ్ళు ఓపిక పట్టామనుకున్నాను కాని నీవు మెల్లగామెల్లగా చెపితే గ్రహించేటట్లు లేదు ఇంతవరకూ ఊరుకున్నాను ఇక ఊరుకునేది లేదు మళ్ళా కిక్కురుమనకుండా చేయగలను తెలిసిందా? ఇకనుంచి జాగ్రత్తగా నడుస్తావా లేక సరిగా బుద్ధి చెప్పమంటావా?" అన్నాడు రాజారావు గుడ్లురుముతూ మీదికి వస్తూ

కమల ఆవేశం పట్టలేకపోతోంది ఓర్పు హరించిపోయింది పెదవులు వణుకుతున్నాయి ఆగలేకపోయింది "ఎందుకూ నన్ను బెదరిస్తున్నారు? మీరు కాదంటే వెళ్ళాననేగా స్త్రీ అయినంత మాత్రాన పురుషుడికి లోబడిఉండాలా? పురుషుడి కున్నట్లే స్త్రీకీ రక్తమాంసాలున్నాయి మెదడూ, హృదయా లున్నాయి ఆలోచనా, ఆవేశం, అభిమానం అన్నీ ఉన్నాయి నాకుమాత్రం స్నేహితులు అక్కరలేదూ? నలుగురం కలిసి ఏదో తోచిన విధంగా సంఘసేవ చేద్దామనుకుంటున్నాను సంఘసేవకూడా తప్పేనా? మనిషిజన్మ ఎత్తినందుకు ఏ మంచిపనీ చేయకపోతే ఎందుకు? కేవలం తిండి తినడమూ, పనికిమాలిన కబుర్లు చెప్పుకోవడమూ, నిద్రపోవడమూ ఇదే నా జీవితం?" అని కమల ఆగ్రహావేశంలో పడిపోయి అంటూంటే రాజారావు కోపం పట్టలేక ముందు కురికి ఆమె చెంపమీద ఛెళ్ళున వేశాడు మళ్ళీ చెయ్యి ఎత్తేసరికి కమల దెబ్బ ఆపుకుందుకు చేతులు మొగానికడ్డం పెట్టుకుంది దెబ్బ చేతులుమీదే తగిలి గాజులు పగిలిపోయాయి పగిలిన ముక్కలు కొన్ని చేతుల్లోనే గుచ్చుకొని రక్తం కారసాగింది రాజారావు పశుదోషంలో అదే పనిగా కొట్టడం మొదలుపెట్టాడు జుట్టు పట్టుకొని గుంజివేయసాగాడు అటూ ఇటూ పొడిచాడు తలుపుమీదకు త్రోసివేశాడు కమల క్రిందపడిపోయింది రాజారావు ఆమెను పట్టుకొని ఒక గుంజు గుంజి మంచంమీదకు త్రోసివేశాడు కమల కోపంతో దెబ్బలనుకూడా లక్ష్యం చేయక దేహం తనదికానట్లే ఉండిపోయింది మంచంమీదనుంచి వెంటనే లేచి "నన్ను కొట్టి అణుద్దామనుకుంటున్నారేమో, అది అసాధ్యం"- అని మళ్ళీ అనబోతూంటే రాజారావు ఆమెనోరు గట్టిగా నొక్కేశాడు "నోరుమూసుకొని పడిఉండు, పశువా నిన్ను పట్టపగలు ఖూనీ చేసినా ఇక్కడ నన్నడిగేవాళ్లు లేరు తెలుసా.

రాజారావంటే ఎవరనుకున్నావో! భార్య భర్తకెందుకు లొంగి పడి ఉండాలో ఇప్పుడు తెలిసిందా" అంటూ ఆమెను కదల నీయకుండా చేశాడు. ఇంతలో వీధిలోనుంచి "రాజారావుగారూ", అని కేక వినిపించడం వల్ల ఒక్క నిమిషమాగి "ఊఁ" అని హూంకరించి "ఇప్పటికి వదిలేస్తున్నాను తరువాత చెపుతాను పని. ఇంటర్మీడియేట్ చదివిన అహంకారం పూర్తిగా వదలగొడ్తాను" అంటూ వెళ్లిపోయాడు.

కమల అలాగే పడివుంది. లోపల ఆవేశం ఊరికే ఉబికిపోతోంది. ఒంటిబాధ తెలియడంలేదు. భర్త ప్రవర్తన తలచుకుంటూ ఆగ్రహంతో అలాగే చాలాసేపుంది. తరువాత చేతులమీద రక్తం చూసుకుంది. ఒళ్లు చితికిపోయినట్లుంది. తలంతా భారంగా ఉంది. అయినా పట్టుదలతో బాధనుల్లక్ష్యం చేయక వెళ్లి చేతులు వణుకుతూ చల్లని నీళ్లతో కడుక్కొని, చేతుల్లో గాజులు గుచ్చుకున్న చోట పౌడరద్దుకొని మొగానికి దెబ్బతగిలినచోట స్నో పూసుకుని వెళ్లి తన గదిలో కూర్చొని పుస్తకం తీసుకొని చదవబోయింది. కాని ఇంకా మనస్సులో ఉడుకు చల్లారకపోవడంవల్ల పుస్తకం మీదకు దృష్టిపోలేదు. కుర్చీలో కూర్చోవడం చాలా కష్టంగా ఉంది. బాధ మరచి పోదామన్నా అది క్రమ క్రమంగా మనస్సు కెక్కుతోంది. ఇక కుర్చీలో కూర్చోలేక టీ కాచుకొని త్రాగి మంచంమీద పడుకుంది. తను దెబ్బలకు భయపడినట్లు కనిపించకూడదని సాయంత్రం లేచి వంటవండి, తను తినకుండా, వంట గిన్నెలు వంటఇంట్లో పెట్టి ఉంచివేసి వచ్చింది. చీకటిపడిన తరువాత రాజారావు వచ్చి తనే భోజనం వడ్డించుకు తిన్నాడు. భోజనమయిన వెంటనే మళ్ళీ ఎక్కడికో వెళ్లాడు. తొమ్మిదిన్నరకు తిరిగి వచ్చాడు. కమల గదిలోకి నడిచాడు. కమల మంచంమీద పడుకొని పుస్తకం చదువుకుంటోంది. రాజారావు గుమ్మంలో నిలబడ్డాడు. కమల ఒకసారి అతనికేసి చూసి మళ్లా మొగం త్రిప్పుకొని పుస్తకంకేసి చూడసాగింది. రాజారావు ఎదరకు వచ్చాడు. కొద్దిగా తూలుతున్నాడు. వచ్చి మంచంమీద ఆమె పక్కన కూలబడ్డాడు. ఆమె చేతిలో పుస్తకం లాగుకోబోయాడు. కమలే పుస్తకం మడిచివేసి తలగడక్రింద పెట్టివేసింది. రాజారావు అటూ ఇటూ ఊగుతూ "ఏం రాణీ, కోపం వచ్చిందా? నన్ననవసరంగా రెచ్చగొట్టావు. నాకు కోపం వస్తే మనిషిని కాను. నిన్నలా కొట్టినందుకు బాధపడుతున్నాను రాణీ నీవంటే నిజంగా నాకు చాలా ఇష్టం. నిజంగా చిలకలా ఉంటావు. అనవసరంగా పోట్లాడి గొడవ లేమీ పెట్టుకోకు. చిలకలాగే ఉండు. అప్పుడు నిన్నెంత సుఖపెడ్తానో చూద్దువుగాని" అని కమలను దగ్గరకు లాగుకోబోయాడు.

కాని కమల విదిలించుకొని దూరంగా జరిగింది. "అదుగో మొండిపట్టు మొదలు పెట్టున్నావు మళ్లీ. అదే నాకసహ్యం. ఊఁ, అడ్డు పెట్టకు" అని ఆమె దగ్గరకుజరిగి మొగంమీద మొగం చేర్చబోయాడు. కమల మొగం ఇంకో వైపుకు త్రిప్పివేసుకుంది. "ఏమిటీ పెంకితనం. మళ్లీ నాకు కోపం తెస్తున్నావు, రాణీ. నిజమే చెపుతున్నాను నేను నిన్నేం చేసినా ఇక్కడ నోరెత్తేవా రుండరు. నీవు ఎంత మొత్తుకున్నా పలికే వారుండరు. ఓదార్చేవారంతకన్నా ఉండరు. రాజారావంటే అంత హడలు. ఊళ్లో రౌడీలందరూ నా చెప్పుచేతుల్లో ఉండేవాళ్ళే. ఏపని చేయమంటే అది చేసేస్తారు. అంతా గప్ చిప్‌గా చేసేస్తారు. తెలిసిందా? అందుకే జాగ్రత్తగా మసులుకో అని చెపుతున్నాను. ఆపైన బ్రహ్మదేవుడు వచ్చినా ఏమీ చేయలేడు." అన్నాడు మేకపిల్లకేసి చూసే తోడేలులా చూస్తూ. కమలకు నిజంగా భయంవేసింది. అతని కళ్లలోకి చూస్తూంటే గుండె అగురుతోంది. అతని మాటల్లో ఏ మాత్రమూ అబద్ధం లేదనిపించింది. అయినా బింకంగా నిలబడి నిర్లక్ష్యంగా చూస్తోంది. రాజారావు సేపు చూసి మళ్లీ నవ్వుతూ లేచి దగ్గరకు వచ్చాడు, "రా చిలకా, ఆలస్యం చేయకు" అంటూ, ఆమెను పట్టుకొని లాగబోయాడు. కమల గట్టిగా విదిలించుకొని తప్పించుకోబోయింది. మళ్లీ పట్టుకున్నాడు. కమల పెనుగులాడుతోంది. రాజారావు గట్టిగానొక్కి పట్టుకున్నాడు.


"ఏమిటీ పెనుగులాట? మానుతావా లేదా? మళ్ళీ పొద్దున్న చికిత్స చేయమంటావా?" అన్నాడు భీషణంగా. "ఏం చేసినా భయపడను నాకూ అభిమానం ఉంది. పశువులా మాడబడడానికి నా బొందిలో ప్రాణముండగా ఒప్పుకోను" అంది కమల. "ఒప్పుకోవూ, ఒప్పుకోవూ" అని ఆమెను గట్టిగా పట్టుకొని మంచంమీదకు విసిరాడు. బోరగిల పడింది కమల. ఆమె లేచేలోగా ఆమె నడ్డిమీద బాదివేయడం మొదలు పెట్టాడు. "ఏదు, ఏదు ఏడ్చేవరకూ వదిలిపెట్టను. ఆడది మగాడికన్నా ఎందుచేత తక్కువో చూపిస్తాను", అని కొట్టున్నాడు. కమలకు శరీరంలోని ఎముకలన్నీ విరిగి పోతున్నట్టున్నాయి బాధ భరించలేక పోతోంది. వెంటనే ప్రాణం పోయినా బాగుండు ననిపిస్తోంది. మనస్సు వశం తప్పిపోతోంది. హృదయంలోనుంచి ఏడుపు పైకి రాబోతోంది. అయినా పట్టుదలతో పళ్ళతో పెదవులు నొక్కుకుంటోంది. ఆపుకోవడం కష్టమవుతోంది. పళ్లు పెదవుల్లోకి దిగిపోయాయి. రక్తం చిమ్మింది కూడా. రాజారావు ఊపిరి తీసుకుందుకాగి "ఊఁ సామాన్య ఘటం కాదన్నమాట. చాలా ఉంది పట్టుదల. అయినా వదల్చివేస్తాను. ఎవరి కోసం ఏడవవో చూస్తాను. నేను చెప్పినట్లు నడుచుకోకుండా ఎలా బ్రతకగలవో చూస్తాను. ఈ వేళకు వదిలి వేస్తున్నాను కాని ఎగిరి పడకు. ఏడిపించేవరకూ వదలను" అని విసురుగా తలుపు తీసుకొని, ఎక్కడికో వెళ్ళిపోయి ప్రొద్దున్న వరకూ రాలేదు.

(ఇంకా వుంది)

అర్థనిర్వచనం

స్త్రీసాహసం ప్రమాదం అని తెలిసి ఖాతరు చేయకపోవడం.

పురుషుడి ధైర్యం: ప్రమాదం నివారించవచ్చునన్న ధీమా





“రాధామాధవయోర్జయన్తి యమునా
కూలే రహః కేళయః”


18–వ శతాబ్దపు రాజపుత్ర చిత్రం.



పేరంటానికి పిలుపు



చిత్రకారుడు: కేతిసీడి భాస్కరరావు.



విరహా బాధిత రాధిక, ఆమె పంపున
కృష్ణుని దర్శించ నేగిన దూతిక.

19–వ శతాబ్దానికి చెందిన రాజపుత్ర చిత్రం



కలువపూలతో జమున

గత సంవత్సరం తెలుగు చిత్రాల సమాలోకనం

క్రిందటేడు దాదాపు పాతిక తెలుగు చిత్రాలు విడుదలైనాయి. వీటిలో మూడు చిత్రాలు. డబ్ చేయబడిన చిత్రాలు దాదాపు ఏడు చిత్రాలు ఆంధ్రేతరులు నిర్మించినవి 19 దాకా సాంఘికాలు, 4 జానపదచిత్రాలు, 2 పౌరాణికాలు ఆరు చిత్రాలు శతదినోత్సవాలు చేసుకున్నాయి ఒక చిత్రం రజతోత్సవం కూడా చేసుకున్నది. మొత్తంమీద చూస్తే విజయవంతంగా సాగినచిత్రాలు, ఒక మాదిరిగా నడిచినవి ఎక్కువ. బాగా దెబ్బతిన్న చిత్రాలసంఖ్య 1955 లో చాలా తక్కువే. అందుచేత క్రిందటి ఏడాది తెలుగు సినిమా పరిశ్రమ పని బాగానే ఉన్నదనుకోవాలి నిర్మాణంలో ఉన్న చిత్రాలు కూడా దాదాపు నలభై ఉండడంచేత పరిశ్రమ బాగా కోలుకున్నట్టే అంచనా వెయ్యవచ్చు.

క్రిందటేడు జరిగిన ముఖ్య సంఘటనలలో ఒకటి, ఒక సంవత్సరం ఆలస్యంగానైనా తెలుగుచిత్రాలలో మూడింటికి కేంద్రప్రభుత్వం బహుమతులివ్వడం. 1954 లో విడుదలైన తెలుగుచిత్రాలలో ఉత్తమమైనవిగా పెద్దమనుషులు, తోడుదొంగలు, విప్రనారాయణ చిత్రాలకు బహుమతులు లభించాయి

ఈ చిత్రాలు మూడూ బహుమతులకు అర్హమైనవేనని నిరాఘాటంగాచెప్పవచ్చు. ఈ మూడిటిలో ఏదీ ఆర్థికంగా అద్భుత విజయం సాధించలేదు ఒక చిత్రం తీవ్ర నష్టానికి గురి అయింది కూడాను అయినప్పటికీ కళా నైపుణ్యం, కథా ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రాలకు బహుమతులిచ్చారు. మంచి చిత్రానికి బహుళ ప్రజాదరం పొందడం ఒకటే కొలబద్ద అయితే, అనేక కారణాలవల్ల విజయం పొందిన తక్కువ చిత్రాలను కూడా పరిగణనకు తీసుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. అందుచేత పై బహుమతులు అన్నివిధాలా సమర్థించదగినవి ఈ బహుమతుల ఏర్పాటువల్ల, ఎక్కువమంది నిర్మాతలు ఆర్థికలాభాలనే దృష్టిలో పెట్టుకుని చిత్రాలు తీస్తూపోయినప్పటికీ, కనీసం కొందరు ఉత్సాహవంతులైనా ప్రభుత్వ పరిగణనకోసం కళాత్మకచిత్రాలు నిర్మించేవారు బయలు దేరతారు

పౌరాణిక చిత్రాలపైకి నిర్మాతలమోజు మళ్లినప్పటికీ, గతసంవత్సరంలో సాంఘిక చిత్రాలే ఎక్కువ విడుదలయ్యాయి శతదినోత్సవాలు జరుపుకున్న ఆరుచిత్రాల్లోను నాలుగు సాంఘిక చిత్రాలే అందులో అపూర్వవిజయం పొందిన "రోజులు మారాయి"పచ్చి సాంఘిక చిత్రం. ఇది గమనించదగిన విశేషం



1954 సం॥ తెలుగు చిత్రాలలో భరణీవారి "విప్రనారాయణ" కు ప్రశంసా పత్రం లభించింది. దర్శక నిర్మాత రామకృష్ణ రాష్ట్రపతి నుండి బహుమానం స్వీకరిస్తున్నారు.



[illegible]

వర్ధమాన దర్శకుడు రజనీకాంత్



"ఒక్కొక్క మెట్టే ఎక్కి..."

శాస్త్రోక్తంగా నేర్చుకోతలసినదంతా నేర్చుకుని, కట్టుదిట్టమైన శిక్షణపొంది, ఆపైన దర్శకత్వ బాధ్యత నిర్వహించపూనుకొన్న వ్యక్తి శ్రీ సబ్నవీస్ రజనీకాంత్. ఈయన దర్శకత్వాన తయారైన తొలి చిత్రం "వదినగారి గాజులు" 1954 లో విజయయాత్ర చేసింది.

రజనీకాంత్ ఆంధ్ర విశ్వవిద్యాలయ పట్టభద్రుడు. విద్యాభ్యాసం బందరులో. ఆపైన చలనచిత్రాలమీద ఆసక్తి కలిగింది సెంట్రల్ పాలిటెక్నిక్‌లో చేరి, సినిమా ఫొటోగ్రఫీ, సౌండ్ ఇంజనీరింగ్ అభ్యసించారు.

తరువాత, శ్రీ కె. సుబ్రహ్మణ్యం నిర్మించిన 'డాక్యుమెంటరీ చిత్రాలకు' అసిస్టెంట్ కెమేరామన్‌గా పనిచేశారు. ఇందులో అనుభవం సంపాదించి, ఫీచర్ చిత్రాలలో ప్రవేశించారు. షావుకారు, పెళ్ళిచేసిచూడు చిత్రాలలో శ్రీ ఎల్. వి. ప్రసాద్ వద్ద సహాయదర్శకుడుగా పనిచేశారు. తరువాత, 'పిచ్చిపుల్లయ్య,' 'నిరుపేదలు' చిత్రాలకు శ్రీ తాతినేని ప్రకాశరావుకు అసోసియేట్‌గా పనిచేశారు.

1954 లో స్వతంత్రంగా దర్శకత్వం వహించి, తీసిన గోకుల్ పిక్చర్ 'వదినగారి గాజులు' విజయవంతం గానడచింది. ఇప్పుడు గోకుల్ పిక్చర్స్ రెండవచిత్రం కనకతారకు దర్శకుడు. మొన్ననే సాహిణీవారి రెండవ చిత్రానికి (ఇంకా పేరు పెట్టలేదు.) దర్శకత్వ బాధ్యత స్వీకరించారు. ఈ చిత్రం నిర్మాణం ఈ నెలాఖరువాటికి ప్రారంభిస్తున్నారు.



"మృదువైన స్వరం, మధురమైన రాగం....."

ఎ. ఎం. రాజా మొట్టమొదటి ప్లేబాక్

దక్షిణభారతంలో అన్ని ప్రాంతాలవారికీ సుపరిచితమైన మధురస్వరం ఒకటి వుంది. తెలుగువారికీ, కన్నడులకూ, తమిళులకూ, మలయాళీలకూ ఆపైన సింహళీయులకూ అందరికీ తెలుసు. 'ఓహ్హృదయరాణీ' అనే పాటవిన్న తెలుగువారికి అందరికన్న ముందు తెలుసు.

ఎ. ఎం. రాజా ఆ పాటపాడి నాలుగున్నర సంవత్సరాలయింది. అది జరిగిన కొద్దికాలంలోనే, తెలుగు చలన చిత్రాలలో ప్రముఖ ప్లేబాక్ గాయకుడు అంటూ సర్వత్రా ఎన్నిక చేశారు.

ఈ నాలుగున్నరయేళ్ళలో, రాజా మొత్తం 200 చిత్రాలలో ప్లేబాక్ ఆర్టిస్టుగా పనిచేశారు. ఇందులో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, సింహళ చిత్రాలు ఉన్నాయి. జెమినీవారి హిందీ చిత్రాలు 'సన్సార్, బహుత్ దిన్ హుయే'లు రెండింటిలోనూకూడా రాజా పాడాడు.

రాజా స్వస్థలం చిత్తూరుజిల్లా రామాపురం. జననం 1929.

"చిన్నప్పటినుంచీ, సినిమా పాటలంటే నాకు చాలాయిష్టం. మావాళ్లు ఇది చూసి, సంగీతం మేష్టార్ని పెట్టించి, కట్టుదిట్టంగా శాస్త్రీయసంగీతం నేర్పించారు. 1949 లో చెన్నపట్నంవచ్చి పచ్చయ్యప్ప కాలేజిలో బి. ఏ. లో చేరాను. 1950 లో ఇంటర్ కాలేజియేట్ కాంపిటీషన్ జరిగింది. మా

గత సంవత్సరం తెలుగు చిత్రాలు

ఉత్తమ గ్రంథాలను తీసుకొని ఉత్తమ చిత్రాలుగా నిర్మించడంవిషయంలో మాత్రం తెలుగు వారు ఇంకా వెనకబడే ఉన్నారు. వినోదా వారు కన్యాశుల్కం నాటకం తీసుకుని చిత్రం నిర్మిస్తున్నారనే వార్త సారస్వతాభిమానులకు ఎంతఆసక్తి కలిగించిందో, ఆ చిత్రం అంత ఆశాభంగం కలిగించింది. మామూలు చిత్రాల పద్ధతిలో, సర్వసామాన్యమై పోయిన నృత్యాలు, పాటలు మొదలైన హంగులతో ఈ చిత్రాన్ని నిర్మించడం వల్ల, కన్యాశుల్కంలోని ఇతి వృత్తం అటువంటి 'ట్రీట్‌మెంట్'కు అతీతమైనది కావడంవల్ల ఆ చిత్రం అటు సామాన్య ప్రేక్షకులను గాని, ఇటు సారస్వతాభిమానులను గాని ఆకర్షించలేక పోయింది.

ఉత్తమ సాహిత్య గ్రంథాల జోలికి వెళ్ళేముందు నిర్మాతలకు వాటి మీద అత్యంత గౌరవ భావం ఉండడం, గ్రంథకర్తతో తాదాత్మ్యం పొంది మరీ నిర్మించడం అవసరం. ఆ గ్రంథానికున్న పలుకుబడిని ఆసరా తీసుకుని విజయం పొందలేమా అని అనుకోవడం ఉచితం కాదు. ఉత్తమ గ్రంథాన్ని వ్రాసిన రచయిత ఏ స్థాయిలోనివాడో, ఆ గ్రంథాన్ని చిత్రీకరించబోయే దర్శకుడు, నిర్మాతకూడా ఆ స్థాయిలోని వారే అయి ఉండాలి. పునస్సృష్టి చెయ్యగలిగినంత ప్రతిభ కలవారై ఉండాలి. ఈ విషయం బెంగాలీ చిత్రం "పథేర్ పాంచాలీ"ని చూస్తే తేటతెల్లమవుతుంది. బెంగాలీలో అత్యుత్తమ నవలల్లో ఒకటైన 'పథేర్ పాంచాలీ'ని చిత్రంగా నిర్మించడంలో దర్శకుడు పాతపద్ధతులను, అందరూ అనుసరిస్తున్న బాక్సాఫీస్ సూత్రాలను అవతల నెట్టివేసి స్వతంత్రమైన పంథా అనుసరించాడు. సాధారణంగా భారతీయ చిత్రాల్లో కనిపించని పద్ధతుల్లో, నూతన దృక్పథంలో సత్యజిత్ రాయ్ ఆ చిత్రాన్ని నిర్మించాడు. కన్యాశుల్కం వంటి ఉత్తమ నాటకాన్ని చిత్రించడానికి కూడా అటువంటి అసాధారణ మార్గమే అవసరం గాని మామూలు పద్ధతులు పనికిరావు. మూల గ్రంథం యొక్క స్వరూప, స్వభావాలను అకళింపు చేసుకున్న దర్శకుడే ఆ అసాధారణ మార్గమేదో అన్వేషించి తెలుసుకో గలడు.

★



నాట్యతార మాలాసిన్హా.

నేటిచిత్రాలపై శ్రీ. బి. ఎన్. రెడ్డి అభిప్రాయాలు

"ఈ రోజుల్లో చలన చిత్రాలు విరివిగా తయారవుతున్నాయి. అయితే వైవిధ్యం కనబడదు. అన్నీ ఏవో కొన్ని సూత్రాలకు కట్టుబడి మూసలో పోసినట్లు తయారవుతున్నాయి. సంఖ్యతో పాటు స్థాయి, పెరగాలంటే, వైవిధ్యం ఉండాలంటే, నూరింట అరవై డెబ్బై చిత్రాలు దెబ్బతినకుండా చెయ్యాలంటే, పరిశ్రమలో సంయుక్త కృషి అవసరం" అని సుప్రసిద్ధ దర్శకుడు, శ్రీ బి.ఎన్. రెడ్డి భావిస్తున్నారు.

కథలన్నీ దాదాపు ఒకే పంథాలో ఉంటున్నాయి. సృజనాత్మక ప్రతిభ గలవారు తక్కువ. ప్రధానభూమికలు నిర్వహించే వారిలో బహుకొద్దిమంది అత్యధిక చిత్రాలలో కనబడుతున్నారు. సంగీత దర్శకులూ దాదాపు అంతే. దీనికితోడు చిత్రాల నిర్మాణము మహావేగంగా సాగుతోంది. ఈ స్థితిలో కొత్తదనం, వైవిధ్యం ఎలా కనబడుతుంది?

మన చిత్రాలకు పోషకులు — ప్రధాన పోషకులు గ్రామీణ ప్రజలు. కళాభిమానులు, చదివినవారు ఆ తరువాతే వస్తారు. అందువల్ల ఒక చిత్రం విజయవంతం కావా-



శ్రీ బి. ఎన్. రెడ్డి.

లంటే, ఒక్కొక్క ప్రేక్షకుడు దాదాపు 15 సార్లు చూడాలన్నమాట. అందుకని, అంతగా ప్రేక్షకులను ఆకర్షించడానికి అనుభవంలో ఉన్న సూత్రాలను పాటించడం జరుగుతున్నది. ఇవి స్థితిగతులు" అన్నారు శ్రీ రెడ్డి.

90 సినిమాలకి నలుగురు హీరోలు

స్థూలంగా పరిశీలిస్తే సగటు లెక్కలతో చాలా కథ తెలుసుకోవచ్చునంటూ ఆయన ఇలా వివరించారు.

తెలుగు తమిళం కలిపి ఇప్పుడు దాదాపు తొంభై సినిమాలు తయారవుతున్నాయి. ఇన్ని చిత్రాలకూ, ఉన్న హీరోలు నలుగురు. ఇద్దరు తెలుగువారూ, ఇద్దరు తమిళులూను. హీరోయినులు, స్థూలంగా ఐదుగురున్నారు. పోతే, నాయికా నాయకుల తరువాత ప్రధాన భూమికలు నిర్వహించేవారు, వారూ వీరూ కలిపి పదిమంది ఉంటారు. హాస్యనటులు అరడజను మంది. దర్శకులు పదిమంది. సమర్థులయిన సంగీత దర్శకులను కళా దర్శకులను వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. ఫోటోగ్రఫీ, సౌండ్ మొదలైన సాంకేతిక విద్యలలో శిక్షణ పొంది సామర్థ్యం గడించినవారు 15 మంది ఉంటారు.

సాలుకు కోటి రూపాయల నష్టం

ఈ రకమైన సిబ్బందితో, ఇబ్బందిపడుతూ నిర్మాతలు తయారుచేసే చిత్రాలలో నూటింట సుమారు డజను చిత్రాలే డబ్బు చేసుకుంటున్నాయి. ఆ పదింటికో బాగా లాభాలొస్తున్నాయి. మిగతా డెబ్భై ఎనభై చిత్రాలకీ సగటున లక్షో, లక్షయాభై వేల వరకూ నష్టం వస్తోంది. అంటే పరిశ్రమలో కొదిమందికి ఏ పాతిక లక్షలో లాభం వస్తే, పరిశ్రమ మొత్తం మీద సాలుకు దాదాపు కోటి రూపాయలు నష్టం వస్తోందన్నమాట!

ఉటోపియా కాదు

ఈ పరిస్థితులుమారి, చిత్రాల సంఖ్యతో పాటు స్థాయి పెరగాలి డబ్బు చేసుకున్న చిత్రాన్ని చూచి, మిగతా నిర్మాతలు తమ చిత్రాలను ఆ మూసలోనే పోసే ధోరణి పోవాలి. చిత్రాలలో వైవిధ్యం వుండాలి. పరిశ్రమలో ఒకవిధమైన సమన్వయం కుదరడం ముఖ్యం. అది వున్ననాడు పోటీ తీవ్రత తగ్గుతుంది. ఇది జరగాలంటే మన తెలుగు సినిమాపరిశ్రమకు కనీసం మూడు చలనచిత్రనిర్మాణ సంస్థలు కార్పొరేషను ఉండాలి. సగటున ఆరుగురు నిర్మాతలు కలిసి సుమారు పాతికలక్షల రూపాయల పెట్టుబడితో ఒక్కొక్క కార్పొరేషన్



గత సంవత్సరపు బాక్సాఫీస్ దర్శకుడు తాపీ చాణక్య

ఎ. ఎం. రాజా

కాలేజీ తరఫున నేను పాల్గొన్నాను. ప్రథమ బహుమతి మా కాలేజీకి వచ్చింది" అన్నాడు రాజా సంగ్రహంగా తనకథ చెబుతూ.

దరిమిలా, హెచ్. ఎం. వి. లో ఎంత మారవో పయనము, ఓ హృదయరాణి అనే రెండుపాటలు రికార్డిచ్చాడు రాజా. కొద్ది కాలంలో సినిమాలలో పాడే అవకాశం వచ్చింది.

1951 లో బి. ఏ. పూర్తిచేసుకొని, ఆ ఏడాది జూలై నెలలో తొలిసారిగా సినిమాలో పాడాడు.

రాజా ఇప్పుడు భాగ్యరేఖ, సదారమ, సొసైటీ పిక్చర్స్ కొత్తచిత్రం, అలీబాబా మొదలైన తెలుగు చిత్రాలూ, మరికొన్ని తమిళ, మలయాళ చిత్రాలూ — మొత్తం 15 చిత్రాలలో పాడుతున్నాడు.

"వీటిలో ఎక్కువ తమిళ చిత్రాలే. ఇంకో తమాషా ఏమిటంటే, నేను మొట్ట మొదట ప్లేబాక్ పాడింది తమిళ చిత్రంలో. అది జెమినీవారి సంసారం. నాకు మొట్ట మొదట అవకాశం ఇచ్చినవారు శ్రీ ఎస్. ఎస్. వాసన్" అన్నాడు రాజా.

* * *

కాలో ప్రవచ్చును. ఇలా కోసం మూడు నాలుగు రోజులు నిలువ ఉంటే, మూడూ మూడు కాలాల చిత్రాలు నిర్మించటంవల్ల ప్రత్యేక శ్రద్ధతో కృషిచేయవచ్చును. ప్రత్యేక శ్రద్ధతో కృషిచేసి నిర్మించే చిత్రాలన్నీ మంచి చిత్రాలుగా రూపొందుతాయి. నాడు కొత్త నటీనటులకూ, రచయితలకూ తగినంతగా తరిఫీదునిచ్చి ప్రవేశపెట్టడానికి - యీనాడు వ్యక్తిగతంగా ఏ నిర్మాతకూ లేని సావకాశం ఉంటుంది.

ఇదంతా ఆచరణలో పెట్టడం కష్టం కావచ్చు కాని, అసాధ్యంమాత్రం కాదు.

పిల్లలూ చలన చిత్రాలూ

పిల్లలకు చలనచిత్రాలు నిర్మించే విషయం ప్రస్తావిస్తూ, కథలు లేవన్న వాదాన్ని శ్రీ రెడ్డి సమర్థించారు.

"పిల్లల చిత్రాలు నిర్మించడానికి పనికి వచ్చే కథలు విరి ప్రచురించడం జరగాలి. దీనికి ప్రభుత్వం, పెద్దలూ పూనుకొని, చలనచిత్ర సారస్వతం తయారుచేయాలి. కథలు విరివిగా తయారై ప్రచురించబడితే, వాటిని చిత్రాలుగా నిర్మించడానికి వీలు పడుతుంది" అని ఆయన అన్నారు.

దివినుండి భువికి

మన చిత్రాలలో ఈనాడు, మనది అని చెప్పుకోడానికి వీల్లేని సంగీతం చాలా వినబడుతోందన్న విమర్శలగురించి ప్రస్తావన రాగా రెడ్డిగారు ఇలా అన్నారు.

దీనికి బాధ్యులెవరూ? సమర్థులూ, అనుభవజ్ఞులూ అయిన సంగీత దర్శకులను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. ఈ కొద్దిమందే, దాదాపు అన్ని చిత్రాలకు సంగీతం సమకూర్చుతున్నారు. సగటున ఏడాదికి 900 కొత్తపాటలకు వరసలు కట్టాలి. దీనికి తగ్గట్టు తొందర ఒకటి వుండాపుడీ. ఈ స్థితిలో, ఎవరు మాత్రం చేసేదేముంది. ఉన్న వరసలనే కాస్తో కూస్తో మార్చి కొత్తవరస కడతారు. లేకపోతే విదేశీయ మట్లను అనుకరిస్తారు. ఈ పరిస్థితులు మారి, అపారమైన భారతీయ సంగీతార్ణవం నుంచే, ఈనాటి చలన చిత్రాలకు కావలసిన సంగీతం రావాలంటే, సంగీత నిధులైన విద్వాంసులు, ఒక్కమెట్టు దిగిరావాలి. వారి కర్ణాటక బాణీలనుండే లలిత సంగీతాన్ని సృష్టించి, సామాన్య జనానికి అందచేయాలి. సినిమా సంగీతం అంటూ, దీన్ని లోకువగా చూసినంతకాలం, దీనికీ, మన శాస్త్రీయ సంగీతానికీ ఉన్న అంతరం నానాటికీ పెరుగుతూనే ఉంటుంది. సంగీత విద్యానిధులంతా దివినుండి భువికి దిగి రావాలి. ★

వర్ధమాన నటుడు నాగభూషణ్



"చిన్నా పెద్దా అనేది వేషాలకు కాదు; నటులకే వర్తిస్తుంది..."

కొత్త సంవత్సరంలో వెండితెరమీద కనబడబోతున్న కొత్త హీరో నాగభూషణం నటుడుగా చిరపరిచితుడే అయినా, తొలిసారిగా అతను ప్రధాన భూమిక నిర్వహిస్తున్నది ప్రతిభావారి 'ఏది నిజం?' అనే చిత్రంలో. నిండైన విగ్రహం, గంభీరమైన స్వరంగల నాగభూషణం సమర్థులైన నటులలో ఒకడు. 1951 ఏప్రిల్‌లో సినిమా రంగంలో ప్రవేశించాడు. తొలి చిత్రం రూపవతి. ఇంతవరకూ నటించినవి: పల్లెటూరు, జ్యోతి, అమరసందేశం, రేచుక్క, రాజేశ్వరి, అర్ధాంగి, పరాశక్తి. ఎ. వి. ఎం. వారి నాగులచవితిలో శివుడి పాత్ర నిర్వహించాడు.

వాహినీ కొత్త చిత్రం భాగ్యరేఖలో ఇటీవలే బుక్ అయ్యాడు. శ్రీ బి. ఎన్. రెడ్డి ఈ చిత్రంలో ఒక ముఖ్య భూమికను నాగభూషణానికి ఇచ్చారు.

"నాకిచ్చిన వేషం ముఖ్యమా అముఖ్యమా, చిన్నదా పెద్దదా అని నేను ఎప్పుడూ ఆలోచించను. స్వీకరించిన భూమికను జాగ్రత్తగా, మనస్ఫూర్తిగా నిర్వహించడానికి ప్రయత్నిస్తాను. చిన్నా పెద్దా అనేది వేషాలకు లేదు, నటులకే" అంటాడు నాగభూషణ్.

ఉన్నదున్నట్టుగా చిత్రించడం వాస్తవికత అనిపించుకోదని నాగభూషణ్ అభిప్రాయం.

"ఆప్తులు ఎవరైనా పోయినపుడు వాస్తవ జీవితంలో దుఃఖించినట్టుగా తెరమీద ఏడిస్తే, ప్రేక్షకులు నవ్వుతారు" అంటాడు. చూచేవారికి నిజమని భ్రమకలిగించ గలిగేది సృజనాత్మకమైన కళ అనీ, వాస్తవికత అంటే అదేనని నాగభూషణం అభిప్రాయం. ★



మధుర గాయకుడు సాలూరి రాజేశ్వరరావు

"పాశ్చాత్య, భారతీయ సంగీతాలను మేళవిస్తే, వచ్చేది సంకర సంగీతమేనని బ్రిటిష్ సంగీత విద్వజ్జుడు సర్ స్టువర్ట్ విల్సన్ మొన్న మద్రాసు సంగీత సభలో అన్నారు. ఈ మాట అక్షరాలా నిజం. మన సంగీతానికీ పాశ్చాత్య సంగీతానికీ అసలు పొత్తు కుదరదు. వారివి స్ట్రెయిట్ నోట్స్. మనకి గమకాలు ఉన్నాయి" అన్నారు. మల్లీశ్వరి, మిస్సమ్మ, విప్రనారాయణ చిత్రాల సంగీత దర్శకుడు శ్రీ సాలూరి రాజేశ్వరరావు. పర్షియన్, ఈజిప్షియన్, అరబిక్ సంగీతాలకూ మన సంగీతానికి కొంత సామ్యం ఉందని ఆయన అన్నారు.

పదహారు సంవత్సరాలుగా చలన చిత్ర రంగంలో రాజేశ్వరరావు సంగీత దర్శకుడుగా ఉంటున్నారు. 1939 లో మొట్టమొదటిసారిగా ఈయన సంగీత దర్శకత్వం వహించినది శారదా రాయలసీమ ఫిలింస్ 'జయప్రద' చిత్రానికి. అనాటికి రాజేశ్వరరావు వయసు 18 సంవత్సరాలే. ఆ తర

1955వ సంవత్సరం పుట్టిన రోజున ఫిలిం పరిశ్రమ పెట్టుకొన్న ఆశలన్నీ ఆ ఏడాదిలో ఫలించాయి

క్రిందటి ఏడాది సరిగ్గా ఈ రోజులలో, పరిశ్రమ అన్ని విధాలా ఇబ్బందులు పడి అప్పుడప్పుడే కోలుకొంటున్నది 1953 లో భారీ ఎత్తున డబ్బుపోసి నిర్మించిన పెద్దచిత్రాలు దెబ్బతినడంతో పెట్టుబడిదారులంతా కొత్త చిత్రాలకు డబ్బు పెట్టడానికి జంకు చూపారు డిస్ట్రిబ్యూటర్లకూ, ఎగ్జిబిటర్లకూ పేచీలు వచ్చాయి పెద్ద నటీనటులు, రాబడి పన్ను వారికి అందకుండా, గుట్టుగా కొంత డబ్బివ్వాలని పట్టుబట్టడం, నిర్మాతలలో సైతం అభిప్రాయభేదాలు రావడంకూడా అప్పుడే జరిగింది అప్పట్లోనే శ్రీ ఎస్ కె పాటిల్ ఐ ఎం పి పి ఎ సారథ్యం స్వీకరించారు "చలనచిత్ర నిర్మాతలందరినీ, ఆకట్టుకు వచ్చి, ఒక సంఘంగా ఏర్పరచడం, ఒక తాటిమీద నడిపించడం నా లక్ష్యం అందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాను" అన్నారు శ్రీ పాటిల్ ఆయన కృషిలో జెమినీ అధినేత శ్రీ ఎస్ ఎస్ వాసన్ కుడిభుజంగా పనిచేశారు చిరకాలంగా అసాధ్యం అనిపించిన ఈ లక్ష్యం సాధ్యం అయినట్లే, బొంబాయి, కలకత్తా, మద్రాసు కేంద్రాలలోని నిర్మాతలంతా కలిసి ఇప్పుడు సుప్రీం కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ పేరిట ఒక సంఘంగా ఏర్పడడానికి అంగీకరించారు ఈ సంఘం నిర్మాతల ముక్తకంఠం దాన్ని ఫిలిం పరిశ్రమలోని వివిధ సంఘాలకూ ప్రాతినిధ్యం వహించే ఫిలిం ఫెడరేషన్‌తో చేరుస్తారు

*   *   *

ఝనక్ ఝనక్ పాయల్ బాజే, కుందన్, జాగృతి, బందిష్ ఈ సంవత్సరం బాక్సాఫీస్ చిత్రాలలో మంచి చిత్రాలు వీటిలో ఇతివృత్తం దాని చిత్రణ ఉదాత్తంగా ఉన్నాయి దానికి తోడు ఛాయా శబ్దగ్రహణాది సాంకేతిక విషయాలలో కూడా మంచి శ్రద్ధ తీసుకుని, ఉత్తమ ప్రమాణాలు అందుకోవడం జరిగింది సరే, బాక్సాఫీసుకోసం నిర్మించిన ఇన్సానియత్, శ్రీ 420, నాగిన్, ఆజాద్ వంటి చిత్రాలు విశేషంగా డబ్బు చేసుకున్నాయి వీటిలో కూడా సాంకేతికంగా ఉత్తమ స్థాయిని అందుకోవడం జరిగింది సాంకేతికంగానూ, చిత్రణలోనూ, మనం అంతర్జాతీయ ప్రమాణాలను అందుకొంటున్నామనడానికి ఇది నిదర్శనం వీటి వల్ల ఈ చిత్రాలకు డబ్బూ వచ్చింది మంచి చిత్రాల నిర్మాణానికి ఎంతో దోహదమూ జరిగింది ఎన్నడూ లేనంతగా 1955 లో కొత్త చిత్రాల నిర్మాణం ప్రారంభం అయింది

*   *   *

మోదకరమైన మరొక విషయం, చలనచిత్ర పరిశ్రమపట్ల ప్రభుత్వం ఆసక్తి చూపడం ఈ ఏడాది ఉత్తమ చలనచిత్రాలకు బహుమతులు ఇచ్చి సత్కరించింది చలనచిత్ర కళపై జరిగిన గోష్ఠిలో భారత ప్రధాని శ్రీ నెహ్రూ పాల్గొన్నారు సంగీత నాటక అకాడమీ నెలకొల్పారు పిల్లల చలనచిత్ర సంస్థ ద్వారా పిల్లల చిత్రాల నిర్మాణానికి దోహదం చేసి, దాన్ని పెంపొందిస్తున్నారు

ఇటు ప్రభుత్వంతో పాటు అటు సేవాసంస్థలు కూడా ఆసక్తి ప్రదర్శించాయి బొంబాయి రాష్ట్ర మహిళామండలి బొంబాయిలో పిల్లల చలనచిత్రోత్సవం ఏర్పాటు చేశారు కల్చరల్ ఫిలిం సొసైటీ ఢిల్లీలో చలనచిత్రోత్సవం నిర్వహించింది

కాగా, రష్యా, చైనాలలో భారతీయ చలనచిత్రోత్సవాలు, యూరప్ దేశాలలోనూ, దక్షిణ అమెరికా, మధ్య ప్రాచ్య ఆగ్నేయాసియా దేశాలలో భారతీయ



చిత్రాల ప్రదర్శన ఆయా దేశాలలో బహుళ జనాదరణ పొందాయి. అందువల్ల మన చలనచిత్రాలకు విదేశాలలో మంచి 'మార్కెట్' లభించింది. ఇండియా పాకిస్తాన్‌ల మధ్య చలనచిత్రాల రవాణాపై సాగుతున్న పేచీలు కూడా అంతమయ్యాయి.

(ఆంధ్ర పత్రిక బొంబాయి విలేఖరి)

మధుర గాయకుడు
సాలూరి రాజేశ్వరరావు

నాతి సంవత్సరమే జెమినీలో చేరారు 1950 వరకూ జెమినీలో పనిచేశారు ఆ తరువాత వాహినీవారి 'మల్లీశ్వరి'కి సమకూర్చిన సంగీతం పరాకాష్ఠ నందుకుంది

"మీకు నచ్చిన పాట లేమిటండీ" అంటే, "హిందుస్తానీ భైరవి రాగం బావుంటుంది ఆ రాగంలో ఈమధ్య కొన్ని పాటలు కట్టాను" అన్నారు నవ్వుతూ

రాజేశ్వరరావు దాదాపు 30 చిత్రాలకు సంగీత దర్శకుడుగా పనిచేశారు ఇప్పుడు వరమూవారి కిస్మత్, లలితా ఫిలింస్ చరణదాసి, మరి మూడు చిత్రాలకూ సంగీతం సమకూర్చుతున్నారు ★



ఏ ఐ పిక్చర్స్‌వారి "అంజాన్" లో వైజయంతీమాల

అంజలీవారి కొత్త చిత్రం

అంజలీ పిక్చర్స్ వారి జానపదచిత్రానికి రచన పూర్తి అయింది. దర్శకుడు యోగానంద్. కొన్ని పాటలుకూడ రికార్డు చేయించారు. ఈ నెల 25న సెట్స్‌మీదకు వెళ్ళడానికి ముహూర్తం పెట్టుకున్నారు. కవి శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి. సంగీతం ఆదినారాయణరావు. ఈ చిత్రానికి ఇంకా పేరు పెట్టలేదు.

'మహీవారి గౌరీమహాత్మ్యం'

మహీ ప్రొడక్షన్స్ పేరిట శేషాచలం చెట్టియార్ నిర్మిస్తున్న 'శ్రీ గౌరీమహాత్మ్యం', నాలుగురీళ్లు తయారైంది. ఎన్. టి. రామారావు, శ్రీరంజని, ముక్కామల, రేలంగి, బాలకృష్ణ, సూర్యకాంతం, సీత మొదలగువారు నటిస్తున్నారు. చిత్రానికి దర్శకుడు యోగానంద్. సంగీతం ఓగిరాల రామచంద్రరావు, టి. వి. రాజు.

లలితా ఫిలింస్ చరణదాసి

నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావు, డా॥ గోవిందరాజులు, ఎస్. వి. రంగారావు, రేలంగి, రమణారెడ్డి, సావిత్రి, జానకి, సూర్యకాంతం మొదలైన తారాసందోహంతో లలితా ఫిలింస్ నిర్మిస్తున్న 'చరణదాసి' షూటింగు రెండు వంతులు పూర్తికావచ్చింది. సంగీతం రాజేశ్వరరావు; దర్శకుడు తాతినేని.



ఎ. వి. ఎమ్. వారి హిందీచిత్రం "చోరీ చోరీ"లో నర్గీస్, రాజ్ కపూర్.

గత సంవత్సరం తారాబలం

గత సంవత్సరంలో రేలంగి వెంకటరామయ్య 11 చిత్రాలు, ఎ. నాగేశ్వరరావు 7, ఎన్.టి. రామారావు 7, జగ్గయ్య 6, జానకి 5, అంజలి 5, జమున 5, సావిత్రి 6, రంగారావు 6 చిత్రాలలో నటించారు.

దర్శకులలో పి. పుల్లయ్య గారు 3 చిత్రాలకూ యోగానంద్ గారు 2 చిత్రాలకూ దర్శకత్వం వహించారు.

గోకుల్ పిక్చర్స్

ఆంధ్ర మద్రాసురాష్ట్రాల సరిహద్దు గ్రామం 'తడ' ఈ నెల 4, 5 తేదీలలో సంరంభంతో నిండిపోయింది. గోకుల్ పిక్చర్స్ బృందం ఆరెండురోజులూ అక్కడకు వెళ్ళి, తమచిత్రం 'కనకతార' ఔట్ డోర్ దృశ్యాలు కొన్ని చిత్రించారు. వీటిలో ఎస్. వరలక్ష్మి, మాస్టర్ వర్మ మాత్రం ఉన్నారు.

మరికొన్ని ఔట్ డోర్ దృశ్యాలకై త్వరలో నే మహాబలిపురం వెళ్లామని దర్శకుడు రజనీకాంత్ చెప్పారు.

రాజ్యం పిక్చర్స్ హరిశ్చంద్ర

ఎస్. వి రంగారావు, లక్ష్మి రాజ్యం హరిశ్చంద్ర, చంద్రమతులుగా, రాజ్యం పిక్చర్స్ నిర్మిస్తున్న పౌరాణిక చిత్రం హరిశ్చంద్ర జంపన దర్శకత్వాన చురుకుగా తయారవుతోంది. ఇందులో ఎస్. వి రంగారావు విశ్వామిత్రుడి భూమిక నిర్వహిస్తున్నారు. నక్షత్రకుడు రేలంగి. ఈచిత్రాన్ని మార్చిలో విడుదలచేయాలనుకుంటున్నారు. ఇప్పటికే మూడింట రెండు వంతులు పూర్తికావచ్చింది.



రాష్ట్రపతి ప్రశంసా పత్రం అందుకున్న 'తోడు దొంగలు' దర్శకుడు శ్రీ యోగానంద్.

వనితాలోకం

మకరసంక్రాంతి

ఇల్లిందల సరస్వతీదేవి

సంక్రాంతి పండుగ ఇంకా నెలరు వస్తుందనగా ప్రాగుదయంలో ఎదుటి మనిషి కంటికి సరిగా కనుపించని వేళ హరిదాసు భజనకీర్తనలు పాడి, అందరిని మేలుకొలిపి వెళ్లుతాడు కలాపిజల్లిన వాకిళ్లలో కళానైపుణ్యము ఉట్టిపడేటట్లుగా స్త్రీగణము చిత్రవిచిత్రాలయిన రంగవల్లులు పోటీపడి వేస్తారు. గోమయముతో చేసిన గొబ్బిళ్ళకు పసుపు కుంకుమలతో బొట్లు పెట్టి, గుమ్మడిపూలు గుచ్చి, ముగ్గులమధ్యగా అక్కడక్కడ వాటిని పెట్టి పూజిస్తారు తెలుగుకన్యలు.

సంక్రాంతి పండుగ కాలానికి ఇంటింటా ధాన్యపురాసులతో, ప్రతి గుమ్మానికీ బంతిపూల తోరణాలతో గ్రామాలన్నీ కలకలలాడుతూ ఉంటాయి. ప్రతి గృహిణీ అల్లుడి రాకకు ఎదురుచూస్తూ, కుమార్తె సురుచిర మందహాసాలను అవలోకిస్తూ, పండుగ కట్నాలను కానుకలను ఊహించుకుంటూ భోగిపండుగకు ఎదురుచూస్తుంది.

భోగినాడు ఆబాల గోపాలము తలంట్లు పోసుకోవాలి ఆనాడు సాయంత్రము పిల్లలు మంచి వస్త్రాలు ధరించి, భోగిపళ్లతో సెనగలతో పైసలూ కలిపి పోసుకొని, పీడను వదలించుకోవాలి. పండుగనాడు గృహస్థులు పితృదేవతల సంతృప్తికొరకు కర్మకాండ జరపాలి; దానాలు చెయ్యాలి. పండుగ వెళ్లగానే ముత్తైదువలందరు అయిదవతనము కొరకు సావిత్రీగౌరీదేవి వ్రతము నిష్ఠతో తొమ్మిదిరోజులు చేసుకోవాలి. పుట్టింటి ఆడబడుచులందరు బొమ్మలకొలువు అమర్చి పేరంటాళ్ళను పిలిచి తాంబూలాలు యివ్వాలి.

ఇదంతా సంక్రాంతి పండుగ సందడి.

హిందువుల పండుగలలో కొన్ని దైవాంశగల మహాపురుషుల జన్మదినాలకు సంబంధించినవి. కొన్ని ఋతువులకు సంబంధించినవి—కొన్ని మత సంబంధమైనవి. సంక్రాంతి ఋతు సంబంధమైన పర్వము-పండుగ.

ఈ సంక్రాంతి పండుగ ప్రాముఖ్యము జ్యోతిశ్శాస్త్ర దృష్ట్యా చూస్తే మరి కొన్ని విశేషాలూ వింతలూ అవగతమవుతాయి.

పన్నెండు రాసులుగా విభజింపబడిన ఖగోళములో సూర్యుడు నెల కొకరాసి చొప్పున ప్రవేశించినట్లు కనబడతాడు. సూర్యుడు ఒక్కొక్క రాసిలో ప్రవేశించినప్పుడు రాసి సంక్రమణము జరిగినదన్నమాట. మకర రాసిలో సూర్యుడు ప్రవేశించినప్పుడు మకర సంక్రాంతీ, కర్కాటకరాసిలో ప్రవేశించినప్పుడు కర్కాటక సంక్రాంతీ-ఇదే విధముగా మేష సంక్రాంతి, తులా సంక్రాంతి మొదలైనవి కాని వీటన్నిటిలో మకర సంక్రాంతికే ప్రాముఖ్యము ఇచ్చి, ఇంత గొప్ప పండుగగా భావిస్తున్నామంటే ఏదో విశేషము ఉండితీరాలి.

తిలకుగారి సిద్ధాంతము ననుసరించి ఆర్యులు బహుపూర్వకాలములో, ఉత్తర ధ్రువప్రాంతములో ఉండేవారట. ఆ ప్రాంతాలకు పగలు రాత్రి మనకు ఇప్పుడు ఉన్నట్లుగా పన్నెండు పన్నెండు గంటల వ్యత్యాసములో కలిగేవికావు వారికి ఆరు నెలల కాలము పగలూ (సూర్యుడు కనుపించే కాలము) ఆరు నెలలకాలము రాత్రి (దీర్ఘ రాత్రి, సూర్యోదయ కాలానికి మేషరాసి, సూర్యాస్తమయ కాలానికి తులారాసి దృశ్యమానమవుతూ ఉండేది ఉత్తర ప్రాంతములో సూర్యుడు సంచరించే కాలము కనుక ఆ ఆరునెలల పగటికాలాన్ని ఉత్తరాయణ కాలముగా గుర్తించారు. సూర్యుడు అదృశ్యుడయిన ఆరునెలల కాలాన్ని దక్షిణాయన

★ మకర సంక్రాంతి

కాలమని వ్యవహరించేవారు. నిత్యకృత్యాలు, ప్రపంచ వ్యవహారాలు ఉత్తరాయణ కాలములోనే జరుపుకొనేవారు. ఎటువంటి అత్యవసరములయిన కార్యములు వచ్చినా ఉత్తరాయణకాలము వరకూ వాయిదా వేసుకొనేవారు. దక్షిణాయన కాలములో మరణించిన వారికి ప్రేత కర్మలుగాని, శ్రాద్ధకర్మలుగాని నెరవేర్చటానికి ఆ చీకటిలో ఆ ప్రాంతీయులకు దుస్సాధ్యముగా ఉండేది. కనుక 'ఉత్తరాయణము పుణ్యకాలము శ్వేతగతి; దక్షిణాయనము ప్రేత మార్గము-కృష్ణగతి' అని భావించటానికి కారణమైనది. ఈ దృష్టితోనే భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలము వచ్చేవరకూ అంపశయ్యమీదనే ఉండి తన మరణాన్ని నిలుపుచేసుకున్నాడు. స్వచ్ఛంద మరణమును వరముగా బడసిన మహావీరుడు కనుక ఆయనకు అది సాధ్యమయినది.

పైన నిర్ణయించినట్టుగా మేష సంక్రాంతి ఉత్తరాయణ ప్రవేశాన్ని, తులా సంక్రాంతి దక్షిణాయన ప్రవేశాన్ని తెలుపాలి కదా!

కాని-చాలాకాలము నుండి మకర సంక్రాంతి ఉత్తరాయణ ప్రారంభముగాను, కర్కాటక సంక్రాంతి దక్షిణాయన ప్రారంభముగాను గ్రహిస్తున్నాము. అనుభవానికి కొంతవరకు ఇది సరిపోతూ ఉన్నది.

ప్రతిదినమూ ఉషఃకాలములో ఉదయిస్తున్న రవి ప్రభువును సందర్శించే భాగ్యము కలిగితే, సూర్యోదయ స్థానము ఒక్కచోటనే సంవత్సరము పొడుగునా స్థిరముగా కనిపించదు. 21వ మార్చినాడు, 23వ సెప్టెంబరు తేదీన సరిగా తూర్పు దిక్కున సూర్యుడు ఉదయిస్తున్నట్టు చూస్తాము. ఈ రెండు దినాలు (21వ మార్చి, 23వ సెప్టెంబరు) పగలూ రాత్రీ సమానముగా పన్నెండు గంటలకాలము పగలు, పన్నెండు గంటల కాలము రాత్రీ ఉంటాయి.

ఆ తరువాత 21 వ మార్చినుంచీ పగటి కాలము పెరుగుతుంది. రాత్రికాలము తగ్గిపోతుంది. సూర్యబింబము ఉత్తరము వైపుగా ఉదయించినట్లు కనబడుతుంది. ఈ ప్రకారముగా జూను 22 వరకు రాను రాను ఉత్తరదిశవైపు మొగ్గచూపుతూ 23 డిగ్రీలవరకు దూరమువేర్పడుతుంది. ఆదినము నుండి సూర్యుడు దక్షిణాభిముఖుడై ఉదయిస్తూ ఉంటాడు. 23 సెప్టెంబరునాడు నికరముగా తూర్పుదిక్కున ఉదయించి, తిరిగి దక్షిణకక్ష్యలో జొరబడి, రానురాను 22వ డిసెంబరునాటివరకు 23 డిగ్రీలవరకు దూరానికి చొచ్చుకొనిపోతాడు. ఆదినమునుండి తిరిగి ఉత్తరాభిముఖుడై 21 మార్చినాటికి సరిగా తూర్పుదిశలో కనిపిస్తాడు. ఈవిధముగా దృగ్గోచరమైన దాఖలాలో 22 వ డిసెంబరు మనకు ఉత్తరాయణప్రవేశమూ, 22 వ జూను దక్షిణాయన ప్రవేశముగా ఉండాలి.

కాని మన పంచాంగాలప్రకారము 14 వ జనవరి 1956 నాడు మకరసంక్రాంతీ (ఉత్తరాయణ ప్రవేశము), 15 వ జులై 1956 నాడు కర్కాటకసంక్రాంతీ (దక్షిణాయన ప్రవేశము) జరుగుతుంది. ఈ విధముగా దృక్సిద్ధమైన ఉత్తరాయణ ప్రవేశానికీ (సంక్రాంతులకు), పంచాంగసిద్ధ సంక్రాంతికీ 23 దినాల భేదము ఏర్పడుతున్నది. ఈ చర్చ అయనాంశకు చెందినదీ, జ్యోతిష శాస్త్రజ్ఞులకు సంబంధించినదీను. మనము పంచాంగాలు సూచించినట్టుగా 14 వ జనవరినాడే పితృసంబంధమైన కర్మలన్నీ చేస్తున్నాము. మాససంక్రాంతులను ఆ దామాషాలోనే లెక్కిస్తున్నాము.

ఈ వివాదాలన్నీ అందరికీ తెలిసేవికావు. కాని శీతాకాలము పగటివేళ ప్రొద్దు విలకదనీ, ఎండాకాలము రాత్రివేళ నిద్రకుచాలదనీ అందరి అనుభవములోని విషయాలు.

ఈచర్చల ప్రసక్తిలేకుండానే తరతరాలుగా హిందూగృహిణి కూతుళ్ళకూ అల్లుళ్ళకూ కొత్తబట్టలు ధరింపజేసి ఆశీర్వదిస్తున్నది. చిన్నపిల్లలకు భోగిపళ్లుపోసి పీడను వదలించుకొంటున్నది. ఈ పర్వదినాలలో పండుగచేసుకుని ఆనందిస్తున్నది. ఈ ఆచారములో అర్థము ఎంతఉన్నదో-ఎంత జారిపోయినదోనని ఆలోచించే అవకాశము ఆమెకు లేదు. ఆచారానికి మోసము జరుగకుండా చూడటమే ఆమె పని. ★

'ఎందుకేనా మంచిదని..'

కాస్త దూరదృష్టిగల ఒక యువకుడు, ఒక దంతవైద్యుడి కుమార్తెను ప్రేమించాడు. పెళ్లిచేసుకుంటానని చెప్పాడు.

"మన పెళ్ళివిషయం మా నాన్నగారితో చెప్పావా ?" అని అడిగింది ఆ అమ్మాయి.

"ఏదీ. పన్నొకటి తీయించుకోవా లనుకుంటున్నాను. అదేదో అయిపోయాకనే ఈ సంగతి చెబుదా మనుకుంటున్నాను" అన్నాడు ప్రియుడు.

ప్రతిభాశాలిని శ్రీమతి విజయలక్ష్మి



విగ్రహానికి తగినట్టు దుస్తులు ధరించడం, దానికి నప్పేవిధంగా అలంకరించుకోవడం ఒక కళ. మెరిసే నలగకుండా, మాపు కనబడకుండా మల్లె పువ్వల్లె స్వచ్ఛంగా ఉండడం కొందరికి చాలా ఇష్టం. అటువంటివారిని చూడడం అందరికీ ఇష్టం. ఆనందకరం. 1955లో ఈ వేషధారణలో శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ప్రపంచం మొత్తం మీద అగ్రతాంబూలం అందుకున్నారు.

న్యూయార్క్‌లోని వేషధారణ విధాన పరిషత్‌కు చెందిన సాంస్కృతిక సంఘం, 1955 లో మంచి దుస్తులు ధరించిన స్త్రీలలో శ్రీమతి విజయలక్ష్మి, హాలీవుడ్ తార గ్రేస్ కెల్లి, మిసెస్ విలియం పేలీలను ప్రథమ శ్రేణిలో పేర్కొన్నారు. ఈ బృందం ఓటింగ్ ద్వారా ఈ ఫలితాలు తేల్చి ఒక జాబితా ప్రకటించారు.

ఇంగ్లాండ్ యువరాణి మార్గరెట్‌కు, డచెస్ ఆఫ్ విండ్సర్‌కూ తృతీయ స్థానం లభించింది. ఎక్కువ ఓట్లు వచ్చిన వారిలో అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ సతి, ఫ్రాన్సు మాజీ ప్రధాని మాండెజ్ ఫ్రాన్సు సతి ముఖ్యులు.

ఈ ఫలితాలసంగతి విజయలక్ష్మికి చెబితే మందహాసంచేసి ఊరుకుంటారు. అక్కడితో ఊరుకోక, మీకు ఏ రంగు చీరలు ఎక్కువ ఇష్టం? ఏ చీరకి ఏ రకం జోళ్లు బాగా నప్పుతాయి? అంటూ ప్రశ్నలు అడగడం మొదలు పెడితే విజయలక్ష్మి, 'ఎందుకొచ్చిన గొడవ?' అని విసుక్కోవచ్చు.

ఒకసారి అచ్చరాలా ఇలాగే జరిగింది. ఐక్యరాజ్యసమితికి ఆమె అధ్యక్షురాలుగా ఎన్నిక అయింది. ఆ స్థానం అలంకరించిన తొలి మహిళ ఆమే. మొదటిరోజున ఆమె సమితి ప్రాంగణంలో కాలు పెట్టేసరికి పత్రికల విలేఖరులంతా చుట్టుముట్టారు.

రిపోర్టర్ గావచ్చిన ఒక యువతి, విజయలక్ష్మికి ఏ రంగుచీరలు ఇష్టమో చెప్పాలని పదేపదే అడగడం మొదలుపెట్టింది. ఇంచుమించు అలాంటి ప్రశ్నలే మరికొందరు అడిగారు.

శ్రీమతి విజయలక్ష్మికి కోపంవచ్చింది.

"క్రిందటి సంవత్సరం సమితి అధ్యక్షుడుగా ఎన్నిక అయిన పెద్దమనిషి రాగాకీ, మీరు ఆయనకి ఇష్టమయిన 'టై' గురించి అడిగారా?" అని ఎదురుప్రశ్న వేసింది.

అంతటితో విలేఖరులు ఆ ప్రశ్నలు విరమించుకున్నారు.

"నేను ఒక దేశం ప్రతినిధిగా వచ్చినప్పుడు నన్ను, నా ఉద్యోగానికి సంబంధించిన ప్రశ్నలడగక నేను స్త్రీని అన్న విషయానికి ఎందుకు ప్రాధాన్యం ఇస్తారు? అంటుంది విజయలక్ష్మి.

రాజకీయ రంగంలో ఒక స్త్రీ ఒక ప్రముఖ స్థానానికి వచ్చినప్పుడు, ఆమె 'స్త్రీ' అన్న భావంతో ఎందుకు చూడాలి? ఆపదవినిబట్టే ఆలోచించి మాట్లాడరాదా? అని ఆమె వాదం."

తాను వెళ్లిన అనేక దేశాలలో ఇదే ధోరణి కనబడిందని, ఒక్క రష్యాలో మాత్రం తనను భారత రాయబారిణిగా నే గుర్తించి, పరిగణించి, రాయబారితో మాట్లాడే పద్ధతిలోనే మాట్లాడి గౌరవించారనీ ఆమె ఆరోజున వివరించారు. రష్యాకు భారత రాయబారిణిగా వెళ్ళిన మొదటి మహిళ శ్రీమతి విజయలక్ష్మి.

పండిట్ మోతీలాల్ నెహ్రూ గర్భవాసానపుట్టిన విజయలక్ష్మి చిన్నవయసులోనే రాజకీయ రంగంలో ప్రవేశించింది. 21-వ ఏట ఉత్తరప్రదేశ్ శాసనసభ సభ్యురాలుగా ఎన్నిక అయింది. 1937 లో ఆ రాష్ట్రానికి ఆరోగ్యశాఖ మంత్రిణిగా పని చేసింది. 1940-42 లో అఖిలభారత మహిళా సభ అధ్యక్షురాలైంది. స్వాతంత్ర్యోద్యమంలో పాలొని మూడుసార్లు జైలుకు వెళ్లింది. మనదేశంలో మంత్రి పదవి నిర్వ

రెండు మహా సమరాల యోధురాలు

1941 వ సంవత్సరం అక్టోబరు నెల. దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. చెన్నపట్నంలో ఆంధ్ర మహిళా సభ, విక్టోరియా పబ్లిక్ హాలులో నృత్య నాటక వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు. ఒక రోజున పొద్దుట మబ్బు వేసింది. మధ్యాహ్నానికి వర్షం ప్రారంభించింది. ఆంధ్రమహిళా సభ కార్యాలయం అప్పుడు మైలాపూర్ లజ్ కార్నర్‌లో ఉన్న ఒక పాత భవనంలో ఉండేది. పిల్లలకి అక్కడే వేషాలు వేసి అలంకరించేశారు. కారులో ఎక్కించి, వి. పి హాలుకి పంపిస్తున్నారు. ఆ సమయంలో ఒకామె వానధోరణి చూసి కొంచెం దిగాలు మొహం పెట్టింది. "వాన తగ్గేటట్టు లేదు. జనం వస్తారో రారో" అంది సాలోచనగా ఆకాశం వంక చూస్తూ, కాడావుడిగా ఏర్పాటుచేస్తూ, అటు వెళుతున్న ఒక మహిళ ఈ స్వగతంవిని చటుక్కున ఆగింది. పసుపు పచ్చని విగ్రహం. ముతక చేనేతచీర కట్టుకుందామె. జుట్టు వదులుముడి వేసుకుంది. నుదుట కొట్టొచ్చినట్టు పెద్ద కుంకుమబొట్టు అంతకన్నా ఉజ్వలంగా వెలిగే ఆమె కళ్లు. ఆ కళ్లలో మరేం పరవాలేదని ధైర్యం, నెగ్గకేంచేస్తాం అన్న ధీమా.

"నీకేం మతిపోయిందా? వాన తగ్గకేం చేస్తుంది? ... తెలుగుపిల్లల ఆట పాటలు చూడటానికి జనం రాకేం చేస్తారు?...

ప్రతిభాశాలిని శ్రీమతి విజయలక్ష్మి

హించిన మొట్టమొదటి మహిళ ఈమే. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత రెండేళ్లు రష్యాలో భారత రాయబారిగాను, మరో రెండేళ్లు అమెరికాలో రాయబారిగాను పని చేశారు. ఈ పదవులు నిర్వహించిన మొదటి మహిళ కూడా ఈమే. ఆ తరువాత, ఐక్య రాజ్యసమితి అధ్యక్షస్థానంకూడా అలంకరించారు. ఒక మహిళ ఈ పదవికి రావడానికిఅదే తొలిసారి

శ్రీమతి విజయలక్ష్మి ప్రస్తుతం బ్రిటన్‌లో భారత హైకమిషనర్ గా ఉంటున్నారు.

★



శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

త్వరగా తేకులు పనిచూడు" అని ధాటీగా పురమాయించి, ముందుపని చూడబోయిందావిడ. ఆరోజున వానతగ్గింది. విక్టోరియా పబ్లిక్ హాలు ప్రేక్షకులతో క్రిక్కిరిసింది.

ఈ రెండూ జరుగుతాయని అంతధాటీగా అచంచల విశ్వాసంతో చెప్పిన మహిళ దుర్గాబాయమ్మగారు.

దుర్గాబాయమ్మగారి కార్యదక్షతకు కార్యశూరత్వానికీ, ప్రత్యక్ష నిదర్శనం ఈనాడు మద్రాసులో వెలసినఆంధ్రమహిళా సభ, ఆ సంస్థ శాఖోపశాఖలూను.

సంకల్పబలముంటే సాధ్యంకానిదిలేదని మనసారానమ్మి, మనసారా ప్రయత్నించి, అతొవ్యలను సాధించిన మహిళ ఆమె.

30 వ ఏట ఎం. ఏ. పట్టా పుచ్చుకుని, న్యాయశాస్త్రం చదవడం ప్రారంభించింది. పరీక్షలు దగ్గర పడుతున్నాయి మరోకవంక, బాల్యదశలో ఉన్న ఆంధ్ర మహిళా సభ పనులు.

"ఇన్ని వ్యవహారాలు చూస్తూ, మీరు పరీక్షకేం చదువుతారండీ? వాళ్ళు ఆ బీఏనమ్మకంతేదు" అన్నారు. ఆమె సహోధ్యాయులలో ఒకరు.

దుర్గాబాయమ్మగారు మందహాసం చేసింది. 'చూస్తారుగా' అంది ధీమాగా.

పరీక్షాఫలితాలు ప్రకటించబడ్డ రోజున ఆమెపట్టుదలకు, నిర్విరామ కృషికి లభించిన సత్ఫలితం సహాధ్యాయి చూసి విస్తుపోయారు.

20 వ ఏటనే జైలుకి...

గుమ్మిడిదల దుర్గాబాయమ్మకు 18 వ ఏటనే గాంధీజీ పిలుపు వినబడింది. అంత చిన్న వయసులో ఆమె కాకినాడలో ఆడపిల్లలకు హిందీ పాఠశాల పెట్టి నడపింది. కొంతకాలానికి చెన్నపట్నం రావడం జరిగింది. స్వాతంత్ర్యోద్యమం భారీ ఎత్తున సాగుతున్న రోజులు. కాంగ్రెసు పతాకం పట్టుకుని దుర్గాబాయ్ రాజకీయ రంగంలో ప్రవేశించింది. ఉప్పు సత్యాగ్రహం చేసి, జైలుకు వెళ్ళిన రోజున, ఈ ఆంధ్ర మహిళ వయస్సు 20 ఏళ్ళు! చైతన్యస్ఫూర్తితో మొక్కవోని శక్తితో, అన్నిటికీ ముందడుగు వేసిన దుర్గాబాయ్ గాంధీజీ అభిమాన పాత్రురాలయింది. అప్పట్లోనే 'ఆంధ్ర జోన్‌ఆఫ్‌ఆర్క్' అనేవారంతా.

నిర్విరామ కృషి

తలపెట్టిన మహత్కార్యాలు సాధించాలంటే, విద్యాభ్యాసం చాలా ముఖ్యమని గ్రహించి, ఆంగ్లం నేర్చుకోవడం ప్రారంభించింది. కొద్దికాలంలో బెనారస్ మెట్రిక్ పూర్తి చేసింది. ఆ తరువాత, వాల్తేరులోనూ, కాశీలోనూ చదివి 30-వ ఏట ఎం. ఏ. పట్టా అందుకుంది. అక్కడితో తృప్తి చెందక న్యాయశాస్త్రం చదివి, బి ఎల్. పట్టా పుచ్చుకుని కొంతకాలం చెన్నపట్నంలో ప్రాక్టీసు చేసింది

స్వాతంత్ర్యసిద్ధి అనంతరం పార్లమెంటు సభ్యురాలుగా ఎన్నికైంది. ఇన్నాళ్లు ఒకవంక, విద్యాభ్యాసం, రాజకీయ కార్యకలాపాలూ సాగించడంతోపాటు, ఆంధ్ర మహిళా వికాసానికి నిర్విరామంగా కృషి చేస్తునే ఉంది. చెన్నపురి ఆంధ్ర మహాసభ మహిళల శాఖగా వెలసిన సభను, ఇల్లాళ్లందరూ వచ్చి వెళ్లడానికి వీలుగా ఉండే చోట నెలకొల్పింది.

ఇల్లు కదలి వెళ్ళడానికి జంకే, సిగ్గుపడే, బిడియపడే, భయపడే స్త్రీలందరినీ సముదాయించి, బుజ్జగించి, నచ్చచెప్పి, సభకు రప్పించి, నలుగురు కలుసుకోవడానికి సావకాశం కలిగించింది. అప్పట్లో చాలామంది పేరంటానికివెళ్ళే పద్ధతిలో ఆంధ్ర మహిళా సభకు వెళ్ళేవారు.

ఒక భావకవికి సన్మానం జరుగుతోంది. ఒక వక్త లేచి ఇలా ప్రసంగిస్తున్నాడు:

"ఎంత చిన్న భావాన్నైనా అతి రమ్యంగా సాగదీస్తారు మన కవిగారు. మాటలను చెక్కడంలో, చిత్రికపట్టడంలో నగిషీ పెట్టడంలో ఈయన కీయనే సాటి. మాటలు వీరి చేతిలో ఎటుపడితే అటువంగు తాయి. సమాసాలను సందు లేకుండా బిగించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. ప్రేయసిపై వీరు వ్రాసిన గీతాలు సమ్మెటపోటుల్లాగా మన హృదయాలను బద్దలు చేస్తాయి. హృదంతరాలను దొలుచుకుపోతాయి..."

సభికుల్లో ఒకరు: "శేష్! కవిత్వం వ్రాయడానికి ముందు వారు వడ్రంగం బాగా నేర్చుకుని ఉంటారు."

నిరంతర నినాదం

ప్రతి గోష్ఠిలో, ప్రతి సభలో దుర్గాబాయమ్మగారు, మహిళాజనవికాసానికి మహిళలే చేయవలసిన కృషిని వారికి నచ్చచెప్పేది. మరొకవంక, ఈ సభ నిలచి, వర్ధిల్లడానికి, సహాయం చేయవలసిన ఆవశ్యకతను పదే పదే చెప్పేది. అప్పట్లో ఆవిడ నిత్యం చేసే నినాదం ఒకటే. "సభకు స్వంత భవనం కావాలి."

నినాదాలు చేసి, చప్పట్లు కొట్టి ఊరుకోవడం ఆవిడ లక్షణం కాదు. కలవారి ఇళ్లకు వెళ్లి, వారి సహాయం కోరేది. కోరి సాధించేది. అచిరకాలంలో మైలాపూరులోనే ఆంధ్ర మహిళాసభ భవనాలు లేచాయి. అక్కడ. అక్కడ విద్యాబోధనతో పాటు, ఇతర వృత్తి విద్యలు, లలితకళలు నేర్పడానికి ఏర్పాట్లు జరిగాయి. ఆంధ్ర మహిళా వికాసానికి, కృషి చేసే పత్రిక, దానికై ఒక ముద్రణాలయం వెలశాయి. దరిమిలా, ఒక కొత్తశాఖ—ప్రసూతికేంద్రం నెలకొల్పారు. ఉద్యోగాలకు వెళ్ళే మధ్యతరగతి గృహిణుల పిల్లలకు, ప్రొద్దుటినుంచి సాయంత్రంవరకూ సంరక్షణచేయడానికి 'నాగేశ్వరశిశువిహార్' ఇటీవలే, నెలకొల్పబడింది.

1952 లో ఆమె కేంద్ర ప్రణాళికా సంఘంలో సభ్యత్వం స్వీకరించింది. ఆ రోజులలో ఆమె కేవలం పథకరచనా వ్యాసంగంలోనే ఉండేది. క్రింది స్థాయి నుండి, చిన్న చిన్న సేవాసంఘాల ద్వారా అందరి సహకారం ఆకట్టుకువచ్చి ప్రయత్నించేస్తే తప్ప అభివృద్ధి అనేది సాధ్యం కాదని గుర్తించింది. దరిమిలా, ఆమె అటువంటి బాధ్యతనే,—కేంద్రసాంఘిక సంక్షేమ అధ్యక్షురాలుగా స్వీకరించి, అభివృద్ధికి వేసినపథకాలు ఆచరణలోకి వచ్చేటట్లు చూస్తున్నది.

రెండు సమరాలు

దేశానికి రాజకీయ స్వాతంత్ర్య సాధనకై ఒకనాడు శాంతియుతంగా మహాసమరం సాగింది. స్వాతంత్ర్యం సిద్ధించాక, ఈనాడు ఆర్థిక స్వాతంత్ర్య సమరం సాగుతున్నది. ఈ సమరం దారిద్ర్యంపైన అవిద్యపైన నిరుద్యోగం పైన.

ఆనాటి మహా సమరంలో పాల్గొని జేవీజోన్ అనిపించుకున్న దుర్గాబాయ్ ఈనాడు ఈ సమరంలో కూడా పాల్గొంటున్నది.

డా॥ పట్టాభి సీతారామయ్య మొన్న నిక్కడ మాట్లాడుతూ 'గుర్రంలేని ఝాన్సీ లక్ష్మి దుర్గాబాయ్' అని ఆమె సేవానిరతికి జోహార్లర్పించారు. ★



కాలర్ చోళీ

కాలర్ చోళీ

అలంకరణలో జరీ అంచు పట్టుచీరకి, నల్లంచు తెల్లనూలు చీర ఏమాత్రం తీసిపోదు. అమాటకొస్తే, ఆడంబరంగా కనిపించే, ఆచీరకన్న, నిరాడంబరమైన ఈచీరే ఒక వానిఎక్కువబాగుంటుందనిపిస్తుంది. ఇప్పుడు, కాలేజీలలో చదువుకునే ఆడపిల్లలలో చాలమంది నిరాడంబరమైనవస్త్రధారణవైపే ఎక్కువ మొగ్గుతున్నారు. మెత్తటి నూలుచీర, దానికి బాగా నప్పే రంగులో మంచిచోళీ, ఉంటే గింటే మెడలో ఒంటిపేట గొలుసు చిటన్నిటికీ తగ్గట్టు గా, కాలికి అకుజోడు ఇదీ ఫ్యాషన్. రంగు చీరల్లోకూడా కొట్టొచ్చినట్టు, కళ్లు చెదరేటట్టు కనబడేవి. ఆట్టేమంది వాడరు. ఈ వేషధారణ నిరాడంబరమైనా చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇలా అలంకరించుకునేవారిలో, వెండి తెర తార 'నర్గీస్‌ని' ఒకర్తె ఉమన్‌ఇన్‌వైట్ అంటారు నర్గీస్ని. ఎప్పుడు నిరాడంబరమైన తెల్లటి దుస్తులు ధరిస్తుంది. ఈ రకం అలంకరణలో ముఖ్యాకర్షణ చోళీఫ్యాషన్ ఈ చోళీకి కాలర్ ఉంటుంది. చేతులు మోచేతులవరకూ దిగుతాయి చోళీకి కాలర్ ఉండడం, సన్నగా నాజూకుగా ఉండేవారికి చాలా బాగా నప్పుతుంది. మెడ సన్నతనం, సౌకుమార్యం బాగా శోభిస్తాయి.

పక్క పుటలోఉన్న చోళీ ఇదే ఫ్యాషన్‌లో తయారైంది. ఇళ్లలో కుట్టుమిషన్ ఉన్నవారు, ఈ పద్ధతిలో గుడ్డ కత్తిరించి కుట్టుకోవచ్చు. కాలర్ దృఢంగా నిలబడడానికి తగినంతగా దళసరి గుడ్డ ఒకటి పొరల మధ్య వేసి కుట్టుకోవాలి ఈ మధ్య పొరని ఎరినపుడు రంగువిషయంలో జాగ్రత్త తీసుకోవాలి. నల్ల చుక్కలున్న తెల్లగుడ్డతో చోళీ కుడుతూ కాలర్ మధ్య ఎర్రటి గుడ్డ వేస్తే అందవికారంగా ఉంటుంది. ఈ విషయంలో శ్రద్ధ ముఖ్యం. తరువాత, చేతులకికూడా ఇలాగేచేస్తే బాగుంటుంది. మోచేతుల దగ్గర్నించి, మూడు, నాలుగు అంగుళాల మేరకు ఇలాగే పొరలు వేసి, దళసరిగా కుట్టుకోవచ్చు.

ఐదారు నెలలనించి, మార్కెట్ లో ఎక్కడ చూసినా అక్కడ కనబడుతున్న చేనేత గుడ్డలు కూడా ఈ రకం చోళీలకు బావుంటాయి చోళీ ఆదికే సరిపడేటట్టు తయారుచేసి అమ్ముతున్నారు. ఇటీవలగా చాలామంది వీటితో చోళీలు కుట్టించుకుంటున్నారు. ★

ఒకనాడు ప్రపంచంలో సగంమందికి

కుట్టుపని పుట్టుపూర్వోత్తరాలు

కలవారిఇళ్లి కళగా లేనివారిఇళ్ల ఉపాధిగా వర్థిల్లుతున్న కుట్టుపని చరిత్రను సింహావలోకనం చేస్తే ఏడు వేల సంవత్సరాలనాడు ఎముకలు, దంతం, ముళ్లు, కర్రలు చక్కగా చెక్కి సూదిగా మొనదీర్చి, వంటిని గుడ్డ చుట్ట పెట్టుకుని పట్టుకు కూర్చోనక్కర లేకుండా వాటంతట అవి నిలబడేటట్టు చేయాలని తాపత్రయపడే ఆటవిక వనితలు గోచరిస్తారు. ఆనాటినుండి కుట్టుపని గురించిన ఊహలు పెంపొందాయి. ఊహనుబట్టి ఉపాయాలూ తోచాయి సూది అను ఉపకరణం ఏనాడో ఉదయించింది. మహాభారతంలో, 'సూది' మొన మోపినంత భూమి కూడా ఇవ్వను పొమ్మంటాడు దుర్యోధనుడు. ఆనాటికే ఇది మనదేశంలో బహుళవ్యాప్తం అయిపోయిందన్నమాట.

బాబిలన్ ప్రజలు వెండి, బంగారం, రాగి, కంచువంటి లోహాలతోకూడా సూదులు తయారుచేసినట్లు చరిత్రలో కనబడుతుంది.

8400 రకాల సూదులు

ఈనాడు సూదులు ఉక్కుతో తయారవుతున్నాయి కుట్టవలసిన వస్త్రాలనుబట్టి రకరకాల సూదులు ఉపయోగిస్తారు. ఈనాడు జేబురుమాళ్ళనుండి ఫ్యాక్టరీ మరచక్రాలు తిప్పే పటకాలవరకూ, వాడే సూదులలో దాదాపు 8400 రకాలు ఉన్నాయి

ప్రపంచంలో సగంమందికి...

నేతలో విప్లవం వచ్చింది. వస్త్రాలు భారీఎత్తున ఉత్పత్తికాసాగాయి. దానితో వాటిని దుస్తులుగా కుట్టడానికి గిరాకీ పెరిగింది. దాంతోకుట్టుపనికికూడా యంత్రాలు కనిపెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

ఈ యాంత్రిక విప్లవం సంభవించే నాటికి ప్రపంచ జనాభాలో సగంమందికి కుట్టుపనే జీవనోపాధి అని ఒక చరిత్రకారుడు అంచనా వేశాడు.

1790లో థామస్ సెయింట్ అనే ఆంగ్లేయుడు ఒక కుట్టుయంత్రం కనిపెట్టి దానికి పేటెంటు తీసుకున్నాడు కాని, అదేమంత ప్రయోజనకరం కాలేదు ఏ కాస్తోకూస్తో పనికొచ్చిందని చెప్పుకోతగ్గ యంత్రాన్ని కనిపెట్టిన వాడు బార్తెలిమీ తిమోనియర్ అనే ఫ్రెంచి దేశీయుడు. 1830 లో ఈయన తయారుచేసిన యంత్రం చూచి ఫ్రెంచి ప్రభుత్వం 80 యంత్రాలు చేయించి, సైన్యానికి దుస్తులు కుట్టించడానికి వాటిని ఉపయోగించింది. అనేక దేశాలలో అనేకులు ఈ రంగంలో చాలా కృషి చేశారు. గాని ఏమంత చెప్పుకో తగ్గ ఫలితాలు కనబడలేదు.

'సింగర్' యంత్రం

నిజంగా ఉపయుక్తమైన కుట్టు యంత్రం 1851లో అవతరించింది. దీన్ని మెరిట్ సింగర్ అనే అమెరికన్ తయారు చేశాడు. "మనిషి 20 గంటలలో కుట్టుగల వస్త్రాలను ఈ యంత్రం, రెండు గంటలలో కుట్టగలదు" అని ఆనాడు ఆయన ప్రకటించాడు.

ఒకానొకనాడు ముక్కుకు సూటిగా తప్ప, వంకర తిరగడానికి ససేమిరా కుదరదని మొండికెత్తిన కుట్టు యంత్రం ఈనాడు జోళ్లు, ఫాక్టరీలు చక్రాలు తిప్పే పెద్దపెద్ద తోలుపటకాలూ కుడుతుంది. అతి సున్నితమైన లేసులు కుట్టగలుగుతోంది. కుట్టుయంత్రాలను ఈ నాడు విద్యుచ్ఛక్తితో కూడా పని చేయిస్తున్నారు. వ్యాపార సంస్థలలో ఈ యంత్రాలు విరివిగా ఉపయోగిస్తున్నారు. ★

హేమంత సంక్రాంతి

మధురాంతకం రాజారాం

పవలు కురుచైపోయి రేయి హెచ్చినదేమి?
పంటకాపుల కింత తీరికే లేదేమి?
తెలిసెనే, తెలిసెనే హేమంత మరుదెంచె!
చలిగాడు ఒడలెల్ల గడగడా వడకించె!

ఎవరు రమ్మన్నారు నిన్ను హేమంతమా!
ఎందు కరుదెంచావు నీవు హేమంతమా!
ఏడాది కొకసారి ఈరీతిగా వచ్చి
వడకింతువేలనే మమ్ము హేమంతమా!

దినవీధిలోనుండి మంచుతెరలను దించి
వేధింతు వేల మా బాలవటులను నీవు,
చలిబాధ కేమిలే, శాలువలు గలవులే!
తెలవారుఝామునను చలిమంట లెగయులే!

పగ్గాలు బిగబట్టి పడమందుకున్నాడు
పంచపై కొగగట్టి పాలేరు మొనగాడు!
ఎరుగనండీ బాబు చలి ఏమిటంటాడు
హేమంతమా! నీకు వాని దొక్క సవాలు!

మదురు గుమ్మడిపూవు మణికిరీటమ్ముగా
గంగిరెద్దులవారు అంగరక్షకులుగా
పైరుపచ్చల మహారథమెక్కి నీవు!
పట్టంపు రాణిలా తరలి వచ్చావు!

పూత పింఛెలతోడ పొలుపొందినవి చేలు
శీతవాతమ్ముతో చనుదెంచినవి రేలు
హేమంతమా! నీకు స్వాగతమ్ములు పలికి
ఎగురుచున్నవి నేడు చెరకు జండాలు!

చల్లగా, అంచలా మెల్లగా వచ్చావు
కొల్లగా పూలబంతులు మోసి తెచ్చావు
చేమంతిపూల మా చిటిపాప జడ గట్టి
“సామంత రాణి”వని కొసరి ముద్దాడావు!

ఆనందదాయినివి నీవు హేమంతమా!
అందాల ఋతురాజ్ఞి వీవు హేమంతమా!
ఏడాది కొకసారి ఈరీతి నరుదెంచి,
ఏలుకో మమ్మెల్ల హేమంత మిత్రమా!



పేపర్ కటింగ్ చిత్రం: ఎ. వి. ఎస్. ఆర్. సోమయ్యలు.

పాశ్చాత్యుల పౌరాణిక గాథ:

సూర్యుని రథం

సమస్త ప్రాణికోటికీ ఆత్మబంధువు సూర్యుడు. సూర్యదేవుడు నివసించే భవనం మానవమాత్రులెవ్వరూ చేరలేని సుదూరప్రదేశంలో ఉన్నది. ఆ భవనం బంగారంతో నిర్మితమైనది. గోడల్లో రత్నాలు, వజ్రాలు, వైడూర్యాలు పొదగబడి వింతవింతలు, రంగురంగులకాంతులీనుతూ కన్నులు చెదరగొడుతూ ఉంటాయి. అక్కడ ఎప్పుడూ మధ్యాహ్నమే. మసకసంజలమాలిన్యం అక్కడ మచ్చుకైనా కానరాదు. చీకటిజడలు విరబోసుకున్న నిశాపిశాచం అక్కడ కాలు పెట్టలేదు. నిరంతరం ధగద్ధగాయమానంగాఉండే ఆ ప్రదేశంలో ఏమానవుడూ క్షణంకూడా నిలవలేడు. అసలు ఏమానవుడూ ఎప్పుడూ అక్కడికి వెళ్లాలనికూడా ప్రయత్నించలేదు.

ఒకరోజున ఒకయువకుడు సూర్యదేవునిభవనానికి సాహసించి ప్రయాణమయ్యాడు. అతనిలో సగం దేవతాంశ ఉన్నది. తల్లి మాత్రం మానవస్త్రీ. సూర్యుని భవనం సమీపిస్తున్నకొద్దీ, అతడు ఆ ప్రకాశానికి తట్టుకోలేకపోతున్నాడు. అయినా అతనిదీక్ష అచంచలమైనది. అతని ధైర్యం అకుంఠితమైనది. అందుచేత వెనుకంజవేయకుండా ముందుకు సాగిపోయాడు. భవనసోపానాలు అధిరోహించాడు. ద్వారాలు దాటాడు. అతివిశాలమైనదర్బారులో అడుగుపెట్టాడు. ఇక ఒక్కడుగైనా ముందుకు వేయలేక ఆగిపోయాడు. ఆవతలి చివర సూర్యదేవుడు దుర్నిరీక్ష్యమైన తేజస్సుతో ప్రకాశిస్తూ మణిమయసింహాసనంమీద ఆసీనుడై ఉన్నాడు.

సూర్యుడు సర్వసాక్షి. ఆయన కన్నుగప్పి లోకంలో ఏదీ జరగదు. తనఎదుట నిలుచున్న యువకుని వంక కరుణావీక్షణాలు ప్రసరించి "నాయనా! దుర్గమమైన ఈ ప్రదేశానికి ఏమిపనిమీద వచ్చావు?" అని ప్రశ్నించాడు.

యువకుడు సవినయంగా నమస్కరించి ధైర్యంగా సమాధానమిచ్చాడు. "నేను తమ కుమారుడినవునో కాదో తెలుసుకోవాలనే కుతూహలంకొద్దీ ఇంత దూరం వచ్చాను. మీరే నా జనకులని చెప్పింది నా జనని. కాని నా తోటివారంతా నన్ను తండ్రి ఎవరో తెలియనివాడని హేళనచేస్తున్నారు. మీరే నా జనకులని చెప్పినా వారు విశ్వసించడంలేదు. ఇది నాకు హృదయశల్యంగా ఉన్నది. కనుక స్వయంగా మిమ్మల్నే అడిగి తెలుసుకోవాలని వచ్చాను. నా సందేహం తీర్చవలసిందిగా ప్రార్థిస్తున్నాను."

"నిజమే నాయనా! నీ జనని చెప్పింది నిజమే. నేనే నీ తండ్రిని. నీకు నా మాటపైకూడా నమ్మకం లేదా? అవసరమైతే నీకు నిదర్శనం చూపిస్తాను. నీకిష్టం వచ్చిన వరం కోరుకో. ఇస్తాను. దేవనది సాక్షిగా నీకు వాగ్దానం ఇస్తున్నాను ఏం కావాలో కోరుకో," అని సూర్యుడు పలికాడు.

ఆకాశంలో సూర్యదేవుడు తేజోరథమెక్కి ప్రాక్పశ్చిమ దిగంతాల మధ్య అశ్వాలను పరుగెత్తించడం చాలాసార్లు చూశాడా యువకుడు. ఆ మహాద్భుత దృశ్యాన్ని చూసి, చూసి "ఓహో! ఎంత మహానుభావుడు నా తండ్రి!" అని అనుకునేవాడు. లోకాలకు వెలుగులు కురిపిస్తూ, గగనపథంలో గుర్రాలను పరుగెత్తిస్తూ, దివ్యరథంలో విహరిస్తుంటే ఎంత గొప్పగా ఉంటుందో," అని పలుసార్లనుకున్నాడు. తన తండ్రి తన అభీష్టం ఏదైనాసరే ప్రసాదిస్తానని వాగ్దానం చెయ్యగానే, విచిత్రమైన ఆ ఊహ మనసులో కదిలింది. వెంటనే ఇలా అన్నాడు: "తండ్రీ! నీ రథంలో విహరించాలని నా


★ సూర్యుని రథం ★

కోరిక. ఒక్క రోజుకు మాత్రమే. ఒక్కసారికిమాత్రమే నీ రథం నాకు వదిలిపెట్టు."

సూర్యుడు తన తప్పిదం గ్రహించాడు. ఆవేశపరుడు, ఉచితానుచితాలెరుగని బాలుడు ఏదికోరితే అది ఇస్తానని తను ఎందుకు వాగ్దానం చేశాడు? దేవనదిసాక్షిగా ఎందుకు వరమిచ్చాడు? ఇప్పుడీ విషమ సమస్యను ఎలా తప్పించుకోవడం? సూర్యునికి ఏమీ పాలుపోలేదు. "నాయనా! నిజానికి నువ్వు కోరిన ఈవరంతప్ప ఏదైనా ఇవ్వాలనే నా వాంఛ. కాని తీరా వాగ్దానం చేశాను. నువ్వు ఏదికోరినా ఇచ్చి తీరవలిసిందే. కాని నీకు తెలియదు కనుక చెబుతున్నాను విను. నీవు నా కుమారుడివన్నమాట నిజమే. కాని నీతల్లి మనుష్యస్త్రీ. మానవుడెవ్వడూ నా రథాన్ని అధిరోహించలేడు. అసలు ఏ దేవుడూ నారథాన్ని అధిరోహించలేడు నేను తప్ప. నా రథపథం ఎన్నడైనా చూశావా? సముద్రమధ్యంనుండి ప్రారంభమవుతుంది. అంత ఎత్తయిన మార్గం ఎక్కలేక నా అశ్వాలు కూడా ఆయాసపడతాయి. సరిగా ఆకాశమధ్యానికి చేరుకునేసరికి అంత ఎత్తునుండి క్రిందికిచూడడానికి నాకే భయంవేస్తుంది. ఇక పశ్చిమానికి దిగేటప్పుడు చెప్పనక్కరలేదు. ఆ మార్గం ఎంత ఏటవాలుగా ఉంటుందంటే, నాకోసం ఎదురుచూసే సముద్రదేవతలుకూడా భయపడిపోతారు, నేనెక్కడ తలక్రిందులుగా పడిపోతానోఅని. నా అశ్వాలను కళ్లెంపట్టి నడిపించడంకూడా కష్టమే. అవి నాకే లొంగవు. ఎత్తు ఎక్కుతున్నకొద్దీ వాటికి వేగం, ఆవేశం ఎక్కువైపోయి హుటాహుటిగా పరుగులుతీస్తాయి. నువ్వు వాటినిపట్టి ఆపగలవా? వాటిని సరిగా నడపగలవా?"

సూర్యదేవుడు ఇంకా ఇలాగన్నాడు:

"ఆకాశంలో ఏవేవో మహాద్భుతాలుంటాయని అనుకొంటున్నావా పాపం? దేవతల నగరాలు, ఉద్యానవనాలు, సుందరదృశ్యాలు ఉంటాయని ఊహించుకుంటున్నావా? అవేమీ ఉండవు. క్రూరమృగాలతో నిండిఉంటుంది ఆకాశమార్గం. ఏమాత్రం ఏమరుపాటుగ ఉన్నా, మీదికురికి మింగివేయడానికి సిద్ధంగాఉంటాయి. వృషభం, సింహం, వృశ్చికం, ఘోరాకృతిగల కర్కాటకం ఇవన్నీ పొంచి పొంచి మీదబడడానికి చూస్తూ ఉంటాయి. నామాట విని, నీ కోరిక ఉపసంహరించుకో. నీ చుట్టూరా చూడు. ఈ విశాల విశ్వంలో ఎన్నో చక్కని పదార్థాన్నాయి. నీకేది కావాలో కోరుకో, తక్షణం ప్రసాదిస్తాను. నువ్వు నా తనయుడివౌనో కాదో ఇంకా అనుమానంగా ఉందా? నీకు అపాయం



ఎన్నడూ భీతి ఎరుగని యువకుడు అపరిమితమైన భయ సంభ్రమాలతో నిశ్చేష్టుడైపోయాడు.
పగ్గాలు వదిలి పెట్టాడు.

రాకూడదని నే నింతగా కోరుకోవడాన్ని బట్టే గ్రహించవచ్చునే నేను నీ తండ్రినైనందీ కానిదీ. నా మాట విను నాయనా!"

ఇలా ఎంత చెప్పినా యువకుడు వినిపించుకోలేదు. ఒక్క రోజు సూర్యుని రథం ఎక్కే మహద్భాగ్యంముందు తక్కిన సంపదలూ సౌఖ్యాలు తృణప్రాయం అని అతడు భావించాడు. దేవతలనాయకుడుకూడా వశంచేసుకోలేని అశ్వాలను తన బలిష్ఠమైన హస్తాలతో లాగిపట్టి, దేదీప్యమానమైన సూర్యరథంలో విహరించడం ఒక్కటే తన జీవితానికి సాఫల్యం కలిగిస్తుందని అతడు అనుకున్నాడు. తండ్రి చెప్పిన అపాయాలేవీ అతన్ని భయపెట్టలేకపోయాయి. అతని హృదయంలో భీతికి ఆవగింజంతయినా చోటులేదు. తన శక్తిసామర్థ్యాల గూర్చి కించిత్తయినా శంక లేదు. తను సునాయాసంగా జైత్రయాత్ర చేసిరాగల ననుకున్నాడు. అతని మనస్సును మళ్ళించడం ఇకసాధ్యం కాదని సూర్యుడు భావించి వరం ప్రసాదించాడు. పైగా వ్యవధి కూడా లేదు. బయలుదేరే సమయం

★ సూర్య విరథం ★

ఆసన్నమైంది. ప్రాగ్దిశాద్వారాలు కొద్దికొద్దిగా తెరుచుకుంటున్నాయి. ఎర్రని కెంపులకాంతులు సొంపులీనుతూ వ్యాపిస్తున్నాయి. ఉషః కాంత తెల్లని మందహాసం లోకమంతటా చల్లచల్లగా విస్తరించుకుంటోంది. నక్షత్రాలు ఒకొక్కటే నీలాకాశపు పరదాలమరుగున విశ్రమిస్తున్నాయి. వేగుచుక్క కూడా వెల వెలబోతోంది.

అంతా సిద్ధమైంది. సూర్య భవనపు ద్వారపాలికలైన ఋతువులు కవాటాలు తెరిచాయి. ఉత్తమాశ్వాలు పూన్చిన రథం తయారుగా నిలుచున్నది. సగర్వంగా యువకుడు రథం అధిరోహించాడు. ఆ రథం అతని మనోరథం. అది ఈనాటికి చేజిక్కింది. అతని కింకేం కావాలి? ఇంకేమైనా కరవా లేదు. ఒక్కసారిగా ముందరి కాళ్లెత్తి గుర్రాలు సాగిపోయాయి. సముద్రానికి అనుకుని ఉన్న మేఘాల గుండా పరుగెత్తాయి. మేఘాలు దాటి విశాలాకాశంలో అడుగు పెట్టాయి. ఆకాశం అధిరోహిస్తూ స్వర్గానికి నిచ్చెన లెక్కుతున్నట్లే యువకుడు తన్మయుడయ్యాడు.

క్రమంగా రథం కుదుపు ఎక్కువైంది. వేగం హెచ్చింది. కళ్లు తిరిగి పోతున్నాయి. పగ్గాలు పట్టుకోవడం కూడా కష్టమవుతోంది. అవి

తీవ్రవిమర్శ

ప్రచురణకర్త: మీ కొత్త నవల ఎప్పటికి పూర్తి అవుతుం దండీ?

కవి: మా రెండో అబ్బాయి పుణ్యమా అని ఇంకో పదార్నెళ్లులోపలగా పూర్తికావచ్చండీ. ఆ వెధవ, నేను రాసినదంతా పొయ్యిలో పడేశాడు.

ప్రచు: మీ రెండో అబ్బాయి నవలలు చదివేదాకా వచ్చాడన్నమాట.

క్రమంగా పట్టు తప్పిపోతున్నాయి. గుర్రాలు వాటంతట అవే రథాన్ని ముందుకు ఈడ్చుకుపోతున్నాయి. రథం తేలికగా ఉంది. పగ్గాలు పట్టుకున్న హస్తాలు దుర్బలంగా ఉన్నాయి. ఈ రథికు డెవరు? తమ స్వామి, తమ పాలకుడు సూర్యుడు కాదల్లేఉందే. సూర్యుడు కాకపోతే ఇంకే దేవుడూ తమను లొంగదీయలేడు. ఈరోజుకి మనకి మనమే ప్రభువులం అనుకున్నాయి గుర్రాలు. మార్గాన్ని వదలిపెట్టి అటూ ఇటూ ఇష్టం వచ్చినట్లు రథాన్ని ఈడ్చివేయసాగాయి. ఒకసారి వృశ్చికానికి రథాన్ని ఢీకొట్టాయి. మరోసారి కర్కాటకం కాళ్ళమీదినుంచి పోనిచ్చాయి. ఎన్నడూ భీతి ఎరుగని యువకుడు అపరిమితమైన భయ సంభ్రమాలతో నిశ్చేష్టుడైపోయాడు. పగ్గాలు వదిలిపెట్టాడు.

పగ్గాలను వదిలిపెట్టగానే అశ్వాలు మరింత యథేచ్ఛగా పరుగెత్తసాగాయి. ఆకాశపు నడినెత్తిన ఒక క్షణం ఆగి సరాసరి వాలు ప్రదేశంలోకి రథాన్ని ఈడ్చుకుపోయాయి. ఆ మహోష్ణానికి ప్రపంచమంతా అగ్నిజ్వాలలు లేచాయి. మొదట అత్యున్నత పర్వతశిఖరాలకు నిప్పంటుకున్నది. అక్కడినించి అగ్నిజ్వాలలు పాము కోరల్లాగా సాగి సాగి లోయలలోకి, నదీ తీరాలకు, మైదానాలకు, అరణ్యాలకు ప్రాకిపోయాయి. లోకమంతా భగ్గుమని మండిపోతున్నది. నదులు కృశించిపోయాయి. సముద్రాలు ఆవిర్లు గ్రక్కాయి.

రథంలో యువకుడు వేగానికి తల్లడిల్లిపోతూ, అగ్నిలో దహించుకుపోతూ, సొమ్మసిల్లిపడిఉన్నాడు. ఈ భయంకరశిక్ష ఎప్పటికి అంతమవుతుందా అని ఎదురుచూస్తున్నాడు. ఆక్షణంలో మృత్యువు తన్ను కబళించినా మంచిదే ననుకున్నాడు. భూమాతకూడా ఓర్చుకోలేక దద్దరిల్లిపోయింది. ఆమె పెద్దపెట్టున ఆక్రోశించింది. ఆమె ఆక్రోశం దేవతలకు వినబడింది. వారు ఈ మహాప్రళయానికి కారణం గ్రహించారు. వారి నాయకుడు వజ్రాయుధంధరించి ఈ ఉపద్రవానికి కంతకూ కారకుడైన యువకునిపై విసిరాడు. మరుక్షణంలో అతడు భస్మీభూతుడై నేల కొరిగాడు. ఆ దెబ్బకు రథం పగిలింది. గుర్రాలు భయపడి పశ్చిమసముద్రంలో తల దాచుకున్నాయి.

యువకుడు ఆకాశంనుండి పడుతూనే ఒకనదిలో పడిపోయాడు. అతనిశరీరంపై మంటలు చల్లారాయి. నదీకన్యలు అతనిమరణానికి కన్నీరు మున్నీరుగా దుఃఖించారు.

సూర్యునిరథాన్ని వశంగా కోరుకుని, ఏమానవుడూ చెయ్యలేని మహాద్భుత సాహసంచేసి, వీరమరణం పొందిన ఆ గ్రీకుయువకుడు ఫయితాన్. అతని మహత్తరగాథను ఓవిడ్ అనే లాటిన్ కవి మృదుమధురమైన కావ్యరూపంలో గానంచేసి శాశ్వతకీర్తి సంపాదించుకున్నాడు. ★



మాతృ దేవత

పూర్వం నెపోలియన్ అనే చక్రవర్తి ఫ్రాన్సు దేశాన్ని పరిపాలిస్తూ వుండేవాడు. అతనికి తన సామ్రాజ్యాన్ని విస్తరింప జెయ్యాలనే కాంక్ష అధికంగా వుండేది.

అతడు, నిజానికి, చాలా బీద కుటుంబానికి చెందినవాడు. ముందు సైనికుడుగా చేరి, క్రమంగా అభివృద్ధిచెంది, స్వయం ప్రతిభవల్లనే చక్రవర్తిత్వాన్ని కూడా పొందేడు.

అతను చేసిన యుద్ధాల్లో ఎంతో మంది సామాన్య జనం మరణించేరు. అతని పేరు ప్రఖ్యాతులు, ప్రజల రక్తమాంసాలను బలి ఇచ్చి, ఆర్జించినవే! అందువల్లే మన కతను సామాన్యంగా, క్రూరుడుగా కనిపిస్తాడు.

కాని, మనం జాగ్రత్తగా అతని జీవితాన్ని పరికిస్తే మన హృదయాలను స్పందించే లక్షణాలు కొన్ని కన్పడతాయి.

కొంతి కృష్ణమూర్తి

ఆ రోజుల్లో నెపోలియనే ఇంగ్లాండుమీద దాడిచెయ్యడానికి సిద్ధమయ్యాడు. ఇంగ్లాండుకీ, ఫ్రాంసుకీ మధ్య ఇంగ్లీషు ఛానలు అనే సముద్రభాగం వుంది. దాన్నంతా ఇతని నావికా దళాలు ఆక్రమించుకుని వున్నాయి. బ్రిటన్‌లో కూడా ప్రతీవాడూ ఆయుధాల్ని ధరించి వున్న రోజులవి. ఒక బ్రిటిష్ నావికుడు ఫ్రెంచి నావికా దళానికి దొరికి పోయేడు.

అతన్ని వాళ్లు నిర్బంధించలేదు. తమ సముద్రతీరంలో స్వేచ్ఛగా తిరగనిచ్చేవారు. అతని దృష్టి ఎప్పుడూ మాతృదేశం మీదే ఉండేది. అతడు కళ్ళతో, ఈర్ష్యతో, పక్షులు డోవర్ పర్వతాలకేసి ఎగరడాన్ని, కనబడేంతదూరం వరకూ చూస్తూ వుండేవాడు.

అక్కడ ఒంటరిగా ఆవిధంగా బాధపడడంకంటే ఏదైనా చిన్న నావలో భయంకరమైన పెనుతుపానులో, అది ఇంగ్లాండును చేరగల పక్షంలో, ప్రయాణం చెయ్యడమే మంచి దనుకున్నాడు.

రాత్రీ, పగలూ విశ్రాంతి లేక అక్కడే తిరిగేవాడు. ఒకనాడు పొద్దున్న, ఖాళీగా వున్న కర్ర పీపా ఏదో తనవైపు కొట్టుకు రావడాన్ని పరిశీలించేడు. దాన్ని తీసుకుని, దగ్గరగా వున్న గుహలో దాచి, కొన్ని రోజులు కష్టపడి, చిన్న నావగా తయారు చేసేడు.

అది పర్ణించడానికి వీలులేనంత అసహ్యంగా వుంది. అటువంటి దానిలో పిల్ల కాలువ దాటడానికి యత్నించడం సాహసమే అవుతుంది. అలాంటిది ఆ చిన్న నావలో సముద్రాన్ని దాటడానికి ఎంతటి గొప్పవీరుడైనా వణుకుతాడనడంలో

గారడీవాడు రాళ్లు మేకులు, సూదులు, కాగితాలు ఇంకా నానా చెత్త మింగేశాడు. గారడీ అయిపోయిన తర్వాత అందరివద్దకూ వెళ్ళి "ఒక్క కాసీ ఇవ్వండి బాబూ! బీదోణ్ణి. నిన్నటినుంచీ తిండి లేదు. ఆకలిగా ఉంది," అని అడుగుతున్నాడు. మొదటి నుంచీ గారడీ చూసి ఆనందిస్తున్న ఒకపెద్దమనిషి కోపంగా ఇలా అన్నాడు:"ఇంకా ఆకలి ఆకలంటావేమిటోయ్, అన్ని తిన్న తరవాత?" పోపో."

సందేహం లేదు. దానికి తారులేదు; చుక్కానిలేదు; తెడ్లులేవు; తెర చాపలేదు; నావికా దిక్సూచి లేదు. అటువంటి నావలో నురగలు గ్రక్కుతున్న సముద్రాన్ని దాటడానికి తయారయ్యేడు, ఆ బ్రిటిష్ నావికుడు.

అతని దురదృష్టమా అన్నట్టుగా చివరికి ఫ్రెంచి సైనికులచేత పట్టుబడ్డాడు. ఆ పనికిరాని నావ కూడా వెటకారంగా చూస్తున్నట్టనిపించింది, అతనికి!

ఈ సంఘటన క్రమంగా నెపోలియన్ చెవుల్లో పడింది. అతన్ని వెంటనే పిలిపించేడు.

నెపోలియన్ చేతులు వెనక్కి కట్టుకుని ఠీవిగా నిలబడ్డాడు, శాంతి సమయంలోనూ, ప్రమాదావస్థలోనూ కలిగి వుండే సహజ స్థైర్య స్వభావాన్ని కనపరుస్తూ; ఇలా అన్నాడు.

"ఓ నావికుడ! నువ్విట్లాంటి నిరుపయోగమైన నావలో ఇంత గొప్ప సముద్రాన్ని దాటడానికి సాహసించేవు! ఈ నీ ధైర్యానికి కారణం నువ్వు ఎవతెనో గాఢంగా ప్రేమించి ఉండడమే అయి వుంటుంది."

నావికుడు, తడుముకోకుండా, జవాబిచ్చాడు, ఈ విధంగా "ప్రభూ! నా కక్కడ ప్రేయసి ఎవరూ లేదు. నేను నా మాతృదేవతను చూసి చాలా రోజులైంది. ఆవిణ్ణి చూడాలనే అభిలాషే ఇంత సాహసానికి పురిగొల్పింది.



నా తల్లి, నేను దూరమయ్యేనని ఈపాటికే, చాలా దిగులు పడి వుంటుంది."

నెపోలియన్ ఆశ్చర్య చకితుడై ఇలా అన్నాడు, "త్వరలో నీమాతృదేవతను చూసే అవకాశాన్ని కల్పిస్తాను. మీ యిద్దరూ కూడా నా అభిమానాన్ని చూరగొన్నారు. సాహస స్వభావులైన మాతృమూర్తే ఇట్లాంటి సాహసవంతుణ్ణి కనగలుగుతుంది. అంటూ ఒక బంగారు నాణెం బహూకరించేడు.

తర్వాత, "శాంతి పతాకంతో అతన్ని మాతృదేశంలో వదల"మని ఆజ్ఞాపించేడు, తన నావికాదళానికి.

ఆ నావికునకు తర్వాత జీవితంలో దిన వెచ్చానికై దిగులుపడే రోజు లెన్నో కలిగేయి. అయినా సరే నెపోలియన్ బహూకరించిన బంగారు నాణెం మార్చుకుని, కడుపు నింపుకుందుకు ఇష్టపడేవాడు కాడు. దాన్ని ప్రాణపదంగా కాపాడుకునేవాడు.

అందువల్ల, భీభత్సమైన యుద్ధాలను జరిపించిన నెపోలియన్ మనకు కఠినాత్ముడని తోచినా నిజమైన మాతృభక్తి కలిగిన నావికునకు, శత్రుత్వాన్ని కూడా మర్చిపోయి, స్వేచ్ఛనీయడమేగాక బహుమతులిచ్చి, స్వదేశానికి పంపడంలో గల అతని హృదయ విశాలత్వాన్ని మనం గమనించాలి.

ఎంత శత్రువులైనప్పటికీ, ఎదటివారిలోని మంచిని గ్రహించే మంచి బుద్ధిని మనమూ అలవర్చుకోవాలి."

★

ఇద్దరన్నదమ్ములు

గుత్తా బాపినీడుచౌదరి

ఒక ఊరిలో యిద్దరన్నదమ్ములు ఉన్నారు. వారు పుట్టుకనుండి కడు బీదవారు. వారిలో మొదటి వాని పేరు గంటయ్య. రెండవ వాని పేరు గంగయ్య.

వారి బీదతనమును చూచి ప్రతి వారు జాలిపడేవారు. కాని సహాయము చేయవలసి వచ్చినప్పుడు మాత్రము ఏదో ఒకవిధముగా తప్పుకొనేవారు.

అట్లు తప్పుకొని తిరుగువారిని చూచి గంటయ్య మండిపడేవాడు. 'చూడు తమ్ముడూ! వారందరూ ముఖప్రీతి కబురులు ఎంత అందముగా చెబుతారో. సహాయము చేయవలసివచ్చినప్పుడు ఎట్లా పారిపోతారో! అలాంటివారివద్ద దేవుడు ధనము ఎందుకు ఉంచాడో నా కర్థము కాదు. దానధర్మములు చేయువారివద్ద ధనము ఉండదు' అంటూ గంటయ్య తమ్ముడు గంగయ్యతో ఒకసారన్నాడు.

'అన్నయ్యా! లోకమంతా ఎప్పుడైనా అంతే. మనకు ధనం వచ్చినా అట్లే చేస్తాము. లేదు కాబట్టి యిట్లు అనుకుంటున్నాము గాని. ధనము తీపి ఎవ్వరి కుండదు? వారు మనకు సహాయము చేయవలసివచ్చినప్పుడు తప్పుకు తిరగటములో ఏమీ ఆశ్చర్యము లేదు' అంటూ గంగయ్య సత్యవాక్కులు పలికాడు.

అదే సమయమున పార్వతీ పరమేశ్వరులు ఆ త్రోవన పోతూ వీరి సంభాషణ విన్నారు. పార్వతికి పెద్దవాని మాటయందు సత్యమున్నట్లు తోచింది. అందువల్ల ఆమె 'నాథా! అటువంటి నీతిపరునివద్ద డబ్బు ఎందుకు లేదు? నేను తప్పక అతనికి సహాయము చేస్తాను' అని శివునితో అన్నది.

'పార్వతీ! నీకు ఏమైనా మతి పోయినదా? పెద్దవాని మాటల యందు సత్యము లేశమయినా లేదు. చిన్నవాడు మాట్లాడిన మాటలు వేదవాక్కులు' అని శివుడు పార్వతితో అన్నాడు.

కాని పార్వతికి పెద్దవానిమాటలయందే సత్యమున్నట్లు తోచింది. అందువల్ల వెంటనే అతనిని ఒక కోటీశ్వరునిగా చేయదలచి ఒక బంగారు ముద్ద అతనికి దొరుకునట్లు చేసింది.

ఆ బంగారుముద్ద మూలముగా గంటయ్య కోటీశ్వరుడై భోగభాగ్యములను అనుభవింపసాగాడు. మరికొన్ని రోజులకు ఒక అందమైన యువతిని చూచి పెండ్లాడాడు.

అన్న ఉచ్ఛస్థితిచూచి గంగయ్య బీదతనమున ఉండియే మురియసాగాడు. ఉన్నత భావములు గల అన్నకు సిరి ప్రాప్తించినందుకు దేవుని వేనోళ్ళ పొగిడాడు.

భోగభాగ్యములతో తులతూగుతూ గంటయ్య తమ్మునిమాటనే మరిచాడు. కాని గంగయ్య ఎప్పటికైనా అన్న తనని పిలిపించి కావలసిన ధనము యిచ్చునని తలుస్తున్నాడు. ఇట్లు ఎన్నిరోజులు గడిచినా గంగయ్యకు అన్నవద్దనుండి పిలుపు రాలేదు.

దానధర్మములు చేయుటయందు మునిగి తనని మరిచాడేమోనని చివరకు గంగయ్య సమాధానపడ్డాడు. కాని 'గంటయ్య చాలా పిసినారి. చస్తున్నామన్నా వచ్చి మంచినీళ్లు యివ్వడ'ని కొందరినోట వెంట గంగయ్య విన్నాడు. అయినా నమ్మలేకపోయాడు.

అందువల్ల ఒకరోజున గంగయ్య గంటయ్యవద్దకు వెళ్లాడు. గంటయ్య "ఎవ్వరవు నీవు?" అని ప్రశ్నించాడు. గంగయ్య ఆశ్చర్యపోయాడు. అయినా అన్న పొరపాటున తనని ఆనవాలు పట్టలేకపోతున్నాడేమోయని "నేనే నీ తమ్ముడను గంగయ్యను" అన్నాడు ఎంతో ఆత్రంగా.

చిత్రకళాప్రదర్శనం చాలా అద్భుతంగా ఉందని అందరూ మెచ్చుకుంటున్నారు. అందులో ముఖ్యంగా ఒక చిన్న నీటిరంగులచిత్రం చాలా బాగుందని పలువురు విమర్శకులు దానిముందు నుంచుని పొగిడేస్తున్నారు. ఒకడు మాత్రం "అబ్బే. ఈ బొమ్మ ఏం బాగుంది?" అన్నాడు.

"ఎందు చేత?" అన్నాడు ఒక విమర్శకుడు.

"బొమ్మ చాలా చిన్నది."

"చిన్నబొమ్మలు బాగుండవనీ, పెద్దబొమ్మలే బాగుంటాయనీ మీరు ఏసూత్రాన్ని అనుసరించి విమర్శిస్తున్నారో తెలుసుకోవచ్చునా?"

"నేను విమర్శకుణ్ణి కాను. ఈ పక్కవీధిలో ఫ్రేములుకట్టే షాపు వుందే. అది మా షాపే," అన్నాడు అతగాడు.

"ఏమిటీ! నీవు నా తమ్ముడవా? ధా థా! నా కవమానము. నీకు ఏ విషయమునందు పోలిక ఉన్నది నాతో. ముందు అధిక ప్రేలాపన చేయక బయటకు నడువు. లేదా గెంటింపబడతావు" అని గంటయ్య గంగయ్యను ఎరిగివుండికూడా ధనమదముచే కటువుగా మాట్లాడాడు.

గంగయ్యకు అన్న ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. ఆరోజున అన్న అన్నమాటలన్నీ జ్ఞాపకం వచ్చాయి. అయినా ఆ మాటలన్నీ అన్నకు జ్ఞాపకము చేయుటవలన లాభము లేదని గంగయ్య చరచరా బయటకు నడిచివచ్చివేశాడు.

"ఇప్పుడైనా నిజము గ్రహించావా పార్వతీ! ధనము లేనంత సేపే ఎవ్వరు ఎన్ని కబురులు చెప్పినా. ధనం వచ్చునరికి తాప త్రయము ఎక్కువై పిసినారితనము ఏర్పడుతుంది. లేదా ధనమదము ఏర్పడుతుంది" అన్నాడు శివుడు చిరునవ్వుతో.

పార్వతి తన ఓటమికి కొద్దిగా సిగ్గుపడింది. అయినా ఆమెకు ఒక అనుమానము వచ్చింది. అందువల్ల ఆమె "నాథా! మీరు అన్నట్లు చిన్నవానిమాటలు నిజమయ్యాయి. కాని పెద్దవాని మాటలయందు లేశమయినా నిజము ఏ మానవునందునూ కన్పించదా?" అని భర్తను ప్రశ్నించింది.

"లేకేమి పార్వతీ. వారు సర్వసాధారణముగా డంబములు పలకరు. పలికిన వాక్కులు తిరుగులేక చేయుదురు. అటువంటి వారే గంగయ్యలాంటి వారు. చూడు అతనిబుద్ధి," అని ఈశ్వరుడు గంగయ్యను కోటీశ్వరుని చేశాడు. మరుక్షణములో పార్వతి గంటయ్యను దరిద్రనారాయణునిగా మార్చివేసింది.



మేష్టారు: 1891 లో పుట్టిన మనిషికి ఇప్పుడెన్నేళ్లు చెప్పు?

బాబీ: ఆడమనిషా? మొగమనిషా?

* * *

లాయరు: ఏమయ్యా, నీ సైకిలు ఎత్తుకుపోయింది, ఈ ఆసామీయేనని గట్టిగా తెలుసా?

ఫిర్యాది: మీరు క్రాసు పరీక్ష చేసేవరకూ ఇతనేదొంగ అనుకున్నానండి. ఇప్పుడు మాత్రం అసలు నాకు సైకిలే లేదేమోనని అనుమానంగా ఉందండి.

గంగయ్య ఐశ్వర్యమునకు అంతులేకుండా వుంది. కాని గంగయ్య మాత్రము తనకున్న ఐశ్వర్యముతో భోగభాగ్యములతో గర్వించలేదు. అతడు ఆడంబరము లేక సామాన్య వస్త్రములను ధరించి అన్నము వస్త్రము లేని వారిని ఆదరించి దానధర్మములు చేయసాగాడు.

అన్న ఐశ్వర్యములో ఉన్నాడని గంగయ్య అనుకున్నాడు. అయినా అన్న తాలూకు [illegible] తెలుసు

★ ఇద్దరన్నదమ్ములు ★

కానుటకు తానే ఒకరోజున స్వయముగా బయలుదేరాడు.

కాని యిదివరలో అన్న ఐశ్వర్యముతో తూగిన స్థలము వల్లకాడువలె వుండటము చూచి ఆశ్చర్యపడ్డాడు.

అన్నకై గంగయ్య యింటికి వెళ్ళకుండా వెదుక నారంభించాడు. చివరకు ఒకచోట ఆహారము లేక స్పృహతప్పి పడివున్న గంటయ్యను చూచి గంగయ్యవిచారించి అన్నను భుజముపై ఎత్తుకొని యిల్లుచేరాడు.

తరువాత అన్నకు స్నానము చేయించి మంచి బట్టలు యిచ్చి, భోజనముపెట్టి "అన్నా! నాకైశ్వర్యము దైవకృపవల్ల వచ్చినది. కావున నా ఐశ్వర్యములో నీకు కూడా వాటా కలదు. కావున నీ వాటా నీవు పుచ్చుకొనుమ"ని గంగయ్య వినయముగా పలికాడు.

అతని మాటలు విని గంటయ్య ఆశ్చర్యపడ్డాడు. తమ్ముని కసిరి కొట్టిన విషయము అతని మనస్సును బాధింపజొచ్చింది.

"గంగయ్యా! నీకు నేను ధనమదముచేత చేసిన అన్యాయము క్షమింపరానిది. కావున నన్న ఈ దీనతనముచేతనే కుళ్ళి కృశించి చావనీ" అని గంటయ్య దుఃఖించాడు.

"అన్నా! గతము మరిచిపో! తప్పులు ఎవ్వరికైనా పరిపాటి. కావున మనవద్ద వున్న ధనముతో మనము భోగములు అనుభవించుచూ యితరులకు కూడా సహాయము చేద్దాం" అని గంగయ్య పలికాడు.

"తమ్ముడూ! నీ యిష్టమే నా యిష్టము"అని గంటయ్యఅన్నాడు. ఆ రోజునుండి గంటయ్య గంగయ్యలు తోటిమానవులకు విరివిగా సహాయ పడుతున్నారు.

అదంతా చూచి పార్వతి "నాథా! మీరు చెప్పిన మాటలు నిజము. నిజముగా గంగయ్య బుద్ధి చాలా విశాలమయినది" అన్నది భర్తతో. ★

బ్రిటిష్ విదూషకుని విచిత్రగాథ:

నవ్వతత్వార్థధామ...

రెండవ ఎడ్వర్డ్ దర్బారులో స్కోగన్ అనే విదూషకుడు ఉండేవాడు. ఒకసారి ఈ విదూషకుడి భార్యను చూడాలని మనసుపోయింది రాణిగారికి.

"తప్పకుండా పిల్చుకువస్తానండి అయితే ఒక్కముక్క ముందుగా చెప్పాలి. నా భార్యకి చెముడు. బహ్మచెముడు" అన్నాడు స్కోగన్.

మర్నాడు భార్యను వెంటపెట్టుకొచ్చాడు.

మహారాణి ఇసబెల్లా, అతిశరాగానే, ముందుకువంగి, గొంతెత్తి గట్టిగా పలకరించింది.

స్కోగన్ భార్య ఠంచేలెత్తిపోయింది రాణిగారి గావుకేకకి. "నాకేం చెముడనుకున్నారా?" అని రాణిగారిని మించిన స్థాయిలో ఎదురుకేక పెట్టింది. నిజానికి స్కోగన్ భార్యకు ఉన్నది బ్రహ్మచెముడు కాదు. పిచ్చకోపం.

రాణిగారికి నిజంతెలియగానే రాజుగారికి చెప్పారు. రాజుగారు మండిపడి అప్పటికి ఊరుకున్నారు. మర్నాడు స్కోగన్ వచ్చేసరికి, వేటకుక్కల్ని ఉసికొల్పడానికి ఏర్పాట్లుచేయించారు.

స్కోగన్ ఈ సంగతి ఎలాగో పసిగట్టేశాడట. అవటా మర్నాడు ఒక ఏపైన జింకపిల్లని వెంటబెట్టుకుని ఉద్యానవనంలోకి వెళ్ళాడు. ఒక్కసారిగా కుక్కలు ఉసికొల్పబడ్డాయి. వెంటనే స్కోగన్ జింకని వదలిపెట్టాడు.

దాంతో, అక్కడున్న కుక్కలన్నీ జింక వెంటబడిపోయాయి. ఇది జరిగిన కొన్నాళ్లకు స్కోగన్ ఇంగ్లాండ్ వదిలి ఫ్రాన్స్ వెళ్లాడు.

"మళ్లీ ఇంగ్లీషుగడ్డమీద కాలుమోపితే మరణశిక్షే" అని అతనికి కబురు పంపబడింది.

మొండికెత్తిన స్కోగన్, ఫ్రాన్సులో బురద ఓ బుట్టెడైతే చేతబట్టుకుని ఓడ ఎక్కాడు. ఇంగ్లాండ్‌లో దిగేముందు,— ఈ గడ్డమీద కాలుమోపరాదు కాబట్టి— ఫ్రెంచి బురద బూట్లకి పట్టించుకుని మరీ దిగాడు.

తరవాత, ఒక శవపేటికలో కూర్చుని, దాన్ని, రాజుగారువెళ్లేదారిలో పెట్టించాడు.

స్కోగన్ శవం అందులోఉందని, రాజుగారికి, ఒక వ్యక్తి చెప్పగానే, రాజుగారు స్కోగన్‌ను క్షమించారు.

క్షమాదానం జరిగిన ఉత్తర క్షణాన స్కోగన్ బయటకు వచ్చిరాజుకు నమస్కరించాడు. ★

గుమ్మడికాయల దొంగ

"ఏరా. చిన్నబాబూ. నిన్న మధ్యాహ్నం నువ్వెక్కడ కెళ్లావురా?"

"అబద్ధం. పచ్చి అబద్ధం. మీకెవరు చెప్పారు? అంతా ఉత్తదే...పితూరీ నమ్మకండి"

★ మకరసంక్రమణం ★

(13- వ పేజీ తరువాయి)

మిళితంచేసి జీవవిజ్ఞానాన్ని కలిగించటం ప్రశంసాపాత్రమైన అంశం.

గైరమ్మపూజ

ఈ భోగినాడే ముత్తైదువలు, నూతన వధువులు 'గవిరమ్మ'ను ఆహ్వానించి పండుగ మూడునాళ్లూ చందనతాంబూలాది సత్కారాలతో పూజించి గౌరవిస్తారు. కనుము నాడు సాయంత్రం నదులు ఉన్నచోట నదుల్లోనూ, లేదా వాపీకూపాదుల్లోను మేళతాళాలతో ఊరేగించుకుంటూ స్త్రీలోకమంతా వెళ్ళి ఓలలాడించి వస్తారు. ఈ గౌరమ్మపూజ ప్రాచీన జీవితంలో ముఖ్యంగా స్త్రీలోకంలో సామాజిక జీవితాన్ని పెంపొందించటానికి ఎంతో తోడ్పడింది.

'గవిరమ్మ' కృషికి అధిదేవత. ఇది ఆశ్వయుజ మాసంలో జరగవలసిన పండుగ. అయితే, 'గవిరమ్మపూజ'ను 'సంక్రమయ్య' పూజతోపాటు కలిపిచేయటంలో కూడా విశేషముంది. కర్షకలోకం భోగినాటిరాత్రి ఒక రవికగుడ్డ, బియ్యం మొదలైన, తినుబండారాలు మోయిన తీసుకుని గ్రామంలోని విశ్వబ్రాహ్మణుని ఇంటికివెళ్ళి అతడు ముందేచేసిఉంచిన సంక్రమయ్య విగ్రహాన్ని మేళతాళాలతో సమిష్టిగృహానికి తీసుకువచ్చి గవిరమ్మతోపాటు పూజించి గౌరమ్మతోపాటు నదిలోనో, బావుల్లోనో ఓలలాడిస్తారు. భోగినాటి సాయంత్రమే పిల్లలకు పళ్లుపోసి ముత్తైదువులకు చందన తాంబూలాలిప్పించి మొక్కిస్తారు; వారు దీవనలు అందిస్తారు. భోగినాటిఉదయం "భోగిమంటలు". సమయంలో కొన్ని ప్రాంతాలవారు చలిపోయిన సంతోషాన్ని సూచిస్తూ నృత్యంచేస్తారు. 'గౌరమ్మ'ను గురించిన పాటలు స్త్రీసాహిత్యంలో మాధుర్యంచిప్పిలే మంచి గేయాలు.

గొబ్బిళ్లో గొబ్బిళ్లో

భోగినాడు కూడా ధనుర్మాసారంభం నుంచి పెడుతున్నట్లే ఇళ్లముందు 'గొబ్బిళ్లు' పెడతారు. ధనుర్మాసారంభంనుంచీ చలి ఎంతగా కొరికివేస్తున్నా 'ప్రత్యూష వవసాంకురాలతో'పాటు లేచి ఇళ్లముందు కలయంపిచల్లి, రంగవలికలు తీర్చిదిద్ది గొబ్బిళ్లు పెట్టటము ఆంధ్ర దేశంలో ఆచారం. ధనుర్మాసం నెల నాళ్లూ విష్ణ్వాలయాల్లో, రామ మందిరాల్లో స్వామిని భూపాలరాగంలో సన్నాయి పాటలతోనూ, కమ్మని కంఠాలతోనూ మేల్కొల్పటం అలవాటు.

గొబ్బిళ్లనేపేరుతో గోమయంతో అర్ధగోళాకృతులుచేసి పసుపు కుంకుములతో అలంకరించటం చూస్తే బౌద్ధ స్తూపాలు జ్ఞప్తికి వస్తవి. ప్రాతః కాలంలో సగం ఉదయించిన సూర్య రూపాన్ని చూచే స్థపతి (శిల్పి) స్తూపరూపాన్ని ఊహించాడనీ, బౌద్ధుల కాలంలో స్తూపారాధనం ఒక విధమైన సూర్యారాధనమనీ కొందరి అభిప్రాయము. ఈ రీతి సూర్యారాధనమే తరువాత కాలంలో హిందూ సంఘంలో గొబ్బి పూజ అయిందని కొందరు సాంఘిక శాస్త్రవేత్తల అభిప్రాయము. గొబ్బి దేవతమీద ఎన్నో కమ్మని పాటలు ఆంధ్ర దేశంలో వినిపిస్తున్నవి. పాల్కురికి సోమనాథుడు (క్రీ.శ. 1150 ప్రాంతము) కూడా తన పండితారాధ్య చరిత్రలో వీటి ప్రశంస చేశాడు.

సంక్రాంతి పుణ్యకాలము. దేవలోకానికి ఈనాడు తలుపులు విడివడుతవి. అందువల్ల పితృదినం. పితృ దేవతలకు పుణ్యలోక ప్రాప్తికోసం ఈనాడు తిల తర్పణాది కర్మలు ఆచారపరులు ఆచరిస్తారు. కూష్మాండ దానం చేస్తారు. పూర్వకాలంలో రాజన్యులు ఈ సంక్రాంతి పుణ్యకాలంనాడు తమ పితృ దేవతలకు పుణ్యలోకాలకోసం అనేక అగ్రహారాలూ ఖండ్రికలూ దానం చేశారు. మనదేశంలో దొరికే పూర్వ శాసనాలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడి ఔతుంది. సంక్రాంతి నాడు 'పొంగలి' (ఒక భోజ్య విశేషము) చేసి గవిరమ్మకు, సంక్రమయ్యకు నైవేద్యం పెట్టి తామూ ఆనందంతో సేవిస్తారు.

అరవల సంప్రదాయం

అరవ దేశంలో సంక్రాంతికి 'పొంగల్' అని పేరు. దీనికి 'బంగారు కాంతులు' అని అర్థము. ఈ పదం మొదట సూర్యుని బంగారు కాంతులకు, తరువాత ఒక భోజ్య పదార్థానికీ నామమై ఉంటుంది. సంక్రాంతిని అరవవారు 'తాయ్ పొంగల్' అని కూడా వ్యవహరించటం కద్దు. ఇది వారి మాసాల్లో తై నెలలో రావటంవల్ల దీనికి పేరు వచ్చింది.

సంక్రాంతినాడు తమిళ దేశంలో తమ పూజా గృహాల్లో ఒక చక్రాకారంతో సూర్య భగవానుని సంజ్ఞను నిలిపి ఏడు రంగులతో దాన్ని అలంకరించి నారాయణ స్వరూపుణ్ణిగా పూజిస్తారట! సూర్యభగవానుడే

★ మకర సంక్రమణం ★

క్రొత్త పంటలకు కారకుడనే భావం ఆ సందర్భంలో వారికి ఉంటుందట!!

'పొంగల్' పండుగ మరుసటి దినానికి అరవ దేశంలో 'మాట్టు పొంగల్' అని పేరు. ఆనాడు అరవలు తమ పంటలకు కారణమైన పశువులను పూజిస్తారు. ఇది గోపూజ. సూర్య కిరణాలకు, గోజాతికి 'గో' శబ్దం వర్తిస్తుంది. సూర్యోపాసనా సందర్భమైన సంక్రాంతి సమయంలో పశుపూజ యీ శబ్దార్థాన్ని బట్టి చూచినా ఎంతో సొబ్బుగా ఉంది. పశువులకు స్నానం చేయించి పసుపు కుంకుమలతో వాటిని అలంకరించి పూజించి పొంగలి ఎత్తటం కర్షకులకే కానికి ఎంతో ఆనందదాయకంగా ఉంటుంది. ఈ సందర్భంలోనే వారు పశువులకు పందాలు వేస్తారు. ఈ పశువుల పందాల్లో అరవ దేశంలో జరిగే 'జల్లికట్టు' మహా భయంకరంగా ఉంటుంది. బాగా మదించిన ఒక కోడెకొమ్ముకు ధనపు సంచీని కట్టి వెనకనుంచీ దానికి తప్పెట్లు, డోళ్లు, రుంజలతో కైపు ఎక్కించి, దాన్ని బరిలో వదిలిపెడతారు. అది ప్రళయ భయంకరంగా చిందులు వేస్తుంటే దాన్ని పొడిచి కోపం తెప్పిస్తారు. అటువంటి పశువులను లొంగదీయటానికి కొందరు మల్లులు పూనుకుంటారు. అందులో విజయం పొందినవానికి ఆ కోడె కొమ్ముకు కట్టిన ధనపు సంచి లభిస్తుంది. ఆంధ్రదేశంలోనూ ఇటువంటి పశువులపూజ, పందాలు కొన్ని ప్రాంతాల్లో జరుగుతవి. ఈ పశువుల పూజ సందర్భంలో పుట్టినవే "వీథి వీధుల వెంట విడువరమ్మా మానందినీ, శివనందినీ" అన్న నందిపాటలూ, 'రాగల్లు దున్న' పాట మొదలయినవి.

ఏడు కన్నెరాళ్లు

సంక్రాంతి మూడవనాడు తమిళ దేశంలో ముఖ్యంగా కన్యలు 'కన్నెపాటలు' పాడుతారు. ఆ కనుమనాడు కన్యలు ఉదయమే లేచి ఊరిబయటవున్న మామిడితోపుకు వెళ్లుతారు. అక్కడ ఒక మామిడి చెట్టు బోదె దగ్గిర 'ఏడు కన్నెరాళ్లు' ఉంటవి. వాటిని అంతా కలిసి పాటలుపాడి నాట్యంచేసి పసుపు కుంకుమలతో పూజిస్తారు. ఈ నృత్య జాతికి చెందినవే 'కుమ్మి' 'తట్టర పాట్టు' అన్న నాట్యవిశేషాలు. గ్రామం బయట మామిడిచెట్టుక్రింద ఉన్న ఈ కన్యలు ఎవరనే అభిప్రాయంలో అనేక మతాలున్నవి. వీరి సంఖ్యనుగురించి కూడా అభిప్రాయ భేదాలున్నవి. అక్కడ కన్నెలు పాడే పాటల్లో ఒకదానిలో "ఇంద తెరువిల్లె ఆరు కన్ని; అంద తెరువిల్లె ఆరు కన్ని" అన్న భాగాన్ని బట్టి వీరు పన్నెండుమంది అని తెలుస్తున్నది. కొందరు వీటిని ప్రకృతి శక్తులన్నారు. పన్నెండు అన్నవారు ఇవి ఉత్తర దక్షిణాయనాల్లో ఉన్న ఆరు, ఆరు మాసములనే కన్నెలన్నారు. వైజన్‌బాక్ అనే సాంఘిక శాస్త్రజ్ఞుడు 'దక్షిణభారతీయ దేవతల సంస్కృతము' అన్న తన గ్రంథంలో వీరు శైవకవల్ల ఉద్భవించిన మాతృశక్తులన్నాడు. తమిళ నిఘంటువు వీరు ఏడుగురూ అక్కచెల్లెండ్రనీ వారు వరుసగా పితామహీ, నవయామి, మాహేశ్వరి, మాహేశ్వరి, కౌమారి, వారాహి, రుద్రాణి అని చెప్తున్నది. అయిన వీరు సంస్కృత సాహిత్యంలోని సప్తమాతృకలు.

కనుమనాటి మర్నాడే ఆంధ్రదేశంలో నూతన వధువులు సావిత్రీ గౌరి నోములు ప్రారంభిస్తారు. ఇవి తొమ్మిది దినాలు జరుగుతవి. ఇందులో ముఖ్యంగా కన్యలు ఉత్తమ పతివ్రతలైన సావిత్రీ, గౌరీ దేవతలను తమకు వారివంటి పతిభక్తిని ప్రసాదింపమని అర్థిస్తారు. తొమ్మిది దినాలూ అమ్మవారిని తొమ్మిది నైవేద్యాలతో సేవిస్తారు.

ఆర్యద్రావిడ సమ్మేళనం

దక్షిణ భారతదేశంలో నేడు సంక్రాంతి పండుగల్లో కనిపించే ఆచారాల్లో ఆర్యద్రావిడ సంప్రదాయ సమ్మేళనం గోచరిస్తుంది. ఈ విషయాన్ని గురించి ఒక రచయిత ఇలా వ్రాశాడు "ఉత్తర సర్కారుల వారు తమిళ దేశంనుంచి గొబ్బిపూజ, పొంగలి నైవేద్యాన్ని గ్రహించారు; కాని మాట్టు పొంగలి గ్రహించలేదు. కడప చిత్తూరు జిల్లాలకు తమిళ దేశంతో సన్నిహిత సంబంధం ఉండటంవల్ల అక్కడ పశువుల పండుగ కనిపిస్తున్నది. కన్నడులు ధనుర్మాసంలో 'గొబ్బి పూజ'ను సంక్రాంతి నృత్యాలను తమిళులనుంచి గ్రహించలేదు." ఈ వ్రాతలలో కొన్ని అంశాలు ఒప్పుకున్నా గొబ్బిపూజ విషయం అంగీకరింప వీలు లేదు. ఆంధ్రదేశంలో గొబ్బిపూజ అనాదినుంచిఉంది. ఇది బౌద్ధమత ప్రాభవంవల్ల వచ్చింది. ఆంధ్ర బౌద్ధము బుద్ధునికి పూర్వకాలంనాటిదనికూడా కొందరు చరిత్రకారులు భావించటం ఇందుకు చక్కని తార్కాణం.

సంక్రాంతిపండుగను ఉత్తరాయణ పుణ్యకాలమని ఆంధ్రులు వ్యవహరిస్తారు. ఇది పుణ్యకాలమని అన్ని ప్రాంతాల్లోనూ భావిస్తారు. 'అయన' శబ్దానికి 'మార్గము' అని అర్థం "రపాభ్యాం నోణస్సమానపదే" అన్న వ్యాకరణసూత్రంవల్ల అయనము అయణమవుతుంది. సూర్యభగవానుడు మేషాదిగా ఉన్న పన్నెండురాసుల్లో ప్రయాణం చెయ్యటానికి పన్నెండు నెలలు పడుతుంది.

> **అభిమానపాత్రులు**
>
> "నేను ఆస్పత్రిలో ఉన్నప్పుడు, నా స్నేహితులంతా రోజూ వచ్చి చూసివెళ్లేవారు"
>
> "పాపం. మీరంటే అంత అభిమానమున్నమాట"
>
> "మరే మరే. పైగా నేనున్న వార్డులో నర్సు చాలా బాగుండేదనుకో..."

ఆయన కటకాదినుంచి దక్షిణంగానూ మకరాదినుంచి ఉత్తరంగానూ పయనిస్తాడు. ఋగ్వేదంలో (1—164—12) సూర్యుణ్ణి గురించి "కొందరు ఇతణ్ణి అయిదు పాదాలు, పన్నెండు రూపాలు (12 మాసాలు) కలిగిన పిత అనీ, ఏడుచక్రాలు ఆరు ఆరలు(ఋతువులు) కలవాడనీ, అర్పితుడు అని అంటారు" అనే అర్థం వచ్చేమంత్రం కనిపిస్తున్నది. జ్యోతిశ్శాస్త్రజ్ఞులు ఈ పితరుడైన సూర్యభగవానుని రెండు యానాలకూ ఉత్తర దక్షిణములైన అయనము అని పేరుపెట్టినారు. ఆయన ఉత్తర ప్రయాణాన్ని దేవయానంగా భావించారు. ఈ దేవయానసమయంలో సూర్యభగవానుడు తన అకలంకమైన జ్యోతిస్సుతో ప్రకాశిస్తాడు కాబట్టి ఇది పుణ్యకాలంగా భారతీయుల చేత గౌరవింపబడుతూ ఉన్నది. ఈ విజ్ఞాన విశేషంతో ఎవరు సూర్యభగవానుని పూజిస్తారో వారికి తప్పక పుణ్యలోక ప్రాప్తి చేకూరుతుంది. సూర్యభగవానుని ఉత్తర దక్షిణాయనాన్ని గురించి భావించిన ఒక శ్లోకాన్ని క్రింది భావన ఈ సూర్యోపాసనా సమయంలో జ్ఞప్తికి తెచ్చుకోదగ్గది.

"రథస్యైకం చక్రం, భుజగ
యమితా, స్సప్త తురగాః,
నిరాలంబో మార్గః,
చరణ రహిత స్సారథి రపి
రవిర్యాత్యేవాంతం
అనుదిన మనంతస్య నభసః
క్రియా సిద్ధిః సత్త్వే భవతి
మహతాం నోపకరణే"

(రథానికి ఒకే చక్రము, సర్పముల చేత నియంత్రితములైన ఏడుగుఱ్ఱములు, మార్గమా ఆశ్రయము లేనిది; సారథి పాదములు లేనివాడు; దినదినమును దరిలేని ఆకాశపు కొనను (సూర్యభగవానుడు) చేరుచున్నాడు; కార్యము నెఱవేఱుటకు ప్రభావమే గాని సాధన సంపత్తి అవసరము కాదు.) ★

(21 వ పేజీ తరువాయి)

"మా నాన్న ఈమధ్య వివాహం చేసేయించాడు తెలుసా?" అంది సుందరమ్మ నవ్వుతూ.

సుమిత్ర అర్థం కానట్టు అదోలా చూసింది.

"ఎందుకో తెలుసా?"

"ఎందుకేమిటి?"

"శోభనని!"

సుమిత్రకేమీ అర్థం అవలేదు. [illegible] వీళ్ళ తాతగారికి శోభనా?

"తాతగారికి శోభనం కాదు. మనవడి గారి శోభనుకి తక్కువొచ్చిందని. మరి తాతకీ మనవడికీ ఫ్రెండ్షిప్ కదుటమ్మా?"

సుమిత్రకింకా అర్థమవలేదు.

"ఇంకా బోధపడలేదుటమ్మా వెర్రిపిల్లా, తాతగారు మనవణ్ని ముద్దెట్టుకోబోయారుట. మీసాల తాకిడికి మనవడు ఒప్పుకోలేదుట. ఇంకేముంది మహారాజానయినా ముట్టుకోనియ్యని ఆ మీసాలకి మంగలాడిపని తగిలింది... నాకే చిత్రం వేస్తుంది సుమిత్రా! ఏభైఏళ్ళ వయస్సున్న దీ మీసం. వయస్సువాడు రోజుకు అరగంట దువ్వే దీ మీసం. కానియ్యి ఆఖరికి మా తెల్లి మనవడి పాలబడింది.

ఏ వస్తువు ఎన్నాళ్ళుంటుందో చెప్పలేముగదా!"

సుందరమ్మ మళ్ళీ నవ్వుకి అంకించుకుంది. ఈసారి సుమిత్రకూడా నవ్వడానికి ప్రయత్నం చేసింది. కాని ఆమె హృదయంనిండా ఏదో మధురమయిన ఆవేదన నిండిపోయి నవ్వలేకపోయింది.

ఎవరివాళ్ళు వాళ్ళకి అలాగే ఉంటారు కాబోలు! మళ్ళీ యీ గుంటవెధవ లేడూ, ఎవరు, నాకొడుకు అనంతు, వాడు 'కీ' అంటే చాలు మా నాన్న చెవులు మూసుకునేవాడు. ఇప్పుడు బాబుగాడు కొబ్బరిబూరా తెచ్చి చెవులో ఊదినా ఆ తాతగారికి ఆనందంగానే ఉంది. ఐనా ఆయన్ని లాభం ఏముందిలే, అమ్మ పోయిన తర్వాత ఆయన తరహాయే మారిపోయింది.

సుమిత్రకు అత్తగారు జ్ఞాపకానికి వచ్చింది. ఆమె కాపురానికి రాకముందే అత్తగారు చచ్చిపోయింది. అత్తగార్ని గురించి భాస్కరం చెప్పే మాటలు ఆమెకి హఠాత్తుగా జ్ఞాపకమొచ్చేయి.

"పదిమందిఉంటారని పూర్వకాలం కట్టుకున్న పెద్దిల్లు తప్ప ఇందులో మాత్రం ఎవరున్నారు సుమిత్రా! కాపరానికి వెళ్లేవరకూ మా సుందరమ్మక్క ఉండేది. నేను స్కూలు ఫైనలు ప్యాసయి కాలేజీలో చేరినా, తరవాత యం.బీ. చదువుతూ వాల్తేరులో ఉన్నా ఇంట్లో అమ్మా నాన్నా యిద్దరే ఉండేవారు. వాళ్ళ ప్రోగ్రాం ఏమిటో తెలుసా? పూర్వకాలపు వాళ్ళమో ఎనిమిదీ ఎనిమిదిన్నరకల్లా నిద్రపోయేవారు. ఎంత సేపని పడుకొంటారు? తెల్లారుఝామున నాలుగింటికో యిద్దరూ లేచిపోయే వారు. లేచి ఏం చెయ్యాలి గనక? అలా అమంచంమీద మాఅమ్మ, యీమంచం మీద మానాన్నా కబుర్లకి మొదలు పెట్టేవారు. మా అమ్మ ఏదంటే అది కాదనడం మానాన్నకి సరదా. ఆయనతో గిల్లికజ్జా పెట్టుకోడం మాఅమ్మకు హాబీ. తెల్లారే సరికి యిద్దరూ పెద్ద దెబ్బలాటతో లేచేవారు. నువ్వు నమ్మవేమోగాని యించుమించు ప్రతి నిత్యం వాళ్ళ కార్యక్రమం అదే. ఓసారి పాకం ముదిరి దెబ్బలాట పెచ్చు పెరిగి మా అమ్మ మా నాన్నని ధడామడా తిట్టేసిందిట. దాంతో మా నాన్నకి కోపం వచ్చి అయిదు మైళ్ళ దూరంలో పల్లెటూళ్లో ఉన్న మా పింతండ్రి గారింటికి వెళ్ళిపోయాట్ట. ఎప్పుడూ రాలేదేమో మా నాన్నని మా బాబాయి వాళ్ళూ నెత్తిమీద పెట్టుకునిచూశారుట. ఎంత యిదిగాచేసినా ఆయన ఏదోలోటు ఫీలయ్యారుట. తరువాత యింటికొచ్చేక ఓసారి మాఅమ్మతో గట్టిగా దెబ్బలాడేకాక మనసు తేలిక పడిందట, బాగుందా?'

ఈ మాటలన్నీ సుమిత్రకి మళ్ళీ ఎవరో కావాలని చెబుతున్నట్టు అయింది.

"మాఅమ్మ పోయింతర్వాత మానాన్న తరహాయే మారిపోయింది సుమిత్రా—కళ్లలో ఆ పెంకితనం ఆ నిండుతనం మళ్ళీ కనిపించలేదు. మాఅమ్మ ఫోటోవైపు ఆయన చూసినప్పుడల్లా "త్వరగా నా దగ్గరకి రండి. మీరు లేక పోతే సందడేముందీ? నాకేం తోస్తుందీ అని అవిడన్నట్టు ఉంటుందని మానాన్న నాతో చెప్పే వారు సుమిత్రా!"

భాస్కరం చెప్పిన ఈ మాటలు మళ్ళీ జ్ఞాపకానికి వచ్చి సుమిత్ర కొంగుతో కళ్లు తుడుచుకుంది. మనవణ్ని మీదవేసుకుని గుఱ్ఱమెక్కి నవ్వడూ, పకపక నవ్వినప్పుడు తన మామగారిలో పెంకితనం, నిండుతనం మళ్లీ కనపడలేదా?

సుందరమ్మ కొంగు పట్టుకుని పాపాయి లాగింది.

"అమ్మా మనం యివాళ సాయంత్రం బండిలో నాన్నగారి దగ్గిరకెళిపోతాం కదుటే?"

'అవును' అంది సుందరమ్మ.

"తాతని...తాతని...బాబుగాడ్ని కూ మనతో తీసుకెళ్లద్దుటే?" అందిమరి పెంగా

'అవునే అమ్మా, బాబును మనతో తీసుకెళ్ళొద్దుటే?' అన్నాడు అనంతు.

'మనతో వాళ్ళెందుకు పంపుతారే వెర్రితల్లీ!' అంది సుందరమ్మ.

దానికేముంది వదినా, తప్పకుండా తీసుకెళ్ళు, వాడు రావాలేగాని — నా అను రోజులు అల్లరి తప్పినా తప్పినట్టే. వెధవ కాల్చుకు తినేస్తున్నాడు...ఎక్కడ సుఖపడిపోతానో అని పెళ్ళయిన ఏడాదిలో పిలిచినట్టు పరుగెత్తుకొచ్చాడు!'

సుందరమ్మ నవ్వింది.

'ఏం చోద్యమమ్మా మరీనీ! ఈ వయసుకి ఆ కాలంలో నలుగురు పిల్లల్ని ఎత్తుకొనే వారట! ఒక్కగా నొక్క వెధవ వాడు నీకు బరువయ్యాడూ?'

సుమిత్ర మాటాడలేదు.

ఏం అత్తా, నిజంగా బాబును తీసికెళ్ళమన్నావా?' అని అడిగింది పాపాయి సుమిత్రని.

'చాలేఊరుకో, వెర్రినాగమ్మ: మా తెల్ల వెధవ తల్లిని విడిచి ఎలా వస్తాడూ?' అని కొప్పడ్డాడు ముసలాయన. నిజానికి సుందరమ్మకి మేనల్లుణ్ణి ఓసారి సరదాగా తీసుకెళ్ళాలని ఉంది. వాడి ఆకారమూ, వాడి కబుర్లూ అలాంటివి. వాడు ఓచోట ఉంటే పదిమంది వాడి చుట్టూ చేరతారు. ఈమధ్య తన దగ్గిరా చనువయింది.

'మధ్యన నీకెందుకు నాన్నా, [illegible] ఏదో అడుగుతేనూ! అయినా వదినకూ పంపించాలనే ఉండాలిగాని వాడు తల్లిని విడిచి పెట్టి ఉండలేక పోడమేమిటి అర్థం లేని మాట! మొన్న పిల్లిద్దరూ కాకినాడ వెడితే ఉండలేదూ నా దగ్గర?'

'నాకేం అభ్యంతరం లేదు వదినా! వీడుంటే ఒక్కసారూను వద్దుకోనియ్యడు. అక్కడ మళ్లీ ఏమల్లరి పెడతాడో ఏమో! అయినా మీ దగ్గిర చనువయింది కదూ! ఏం బాబూ, అత్తతో వెడతావా?'

బాబుగాడు మొహం పైకెత్తాడు.

'ఏం అమ్మా, బాబూ! మాతో వస్తావు కదూ?' అంది పాపాయి.

'అవునా బాబూ! వెళ్ళిపోతావా?' అని దీనంగా అడిగాడు ముసలాయన. బాబుకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు.

'నీకు బిస్కట్లూ బిళ్ళలూ యిస్తాను, కథలు చెబుతాను. మనం రైలెక్కుదాం, ఎంచక్కా కారెక్కుదాం, వస్తావా?' అని అడిగేడు అనంతు.

'అమ్మ నీతో రాదుట, అటువైన నీ యిష్టం' అన్నాడు తాత.

చిన్నబాబు మళ్లీ [illegible]లో పడ్డాడు.

★ సుమిత్ర ★

"పుత్రాణ్ణి విడదీయడం బాగానే ఉంది. ఒక్కమాట సరిగ్గా చెప్పు సుమిత్రా, వాడు నిన్నొదిలి ఉండగలడా?"

"వాడికి నా ధ్యాస ఎప్పుడూ లేదు. ఎక్కడబడితే అక్కడే ఉంటాడు." అంది సుమిత్ర మేనల్లుణ్ని భర్తకి చూపిద్దామని సుందరమ్మకి ఎప్పట్నుంచో ఉంది.

"సరే తీసుకువెళతామమ్మా, — ఎల్లుండి కదూ ప్రయాణం మీది? ఈ రెండ్రోజులూ ఉంచుకొని అక్కడికి దగ్గిరేకదూ ఆయన్నిచ్చి దిగబెట్టిస్తాను - సరేనా? వీడి బట్టలేవీ యిస్తావా సర్దుతాను" అంది సంతోషంతో సుందరమ్మ.

సుమిత్ర రెండు జతలు శుభ్రమైనవి తెచ్చిచ్చింది. పక్కనేఉన్న ముసిలాయన మొహం చూసింది. ఆయన మొహం అంత నల్లగా మాడిపోయి ఉండడం ఆమె ఎప్పుడూ చూడలేదు సుందరమ్మ చేతిలో బట్టలు ఆయన చేత్తో కింద పారేశాడు.

"చిన్నపిల్ల ఆ అమ్మాయికి మతిలేకపోతే పెద్దదానివి నీ బుద్ధేమయింది? మీ ముచ్చట కోసం నోరెరగని ఆ గుంట వెధవని తల్లి నుంచి వేరుచేస్తారా? ఇదేమయినా బాగుందేమో వాణ్ణి రానీ అడుగుతాను" సరిగ్గా ఆ సమయానికే భాస్కరం యింటికి వచ్చాడు. ముసిలాయన లోపలికి వెళ్లిపోయాడు. సుందరమ్మ అంతా చెప్పింది.

"దానికేముందే పెద్ద భాగ్యం? తప్పకుండా తీసుకెళ్ళు" అన్నాడు.

సాయంకాలమయింది. బండి వచ్చి వీధిలో నిలబడింది. సామాన్లు ఒకటీ ఒకటీ లోపల పెడుతున్నారు.

"బాబూ, అత్తని అల్లరిపెట్టకూ, పాపాయీ ఆనందూ చెప్పినట్లు వినూ."

అని కొడుక్కి చెబుతోంది సుమిత్ర. సుందరమ్మ లోపలికెళ్ళి తండ్రి కాళ్ళకి దండం పెట్టింది. 'వస్తాను నాన్నా' అంది. ముసలాయన అటు తిరిగి పడుకున్నాడు. ఆయన అలకకి కారణమేమిటో సుందరమ్మకి అర్థం కాలేదు.

"పాపాయీ, ఆనందూ, బండి ఎక్కండి" అని ఆమె వదిన చేతిలో పిల్లాణ్ని అందుకుంది. 'వస్తాను వదినా, తమ్ముడూ అక్కడికి వెళ్ళగానే రాయండేం' అంటూ బండి ఎక్కింది. బండి కదిలింది. భాస్కరం, సుమిత్ర బండి చివర తల్లికోసమయినా ఏడవకుండా నిశ్చింతగా కూర్చున్న బాబుగాణ్ని చూస్తూ అయిదు నిముషాలు నిలబడ్డారు. గది తలుపు ధళ్ళున తెరుచుకుంది. ముసిలాయన ఒక్క పరుగున బండిదగ్గిరకు వెళ్ళి చివర్న కూర్చున్న బాబును గబుక్కున లాగి... 'వెధవా, ఎవరికీ లేకపోతేపోయింది నీకైనా ఉండొద్దూ బుద్ధి?" అని ఛళ్లుమని ఒక్క లెంపకాయ—గి ఏడుస్తున్న వాణ్ని అలాగే ఎత్తుకొని గదిలోకి తీసుకెళ్ళి ధళ్లని తలుపు వేసేసి అల్లంతదూరాన బండిలో ఉన్న సుందరమ్మకు కూడా వినపడేంత గట్టిగా "ఈసారి తీసుకెళ్ళండి పిల్లాణ్ని నాదగ్గర్నుంచి యెవరైనా, చెబ్తాను" అని అరిచాడు. భాస్కరం తండ్రి చేష్టలకు కొయ్యబారిపోయాడు. సుందరమ్మ మాత్రం "బాగుంది, ముసిలాయనకి పిచ్చెక్కినట్టుంది. మా ఆయనకి వీణ్ని చూపించి సంతోష పెట్టడం మాట దేముడెరుగు—యిప్పటికే ఆలస్యమయింది, యింకా ఉండిపోయానంటే ఆయనసలే ముక్కోపి— చెయ్యికూడా చేసుకుంటారేమో! కొంచెం త్వరగా తోలు బండబ్బీ" అంది. సుమిత్రమాత్రం మొదట ఆశ్చర్యపడినా ముసలాయన చేసిన ఈ విచిత్రచర్యలకు ముసిముసినవ్వులు నవ్వుకుంది. ఇన్నాళ్ళకు ఒక సమస్య దానంతటదే పరిష్కరింపబడినట్టు భావించి ఆమె మనస్సు అతి తేలిక అయింది. బాబుగాడిని తనతో వదిన తీసుకెడతానన్న దగ్గర్నుంచి ముసిలాయన చూపిన ఆటంకాలు తలుచుకొని ఆమె నవ్వుకుంది. ఈ రెండురోజులకే ఆయన మనవణ్ని వదిలి ఉండలేరే, తాము వేరే కాపురం పెడితే?

"ఈసారి పిల్లాణ్ని నాదగ్గిర్నుంచి ఎవరైనా తీసుకెళ్ళండి చెబుతాను" అన్నారు ఆయన! నిజానికి ఆయన దగ్గిర్నుంచి ఆ పిల్లాణ్ని లాక్కునే హక్కు ఎవరికుంది?

వాళ్ళిద్దర్నీ విడదియ్యడానికి తనెవర్తె?

పిల్లాడికి గుచ్చుకుంటాయని మీసాలు తీయించేసిన తాతగారు, పిల్లాడు గంటలకొద్దీ గుఱ్ఱమని మీదెక్కి తొక్కినా జబ్బుపడడానికి సిద్ధపడిన తాతగారు, వాడు ఎక్కడికో వెడతాడని మాటమాత్రంవినగానే మండిపడిపోయిన తాతగారు వీళ్ళిద్దరికీ కాకుండా చెయ్యడానికి తన కేమధికారం ఉంది?

చిగురూ పండుటాకులూ ఒక కొమ్మ భాగాలే. ఎవరు విడదీయగలరు?

సుమిత్ర కిటికీలోంచి చూసింది.

మామగారు అటుతిరిగి పడుకునిఉన్నారు.

"తాతా, తాతా నాతో మాట్లాడవా?" అంటున్నాడు బాబు.

"ఎందుకు మాటాడుతాను? మరి నువ్వు మీ అత్తతో వెళిపోతానన్నావుగా!"

> మేష్టారు: "అమెరికానుండి ముఖ్యంగా ఎగుమతి అయ్యేదేమిటి?"
>
> విద్యార్థి: "డబ్బు."

"ఇంకెప్పుడూ అనను ఎల్లను. ఎల్లనంటే ఎల్లనుగా. మా అమ్మతోటీ ఎల్లను."

'ఎందుకు వెళ్లవు బాబూ? నా పిచ్చికొద్దీ నిన్ను పరిగెత్తుకెళ్ళి తెచ్చుకున్నాను. రెండు మూడు రోజుల్లో నువ్వు వెళ్లిపోతావు ఈ పిచ్చి తాత ఎవరిక్కావాలి? మీ నాయనమ్మకే అక్కర్లేక పోయింది!'

ముసిలాయన పై కండువాతో కన్నీళ్లు తుడుచుకున్నాడు. సుమిత్ర యివతలనుంచి కష్టపడి కన్నీళ్లు ఆపుకుంది ఆమె విచారాలూ, విలాసాలూ, ఆశా సౌధాలూ ఏమయ్యాయో చెప్పలేము. ఆమెలో స్త్రీ సహజమైన కరుణ, మాతృవేదన, జాలి పొంగి పొర్లి పోయాయి.

ఇద్దరికీ బొక్క పళ్లే. ఇద్దరివీ బోడిగుళ్లే. ఇద్దరివీ పిచ్చి కబుర్లే

'నాకు ఒకరు కాదు. యిద్దరు పిల్లలు!' అనుకుంది సుమిత్ర. ఆమెకు ఆనాటి మామగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి

'మనం దేవాలయానికి వెడుతూంటామా, దార్లో వందలకొద్దీ బీదవాళ్లు కనిపిస్తారు. కాని మనం వాళ్లని చూడకుండా తొందరగా దైవ దర్శనానికని తహతహ లాడుతాం అందులో అసహజ మేముంది?'

'ఉంది. కావలసినంత అసహజముంది. మూర్ఖత్వమూ అవివేకమూ కూడా ఉంది. బీదవాళ్లనే ఆదరిస్తే దైవ దర్శనం దేనికి?'

— సుమిత్రకు యిన్నాళ్లకు సమాధానం దొరికింది.

'ఇక్కడేంచేస్తున్నావ్? పద మళ్లీ సామాన్లూ అవీ సర్దుకోవాలి'

'ఎందుకూ? నేను వాత్తేరు రాను. మీరిక్కడే ప్రాక్టీసు పెట్టండి'

భాస్కరం ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు ఆమె మొహంలో ఆ కొత్త వెలుగేమిటో అతనికి అర్థం కాలేదు.

* * *

వెన్నెల. వెన్నెల.

మంచి నవ్వులాంటి వెన్నెల. మల్లె పూవులాంటి వెన్నెల.

చందమామ ఉన్నచోట జగమంతా వెన్నెల.


మాతృమూర్తి ఉన్నచోట మనసంతా వెన్నెల. ★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



కోడిపందాలు

చిత్రకారుడు: కేతినీడి శాస్త్రరావు.


ఏ.వి.ఎం వారి
ఉత్తమ పౌరాణిక చిత్రము
నాగులచవితి
...తెలుగు...
అచంచల భక్తి విశ్వాసములకు అగ్నిపరీక్ష
పాతివ్రత్య మహత్యమునకు పరమావధి
AVM
ప్రొడక్షన్సు
డైరెక్షన్ : చిత్రపు నారాయణమూర్తి
G.H.RAO